అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 9-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 98 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + (వెబ్‌లో సోపతి) వెల : 8.00

మోడీ గో బ్యాక్...



చెన్నై: ప్రధాని మోడీకి తమిళనాడులో నిరసన సెగ తగిలింది. పోస్టర్లు,బ్యానర్లు, నల్ల బెలూన్లు ప్రదర్శించారు.



కలిసి రావట్లే...

కేంద్రానికి రాష్ట్రం సహకరించట్లేదు

- అవినీతి, కుటుంబపాలన అభివృద్ధికి అవరోధాలు
- నాపై దాడికి అందరూ ఏకం అయ్యారు
- చట్టం తనపని తాను చేసుకుపోతుంది :సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ బహిరంగ సభలో ప్రధాని మోడీ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అభివృద్ధి విషయంలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి, కుటుంబపాలన కొనసాగుతున్నాయనీ, వాటి నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తామని చెప్పారు. శనివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రధాని నరేంద్రమోడీకి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలును ప్రారంభించారు. అంతకుముందు ఆ రైలులో స్కూలు విద్యార్థులతో మాట్లాడారు. అక్కడే ఎమ్ఎమ్‌టీఎస్ ప్రత్యేక రైళ్లకు కూడా పచ్చజెండా ఊపారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరయ్యారు. అక్కడి నుంచి వర్చువల్ (ఆన్‌లైన్)లో బీబీ నగర్ ఎయిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఆ తర్వాత పలు జాతీయ రహదారుల నిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

నిజాయితీతో పనిచేసే వారంటే అవినీతిపరులకు భయమంటూ స్వీయకితాబునిచ్చు కున్నారు. హైదరాబాద్ అనే పదాన్ని ఉచ్చరించకుండా "భాగ్యలక్ష్మి దేవాలయ నగరాన్ని వేంకటేశ్వరస్వామి నగరంతో కలిపాం" అని చెప్పారు. ప్రియమైన సోదర, సోదరీమణులారా...అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన ఆ తర్వాత హిందీలో మాట్లాడారు. కరోనాతో పాటు రెండు ...2లో

మీరొచ్చింది ఎందుకు...!

అభివృద్ధి పనుల కోసమా.. మాపై విషం కక్కడానికా..?

ప్రధానిని ఉద్దేశించి మంత్రి హరీశ్ ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శనివారం రాష్ట్రానికి విచ్చేసిన ప్రధాని మోడీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికి వచ్చినట్టుగా లేదనీ, తమ ప్రభుత్వాన్ని తూలనాడటానికే ఆయన వచ్చారని మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. 'మీరు అభివృద్ధి పనుల కోసం వచ్చారా..? లేక మమ్మల్ని తిట్టటానికా...?' అని ఆయన మోడీని ప్రశ్నించారు. ప్రధాని తెలంగాణపై తన కడుపులోని విషాన్ని మొత్తం కక్కారని పేర్కొంటూ ట్వీట్ చేశారు. 'పర్యటన సందర్భంగా మోడీ మాట్లాడిన ప్రతీ మాటా సత్య దూరం. ప్రధానిగా ఇన్ని అబద్ధాలాడటం ఆయనకే చెల్లింది...' అంటూ విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచీ ఆసరా పెన్షన్లు, రైతు బంధు లాంటివి నేరుగా లబ్దిదారుల ...2లో

తమిళనాడులో అలా..తెలంగాణలో ఇలా..

ఎందుకీ వేర్వేరు నిబంధనలు? : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమిళనాడులోని బొగ్గు గనులను వేలం జాబితా నుంచి కేంద్రం తప్పించిందని రాష్ట్ర మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. సింగరేణి కాలరీస్ విషయంలోనూ తాము ఇదే డిమాండ్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు బొగ్గు గనులను ...5లో



మోడీ హటావో సింగరేణి బచావో

సింగరేణి వ్యాప్తంగా కార్మికసంఘాల ఆందోళన

- బొగ్గు గనుల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్



నవతెలంగాణ- విలేకరులు

సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ రాకను వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు పెల్లుబికాయి. గోదావరిఖని, కొత్తగూడెం, భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి, తదితర ప్రాంతాల్లో కార్మికులు మోడీ హటావో సింగరేణి బచావో అంటూ నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సింగరేణి ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చేలా కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకుంటున్న ...2లో

మోడీ గోబ్యాక్ నినాదాలు, నల్లబెలూన్లు, దిష్టిబొమ్మల దహనాలు, ధర్నాలు, రాస్తారోకోలు...వెరసి రాష్ట్రం ప్రధాని నరేంద్రమోడీపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది. సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోడీ రాకను నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలు పలుచోట్ల తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీశాయి. రాజకీయపార్టీలతో పాటు కార్మిక, యువజన, విద్యార్థి సంఘాలు కూడా మోడీ రాకను వ్యతిరేకించాయి. 'మా జోలికొస్తే ఊరుకోం' అంటూ సింగరేణీయులు బొగ్గు గనుల్లో తీవ్ర నిరసనతో కూడిన ధిక్కార స్వరం వినిపించారు. రాష్ట్రానికి ఏం చేశారంటూ ప్రశ్నించారు. రాజ్యాంగ ధ్వంసం, రాష్ట్రంపై వివక్షను రాజకీయపార్టీల నేతలు ఎత్తిచూపారు. 'చాలా చేశాం' అంటూ ప్రధాని మోడీ పరేడ్‌గ్రౌండ్‌లో చెప్పిన మాటలన్నీ అబద్ధాలేనంటూ నిప్పులు చెరిగారు. పలుచోట్ల నేతల్ని పోలీసులు అరెస్టులు చేశారు.

తెలంగాణ విరోధి

విభజన హామీలు అమలు చేయని ప్రధాని

- రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న కేంద్రం : సీపీఐ(ఎం) నేతలు జి నాగయ్య, డిజి, జ్యోతి
- హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్న 'ప్రధాని మోడీ గో బ్యాక్' అంటూ సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు నినదించారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్ వరకు సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శనను నిర్వహించారు. 'తెలంగాణ విరోధి మోడీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడ?, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలేవీ?, సింగరేణి ప్రయివేటీకరణను ఆపాలి, కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు సీపీఐ(ఎం) నాయకులతో వాగ్వాదానికి దిగారు. షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి జ్యోతి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు అవుతున్నా విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. మోడీ రాకను తెలంగాణ ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నిధులివ్వలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా గుజరాత్‌లో ఇనుప ఖనిజాన్ని అదానీకి కట్టబెట్టారని అన్నారు. ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అవసరం లేదంటూ మోసం చేస్తున్నారని చెప్పారు. గిరిజన వర్సిటీ అడ్రస్ లేదన్నారు. విభజన ...5లో

నిర్బంధం

ఏఐటీయూసీ కార్యాలయం ముందు పోలీసుల మోహరింపు

- ప్రధాని రాక సందర్భంగా అడుగుగడుగునా నిఘా
- నిరంకుశ బీజేపీ నశించాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి



వివరాలు 2లో..

మా బతుకులెట్టా...



నేను ఐదు ఎకరాలు మెరక, ఐదు ఎకరాలు మాగాణి కౌలుకు తీసుకున్నా. పత్తికి బయట అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టా. ప్రతియేటా పత్తి తీతలు పూర్తి కాగానే దాన్ని అమ్మగా వచ్చిన డబ్బులతో పెట్టుబడి పెట్టి మొక్కజొన్న వేస్తాం. ఈ ఏడాది పత్తి దిగుబడి ఆశించినంత లేదు.. ధరా బాగా తగ్గింది. పంట మొత్తం 15 క్వింటాళ్లకు పైగా ఇంట్లోనే ఉంది. బయట అప్పులు తెచ్చాం. వడ్డీలైనా పూడతాయనే ఆలోచనతో చేను దగ్గర పనిలేని రోజు.. నేను, మా ఆడమనిషి కూలికిపోతున్నాం. దానికితోడు మొన్నటి అకాల వర్షానికి రెండు ఎకరాల మొక్కజొన్న కూడా పనికిరాకుండా పోయింది. ఇటు పత్తికి ధర లేదు.. అటు మొక్కజొన్న పోయింది. కౌలు ఎట్టకట్టాలి.. అప్పులెలా తీర్చాలి.. మా బతుకులెట్టా వెళ్లాలో అర్థం కావట్లేదు.

స్వామి, కౌలు రైతు

సీసీఐ ధర పెంచి కొనాలి



నేను ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. మొత్తం పత్తి సాగు చేశా. కౌలు కాకుండా.. ఒక పంటకే ఎకరానికి రూ.20వేలకు పైగా పెట్టుబడి పెట్టా. ఎకరానికి మూడు క్వింటాళ్ల చొప్పునే దిగుబడి వచ్చింది. పెట్టుబడి రూ.లక్షకు పైగా వచ్చింది. నూటికి రూ.2 చొప్పున వడ్డీకి తీసుకొచ్చా. ఇప్పుడున్న ధరకు పత్తి అమ్మితే ఎలా గిట్టుబాటు అవుతుంది. సీసీఐ రంగంలోకి దిగాలి. కనీసం రూ.8వేలకు పైగా ధర పెట్టి కొనుగోలు చేయాలి.

చిన్నపంగు రంజిత్‌కుమార్, కౌలు రైతు



ఇంటింటా విపత్తే

క్వింటాళ్ల కొద్దీ పత్తి నిల్వలు



- గిట్టుబాటు కాని ధరతో కౌలురైతుల దీనావస్థ
- అప్పులు, చేబదుళ్లతో నెట్టకొస్తున్న అన్నదాత
- రోజురోజుకు పడిపోతున్న పత్తి రేట్లు
- కౌలు అడుగుతున్న భూ యజమానులు
- కేంద్రం సీసీఐతో కొనిపించాలని డిమాండ్
- రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి

(పమ్మి నుంచి కె.శ్రీనివాసరెడ్డి / ఆవుల రామారావు)

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో 'నవతెలంగాణ' శుక్రవారం పర్యటించినప్పుడు పత్తి రైతుల దీనావస్థలు మామూలుగా లేవు. ఏ రైతును కదిలించినా ధర లేకుంటే బయట పడేదెట్ల అని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 'ఉగాది పోయి పక్షం రోజులైంది. పోయినేడు డబ్బులు కడితే.. కౌలు కాగితం తిరగరాసుకుందాం..' అని భూ యజమానులు కౌలురైతులకు కబురు పెడుతున్నారు. కౌలు రైతులు ...5లో

నోటీసులు వెనక్కి తీసుకోకపోతే...

క్రిమినల్ చర్యలు

మంత్రి కేటీఆర్‌కు రేవంత్ హెచ్చరిక



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తనకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కె తారకరామారావు ఇచ్చిన లీగల్ నోటీసులపై స్పందించారు. ఆ నోటీసులను వెనక్కి తీసుకోకపోతే తాను క్రిమినల్ చర్యలు తీసుకుంటానని మంత్రి కేటీఆర్‌ను హెచ్చరించారు. గత నెల 28న రేవంత్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసు పంపిన విషయం తెలిసిందే. దానికి రేవంత్ ఏడు పేజీల సమాధానాన్ని ఇచ్చారు. ఆ విషయాన్ని శనివారం మీడియాకు ఆయన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమమే ...2లో

రూ.5 వేల కోట్ల ప్రత్యేక

గ్రాంటు ఇవ్వండి

సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతుల ఏర్పాటుకు



- ప్రధాని మోడీకి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతుల (ప్రీప్రైమరీ)ని ఏర్పాటు చేసేందుకు రూ.ఐదు వేల కోట్లు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీకి శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో 95 శాతం తల్లిదండ్రులు వారి పిల్లలను మూడేండ్లు నిండగానే పూర్వ ప్రాథమిక తరగతుల్లో చేర్చుతున్నారని తెలిపారు. ఆ ...5లో

ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

- పాఠ్యాంశాల తొలగింపుపై చరిత్రకారుల డిమాండ్ 5లో..

సుఖోయ్‌లో రాష్ట్రపతి

- 30 నిమిషాలు నడిపిన ముర్ము



వివరాలు 5లో..

దేవతలు కాదు... శూర్పణఖల్లా..!



- అమ్మాయిల దుస్తులపై బీజేపీ నేత కైలాశ్ వివాదాస్పద వ్యాఖ్యలు 5లో..

ఎన్‌పీఎస్‌పై కమిటీ

కేంద్ర ఆర్థిక కార్యదర్శి అధ్యక్షతన ప్యానెల్



- కమిటీలో నలుగురు సభ్యులు
- కాల పరిమితి పెట్టకపోవడంపై ఉద్యోగ సంఘాల అభ్యంతరం
- ఓపీఎస్ పునరుద్ధరించాలని దేశవ్యాప్త ఆందోళనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)పై కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ వ్యవస్థను సమీక్షించడానికి ఒక ప్యానెల్‌ను ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక కార్యదర్శి టివి సోమనాథన్ నేతృత్వంలో నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సుల సమర్పణకు కాలపరిమితిని నిర్ణయించలేదు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ ప్రస్తుత ఫ్రేమ్‌వర్క్, నిర్మాణాన్ని బట్టి ఏవైనా మార్పులు అవసరమా? అని కమిటీ సూచిస్తుంది. ఎన్‌పీఎస్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో కమిటీ మార్పులను సూచిస్తుందనీ, సాధారణ పౌరులను రక్షించడానికి ఆర్థిక వివేకం ఉండేలా చూసుకోవాలని కేంద్ర వ్యయ విభాగం జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం తెలిపింది. సోమనాథన్ అధ్యక్షతన ఉండే కమిటీలో కేంద్ర ప్రజా ఫిర్యాదులు, సిబ్బంది వ్యవహారాలు, పెన్షన్స్ మంత్రిత్వ శాఖకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) కార్యదర్శి, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖక సంబంధించిన వ్యయ విభాగం ప్రత్యేక కార్యదర్శి, పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్ (పీఎఫ్ఆర్‌డీఏ) సభ్యులుగా ఉంటారు.ఓపీఎస్, ఎన్పీఎస్ మధ్య వివాదం రాజకీయ అంశంగా మారింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలు ప్రయోజనాలను అందించే పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)కి తిరిగి వచ్చాయి. వాస్తవానికి, గత ...2లో

కామారెడ్డి, కొమురంభీం ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలకు అనుమతి

- మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్య తెలంగాణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. కామారెడ్డి, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోఒక్కో మెడికల్ కాలేజీకి 100 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతి లభించిందని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి శనివారం ట్వీట్ చేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా మరో ఏడు మెడికల్ కాలేజీలకు అనుమతులు ప్రక్రియ ఆయా దశల్లో ఉన్నాయని ఆయన వివరించారు.

నోటీసులు వెనక్కి తీసుకోకపోతే... క్రిమినల్ చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగాల కోసం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన ఉద్యమంతో మంత్రి కేటీఆర్‌కు సంబంధం లేదని పునరుద్ఘాటించారు. ఆయన ఈ దేశంలో లేనందు వల్ల ఆ బాధ తెలియదని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలపై తాను నిరుద్యోగుల తరపున మాట్లాడానని స్పష్టం చేశారు. టీఎస్‌పీఎస్సీకి ఐటీ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నదని పేర్కొన్నారు. అలాంటప్పుడు లీకేజీల తతంగంతో కేటీఆర్ తనకు సంబంధం లేదంటూ ఎలా అంటారని ప్రశ్నించారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న రాజశేఖర్ రెడ్డి నియామకం కూడా ఐటీ శాఖ ద్వారానే జరిగిందని సమాధానమిచ్చారు. 'పేపర్ లీక్.. పేపర్ అవుట్‌కు తేడా ఉంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ అయింది. ఎస్ఎస్‌సీ పేపరు అవుటయింది. బండి సంజయ్ కుట్ర నిజమైతే బెయిల్‌పై ప్రభుత్వం కోర్టులను ఎందుకు ఆశ్రయించలేదు' అని ప్రశ్నించారు. బీజేపీ, కేసీఆర్ ఒప్పందంలో భాగంగానే ఈ డ్రామా నడిచిందని తెలిపారు. వెంటనే టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి పరీక్షలు పెట్టాలని డిమాండ్ చేశారు. సిట్ అధికారులు అసలు దొంగలను పట్టుకోవాలని కోరారు.

ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో రేవంత్ భేటీ

టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన వారితో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ అంశాలపై చర్చించారు. రాబోయే ఎనిమిది నెలలపాటు అవిశ్రాంతంగా పని చేయాలన్నారు. 'ఇది చాలా కీలకమైన సమయం. కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా అమలు చేయాలి. ప్రసార మాధ్యమాల్లో మన వాదన బలంగా వినిపించాలి' అని సూచించారు.బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎవరు, ఎవరి కోసం పని చేస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, నదీమ్ జావిద్ తదితరులు ఉన్నారు.

నిర్బంధం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శనివారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం (సత్యనారాయణ రెడ్డి భవన్) చుట్టూ పోలీసులు వందలాదిగా మోహరించారు. శనివారం ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసన తెలిపేందుకు అనుమతి లేదని నిరాకరించారు. అయినా సీపీఐ శ్రేణులు నలువైపులనుంచి అకస్మాత్తుగా దూసుకొచ్చి పోలీసుల వలయాన్ని ఛేదించుకుని అక్కడ ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని 'మోడీ హటావో - దేశ్‌కే బచావో, మోడీ గో బ్యాక్, నిరంకుశ బీజేపీ నశించాలి, విభజన హామీలు అమలు చేయాలి'..అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోలీసులు ప్రదర్శనను అడ్డుకోవడానికి ప్రయత్నించటంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్తత నెలకొన్నాయి. పోలీసులకు కార్యకర్తలకు మధ్య కాసేపు తోపులాట జరిగింది. అనంతరం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదేండ్ల కాలంలో ఏ ఒక్క విభజన హామీలను అమలు చేయని ప్రధాని మోడీ రాష్ట్రంలో అడుగుపెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ ప్రజలకు ద్రోహం చేస్తున్నదని వాపోయారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి. నరసింహ, వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, సీనియర్ నాయకులు పి. ప్రేమ్ పావని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో పాపాల భైరవుడిలా ప్రధాని

- సాట్స్ చైర్మెన్ డా.ఆంజనేయ గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


అబద్ధాలు, అక్కసుతో నిండిన ప్రధాని మోడీ ప్రసంగంరాష్ట్ర ప్రభుత్వంపై పెంచుకున్న పగకు దర్పణంలా ఉందని సాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ విమర్శించారు. "శనివారం శాపనార్థాలు" సీరియల్‌లా మోడీ మాటతీరు ఉందంటూ శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన ఎద్దేవా చేశారు. "పాడిందే పాడరా పాచి పండ్ల సోదరా" అన్నట్టుగా కుటుంబ పాలన, అవినీతి లాంటి అరిగిపోయిన రికార్డ్‌ను మళ్ళీ మళ్లీ మోడీ వినిపించి విసిగించారని విమర్శించారు. రాష్ట్రంలోని కుటుంబాలన్నీ కేసీఆర్ ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు నిలయాలనే సత్యం తెలిసీ, తలా తోకలేని మాటతీరుతో ప్రధాని పరువు పోగొట్టుకున్నారని పేర్కొన్నారు.రైతు బంధు, బీమా,సాగునీటి ప్రాజెక్టులు, గురుకులాలతో పాటు దాదాపు 450కి పైగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నసకలజనుల సర్కార్ కేసీఆర్ ప్రభుత్వమని ఆంజనేయ గౌడ్ ఈ సందర్భంగా కొనియాడారు. కార్పొరేట్ కుటుంబాలకు కాపలాదారుగా మారి దేశాన్ని దోచిపెడుతున్న మోడీ ,కుటుంబ పాలన పలుకులు పల కడం విడ్డూరమని ఎద్దేవా చేశారు..ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో అతి తక్కువ అవినీతి కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిన సంగతి ప్రధానికి తెలియదా..?అని ప్రశ్నించారు. ప్రభుత్వ సంస్థల అమ్మకంతో సామాజిక న్యాయానికి సమాధి కట్టింది మోడీయేనని ,ఆయన దాని గురించి మాట్లాడటం గురివింద గింజ నైజానికి నిదర్శనమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బోల్తా పడటం ఖాయమని విమర్శించారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో 12న ఇఫ్తార్ విందు..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీయేటా అధికారికంగా నిర్వహించే ఇఫ్తార్ విందును ఈనెల 12న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే ఈ విందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలంటూ సీఎం కేసీఆర్... తన కార్యదర్శి భూపాల్‌రెడ్డిని ఆదేశించారు.

అమిత్‌షాను కలిసిన కిరణ్‌కుమార్‌రెడ్డి




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా నివాసంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నాటక ఎన్నికలపై నిర్వ హించిన భేటీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బి.ఎల్ సంతోష్, కర్నాటక ముఖ్యమంత్రి బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడియూ రప్పలతో పాటు కిరణ్ కుమార్ రెడ్డి, బీజేపీ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. కర్నాటకలో పెద్ద సంఖ్యలో ఉన్న తెలుగు ఓటర్లను బీజేపీవైపు ఆకర్షించేలా అమలు చేయాల్సిన వ్యూహంపై కిరణ్ కుమార్ రెడ్డితో పార్టీ నేతలు చర్చించినట్లు సమాచారం. దక్షిణాదిలో బీజేపీ విస్తరణపై నడ్డాతో కిరన్ కుమార్ రెడ్డి చర్చించారని బి.ఎల్ సంతోష్ తెలిపారు. శనివారం రాత్రి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డిలను కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కిరణ్ కుమార్ రెడ్డిని బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు కలిశారు.

పారదర్శకత పేరుతో పాతర

'ఉపాధి'కి ఆటంకంగా అటెండెన్స్ యాప్



- ఇంటర్నెట్ అందక సూపర్‌వైజర్లు సతమతం
- లబ్ధిదారులకు తప్పని తిప్పలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)పై ఆది నుంచీ చిన్న చూపే చూస్తున్నది. ఏటేటా బడ్జెట్‌లో కోతలు పెడుతూ కూలోళ్ల పొట్టగొడుతూనే ఉన్నది. ఇప్పుడు పని చేసినట్టు నమోదు చేసే మొబైల్ యాప్‌ను తీసుకొచ్చి తిప్పలు పెడుతున్నది. పారదర్శకత కోసమంటూ కేంద్రం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆ యాప్ ఇప్పుడు 'ఉపాధి'కే ఆటంకంగా మారింది. పారదర్శకత పేరుతో 'ఉపాధి'కి పాతరేసే పనిలో మోడీసర్కారు ఉందనే విమర్శలొస్తున్నాయి.









న్యూఢిల్లీ: ఉపాధి యాప్ అమలు అటు సూపర్ వైజర్లకు, ఇటు పని కోరే లబ్దిదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది. యాప్ రాక ముందు సూపర్‌వైజర్లు మ్యాన్యువల్‌గానే ఉపాధి కోరే లబ్దిదారులకు సంబంధించి హాజరు షీట్లను నిర్వహించేవారు. అయితే, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పాత పద్ధతిని తొలగించింది. ఈ ఏడాది జనవరి నుంచి 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్(ఎన్ఎంఎంఎస్)' ద్వారా వర్కర్ల హాజరును నమోదు చేయాలని తప్పనిసరి చేసింది. ఉపాధి పనులకు వచ్చే వారి రెండు ఫొటోలను (ఉదయం, సాయంత్రం) సూపర్‌వైజర్లు ఈ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ యాప్ వినియోగంతో పారదర్శకత పెరుగుదల కంటే ఉపాధికి భంగం కలిగించే విధంగా కనిపిస్తున్నదని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు.

అటెండెన్స్ యాప్ ఉపాధికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. పని ప్రదేశాల వద్ద ఉండే సూపర్‌వైజర్లకు నాణ్యమైన ఇంటర్నెట్ అందట్లేదు. పేలవమైన ఇంటర్నెట్‌తోనే సూపర్‌వైజర్లు వర్కర్ల ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి వస్తున్నది. ఇంటర్నెట్ నెట్‌వర్క్ పేలవంగా ఉండటంతో తాము అటెండెన్స్‌ను సరిగ్గా నమోదు చేయలేకపోతున్నామని బీహార్‌లోని కటిహార్ జిల్లా సిక్కత్ గ్రామానికి చెందిన 'ఉపాధి' సూపర్‌వైజర్ రీనా దేవీ అన్నారు. రీనా దేవీ లాంటి పరిస్థితే దేశంలోని ఉపాధి హామీ సూపర్‌వైజర్లు అందరూ ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా 2.7 లక్షలకు పైగా గ్రామ పంచాయతీలలో వర్క్‌సైట్ల నుంచి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ల రోల్‌లు (పని చేయడానికి ఆసక్తి కలిగి ఉన్న కార్మికులకు సంబంధించిన రికార్డు) అప్‌లోడ్ చేశారు.

ఇలా వందలు, వేలాది మందికి సంబంధించిన ఫొటోలను పని ప్రదేశాల నుంచి సూపర్‌వైజర్లు అప్‌లోడ్ చేశారు. అయితే, డిజిటల్ అటెండెన్స్ పారదర్శకతను పెంచే విధంగా లేవని కొందరు విశ్లేషకులు తెలిపారు. హర్యానా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి అప్‌లోడ్ చేయబడిన ఫొటోగ్రాఫ్‌లను విశ్లేషించగా ఇది తెలిసింది. 'చాలా ఫొటోలు నిరుపయోగంగా ఉన్నాయి. తప్పుడు సమాచారం ఇచ్చేలా కనిపించింది. పని ప్రదేశాలకు సంబంధించి సరైన గణాంకాలు లేవు. ఫొటోలలో స్పష్టత లేదు. అటెండెన్స్ షీట్‌లో ఉన్న సమాచారంతో కార్మికుల ఫొటోలు సరిపోలట్లేదు' అని విశ్లేషకులు తెలిపారు. ఉదాహరణకు.. హర్యానాలోని మేవాట్ జిల్లా నూహ్ బ్లాక్‌లో ఒక చెరువును తవ్వుతున్న నలుగురికి సంబంధించిన ఫొటోలో.. ఎవరి మొఖమూ స్పష్టంగా కనబడలేదు. ఇక బీహార్‌లోని గోపాల్‌గంజ్ నుంచి అప్‌లోడ్ అయిన ఫొటోలో కార్మికుల ముఖాలు లేవు. వారు చేసిన పనికి సంబంధించిన ఖాళీ రోడ్డు మాత్రమే అప్‌లోడ్ చేయబడింది.

ఇలాంటి పరిస్థితులు పలు రాష్ట్రాల్లో ఉన్నాయి. పని చేస్తున్నది నిజమైన లబ్దిదారుడా? కాదా? అన్న దానిని యాప్ గుర్తించలేదని జార్ఖండ్‌లో ఎన్ఆర్ఈజీఏకు చెందిన కార్యకర్త జేమ్స్ హెరెంజ్ అన్నారు. పారదర్శకత పేరుతో తీసుకొచ్చిన ఈ డిజిటల్ అటెండెన్స్ సూపర్‌వైజర్లకు, కార్మికులకు అదనపు భారమని విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. దీనితో ఉపాధి పనికి అంతరాయం ఏర్పడి కార్మికుల కు ఇబ్బందులు తీసుకొస్తున్నదని చెప్పారు. పారదర్శకత పెరిగి, అవకతవకలు తగ్గాలంటే సోషల్ ఆడిట్లు చక్కని మార్గమని ఎన్‌జీఆర్ఈజీఏ కార్యకర్త జీన్ డ్రీజ్ అన్నారు. కార్మికులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చూడటం మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు.

ఎన్‌పీఎస్‌పై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

నెలలో మహారాష్ట్రలోని బీజేపీ-శివసేన (షిండే వర్గం) ప్రభుత్వం కూడా ఎన్‌పీఎస్ కింద ఉన్న ఉద్యోగులకు ఓపీఎస్ ప్రయోజనాలను వర్తింపజేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకంలో తన వాటాను 14 శాతం నుంచి 20 శాతం పెంచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ పథకానికి ఉద్యోగుల వాటా 10 శాతం కాగా, ప్రభుత్వ వాటా 14 శాతంగా ఉంది. 2004 జనవరి తరువాత సర్వీస్‌లో చేరిన ఉద్యోగులను కవర్ చేసే ఎన్‌పీఎస్ కింద, కాంట్రిబ్యూషన్లు నిర్వచించబడ్డాయి. అయితే ఉద్యోగుల ప్రయోజనాలు మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయి.

2004 జనవరి 1 తరువాత రిక్రూట్ అయిన తమ ఉద్యోగులకు సంబంధించి ఓపీఎస్‌ని పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ పరిశీలించడం లేదని ఇటీవలి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది.

2003 డిసెంబర్‌లో ఎన్‌పీఎస్ నోటిఫికేషన్‌కు ముందు ప్రకటించబడిన పోస్టులను ఓపీఎస్‌కి మార్చడానికి, ప్రభుత్వ ఉద్యోగులలో ఒక విభాగానికి మారడానికి కేంద్రం వన్-టైమ్ ఆప్షన్‌ను అనుమతించింది. ఓపీఎస్ కింద, పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులు వారి చివరి డ్రాలో 50 శాతం పొందుతారు. నెలవారీ పెన్షన్‌గా జీతం, డియర్‌నెస్ అలవెన్స్ రేట్ల పెంపుతో మొత్తం పెరుగుతూనే ఉంది. సాయుధ బలగాలు మినహా కేంద్ర ప్రభుత్వం 2004 జనవరి 1 నుండి ఎన్‌పీఎస్‌ని ప్రవేశపెట్టింది. అధిక పెన్షన్ చెల్లింపులు ఖజానాపై భారాన్ని పెంచుతాయనీ, ఆర్థికపరమైన చిక్కులను కలిగి ఉంటాయని తెలిపింది. ఇది ఇటీవల సుప్రీంకోర్టులో వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌కు సంబంధించిన విచారణలో ప్రభుత్వమే ఎత్తి చూపింది. రాష్ట్రాలు తమ ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయనీ, ఓపీఎస్‌కి తిరిగి రావద్దని జనవరిలో ఆర్‌బీఐ హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించిన ఓపీఎస్, ఎన్‌పీఎస్ అంశాలను మిళితం చేసే గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) నమూనాను ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

కాల పరిమితి విధించకపోవడంతో ఉద్యోగ సంఘాలు అభ్యంతరం

కమిటీకి నిర్దీత కాలపరిమితి విధించకపోవడంతో ఉద్యోగ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కమిటీ పేరుతో తమ డిమాండ్లను మరింత కాలయాపన చేసేందుకేనని విమర్శిస్తున్నాయి. ఇది కూడా కంటి తుడుపు చర్యేనని స్పష్టం చేశాయి. ఉద్యోగులను మోసం చేయొద్దనీ, మోసం చేయాలని చూస్తే తగిన పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఎన్‌పీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని దేశ రాజధాని ఢిల్లీలోనూ, రాష్ట్రాల్లోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవలి ఢిల్లీలో ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బిఈఎఫ్ఐ) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన జరిగింది.

కలిసి రావట్లే...

(మొదటిపేజీ తరువాయి)

దేశాల మధ్య యుద్ధం కారణంగా ప్రపంచం తిరోగమనంలోకి వెళ్లిందనీ, భారతదేశం మాత్రం ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నదని చెప్పుకొచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 లక్షల కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో రూ.35 వేల కోట్లతో జాతీయ రహదారుల విస్తరణ, నిర్మాణం చేపట్టామని చెప్పారు. గడచిన తొమ్మిదేండ్లలో భారతదేశ రూపురేఖలు సమూలంగా మార్చేశామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన భారీ టెక్స్‌టైల్ పార్క్‌తో రైతులు, కార్మికుల కు లబ్ది చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ సేవలు విస్తరించా మనీ, ఒక్కరోజే 13 ఎంఎంటీఎస్ రైళ్లను అందు బాటులోకి తెచ్చామని తెలిపారు.

అలాగే సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ మధ్య రైల్వే డబ్లింగ్ పనులు పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తున్నట్టు చెప్పారు. జాతీయ రహదారులు అభివృద్ధి చేస్తూ హైదరాబాద్ -బెంగళూరు నగరాలను అను సంధానం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రగతి పనులు చేపడుతుంటే ఇక్కడి ప్రభుత్వానికి బాధ కలుగుతున్నదని విమర్శించారు. తెలంగాణలో 12 లక్షల మందికి ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకెళ్తున్నామనీ, ఎంఎంటీఎస్ విస్తరణ కోసం



రూ.600 కోట్లు కేటాయించామనీ అన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందనీ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. తనపై దాడి చేసేందుకు వారంతా (ప్రతిపక్షాలు) ఏకమయ్యాయనీ, అయినా తాను వెనక్కి తగ్గబోననీ అన్నారు. అవినీతిపరుల విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందని చెప్పారు.

అంతా వారే...

"రాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతి రాజ్యమేలుతున్నాయి. తండ్రి, కొడుకు, కుమార్తె... అంతా అధికారంలో ఉంటారు. దీనివల్ల అవినీతి పెరుగుతుంది. కుటుంబ పాలన, అవినీతి వేర్వేరు కాదు. కొంత మంది ప్రగతి నిరోధకులుగా మారారు. ప్రజల సొమ్ము అవినీతిపరులకు చేరకుండా చర్యలు తీసుకుంటున్నాం" అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. నేరుగా రైతులు, విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామనీ, దళారీ వ్యవస్థ లేకుండా డిజిటల్ విధానాన్ని తెచ్చామని చెప్పారు. "దేశాన్ని అవినీతి నుంచి విముక్తి చేయాలా.. వద్దా? అవినీతిపై పోరాటం చేయాలా.. వద్దా? అవినీతి పరుల విషయంలో చట్టం తనపని తాను చేసుకోవాలా... వద్దా? అంటూ సభికుల నుంచే సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. జనధన్ ఖాతాలు తెరవాలనే ఆలోచన అప్పటి ప్రభుత్వాలకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశం ప్రథమస్థానంలో ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నరేంద్రమోడీ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అన్నారు. దానిలో భాగంగానే రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారని చెప్పారు.

సీఎంకు ఏం పీకే పని ఉంది- బండి సంజయ్

ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు ఏం పీకే పని ఉందని ప్రధాని సభకు హాజరుకాలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరేడ్‌గ్రౌండ్‌లో సభ అనంతరం అక్కడే ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కోసం తాము వేదికపై కుర్చీవేసి, సన్మానించేందుకు శాలువా కూడా తెచ్చామని చెప్పారు. ఆయన షెడ్యూల్ ఏంటో ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి వేలకోట్ల అభివృద్ధి పనులు వస్తుంటే, కనీస మర్యాదకోసమైనా ఆయన ప్రధానిని కలవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ని పరుష పదజాలంతో విమర్శించారు.

మీరొచ్చింది ఎందుకు...!

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాలో జమవుతున్నాయి. ఈ వాస్తవాలను మరుగుపరిచిన పీఎం... తన వల్లే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ- నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ) మొదలైనట్టు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఇందులో మోడీ గొప్పలు చెప్పుకోవాల్సింది ఏముందంటూ ప్రశ్నించారు.

రైతుబంధును కాపీ కొడితే పీఎం కిసాన్ అయ్యింది. అయినా ఆ పథకం వల్లే మొదటిసారి రైతులకి లబ్ది చేకూరిందంటూ ప్రధాని చెప్పుకోవడం సిగ్గు చేటు. రైతు బంధుతో పోల్చితే పీఎం కిసాన్ సాయమెంత..? వ్యవసాయానికి, పరిశ్రమలకు కేంద్రం చేయూత అని చెప్పటం పూర్తి అవాస్తవం. ఐటీఐఆర్‌ను బెంగళూర్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అర్బిట్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన వెంటనే గుజరాత్‌లో అలాంటి సెంటర్‌నే ఏర్పాటు చేశారు. తెలంగాణలో ధాన్యాన్ని కొనకుండా రైతుల కంట కన్నీరు పెట్టించారు. ఇవన్నీ చేసింది మీ ప్రభుత్వం కాదా మోడీ గారు...' అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు. 'అదానీ వాదం గురించి ప్రజల దృష్టిని మళ్లించటానికి వీలుగా.. లేని పరివారవాదం గురించి మాట్లాడడం మీకే చెల్లింది.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సహకరించటం లేదంటూ ప్రధాని చెప్పడం హాస్యాస్పదం. నిజానికి ఈ పరిస్థితి రివర్స్‌గా ఉంది. రాష్ట్రానికి రావాల్సిన గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, జాతీయ హోదా వంటి వాటిని ఇవ్వకుండా కేంద్రమే తెలంగాణకు సహాయ నిరాకరణ చేస్తోంది...' అని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

మోడీ హటావో సింగరేణి బచావో

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయాలు ఉన్నాయని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం ఎమ్మెల్యే కోరు కంటి చందర్ అన్నారు. సింగరేణి సంస్థకు సంబంధించిన బొగ్గు బ్లాక్‌లను మరోసారి వేలానికి పెట్టడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మహాధర్నాను నిర్వహించారు. గోదావరిఖనిలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పూటకో మాట చెప్పుకుంటూ ఎనిమిదేండ్లుగా పబ్బం గడుపుతోందని, అభివృద్ధిని అటకెక్కించి ప్రజల మధ్య కుల మత విద్వేషాలు రెచ్చగొట్టడమే ఎజెండాగా పెట్టుకొని ముందుకు సాగుతున్న బీజేపీకి భవిష్యతులో ప్రజలు బుద్ధి చెప్పాలని, విభజన చట్టంలోని హామీలు నెరవేర్చని మోడీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్జీ 1 ఏరియాలోని కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్మెంట్‌లు, ఓసీపీలపై నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొన్నారు. భూపాలపల్లిలో జరిగిన మహాధర్నాలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం, బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ పార్టీ, టిబీజికేఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణకు సిరులు గని అయిన మన బొగ్గు గనులను కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి ఎన్నో లక్షల మందికి ఉపాధి కల్పించిందనీ, రోడ్లు, విద్యాల యాలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి మనకు ఆశ్రయా న్ని కల్పించిందని అన్నారు. నేడు తన అనాలోచిత నిర్ణయం వల్ల సింగరేణిని మనకు దూరం చేసేందుకు బీజేపీ తీవ్రం



గా ప్రయత్నిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి బ్లాక్ -3, శ్రావణ్‌పల్లి, పెన గడప గనుల వేలానికి మరోసారి వేలంకు నోటిఫి కేషన్ వేసిందనీ, అయా ప్రక్రియలను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో మహోద్యమం తప్పదని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లోని ఓసీ, నర్సరీ హైవే వద్ద మంచిర్యాల సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యం లో మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

పరీక్షలకు అనుమతించండి

- హిందీ పేపర్ లీక్ కేసులో హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హన్మకొండ జిల్లా కమలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఐదేండ్లు డీబార్‌కు గురైన డీ హరీశ్‌ను ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే మిగిలిన పదో తరగతి పరీక్షలు రాసేందుకు అను మతించాలని హైకోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హరీశ్ తండ్రి డి.రాజు వేసిన అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపారు. హరీశ్ నుంచి విద్యా శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న హాల్ టిక్కెట్ తిరిగి ఇవ్వాలనీ, మిగిలిన రెండు పరీక్షలకు అనుమతివ్వాలనీ, ఈ ఉత్తర్వులు తుది తీర్పుకు లోబడి ఉంటాయని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విచారణను ఈ నెల 24కి వాయిదా వేశారు. ఈలోగా ప్రతివాదులైన పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, హన్మకొండ డీఈవో, టెన్త్ బోర్డు సెక్రటరీ, డైరెక్టర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్, కమలాపూర్ హెడ్‌మాస్టర్/ చీఫ్ సూపరింటెండెంట్లు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు.

శ్రమదోపిడీనే...

- 24 గంటలు దుకాణాలు తెరవొద్దు
- జీవో ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో 24 గంటలు దుకాణాలు తెరిచి ఉంచుకోవచ్చంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వ్యాపరస్తులు, యాజమాన్యాలకు ఉపయోగపడుతుందనీ, వాటిలో పనిచేసే కార్మికులు మాత్రం మరింత శ్రమదోపిడీకి గురవుతారని చెప్పారు. ఇప్పటికే షాపుల్లో ఉద్యోగులు పూర్తి అభద్రతతో పనిచేస్తున్నారనీ, వారికి కనీస వేతన చట్టాలు అమలు కావట్లేదని తెలిపారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిస్‌గా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల జీవోలు సవరించలేదని గుర్తుచేశారు. పెరుగుతున్న ధరలకు, వస్తున్న వేతనాలకు సంబంధం లేకుండా కార్మికులు బతుకులు ఈడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నప్పుడు, యాజమాన్యాలు ఎలా వారి సంక్షేమాన్ని కాంక్షిస్తాయని ప్రశ్నించారు. మహిళలతో కూడా వారి అనుమతితో రాత్రిపూట పనిచేయంచుకోవచ్చనీ, వారి భద్రత, రక్షణ యాజమాన్యాలు తీసుకోవాలని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐటీ ఉద్యోగాలు చేస్తున్న మహిళలకే ప్రభుత్వం రక్షణ కల్పించలేకపోతున్నదనీ, ఇక సామాన్య మహిళలకు యాజమాన్యాలు ఎలా రక్షణ కల్పిస్తాయని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం, అదే కేంద్రం తెచ్చిన కార్మిక చట్టాల కోడ్స్ అమలుకు పూనుకోవడం సమర్థనీయం కాదన్నారు. తక్షణం 24 గంటల జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.10 కోట్లతో కొత్తగా నేచర్ క్యూర్ ఆస్పత్రి అభివృద్ధి


- ప్రారంభించిన స్పీకర్ పోచారం



నవతెలంగాణ-బేగంపేట్

10 కోట్ల రూపాయలతో నేచర్ క్యూర్ ఆస్పత్రిని అభివృద్ధి గొప్ప విషయమని స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేచర్ క్యూర్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1949లోనే ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి ఆదరణకు నోచుకోక, నాటి ప్రభుత్వాలు పట్టించుకోక పేషెంట్లు ఇబ్బంది పడేవారని, సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి హరీశ్‌రావు ఈ ఆస్పత్రిని అద్భుతంగా తీర్చదిద్దారన్నారు. హరీశ్‌రావు ప్రభుత్వ ఆస్పత్రులు బాగా అభివృద్ధి చేశారని అన్నారు. ప్రైవేటుకు ధీటుగా ఈ ఆస్పత్రిని అభివద్ధి చేయడం గొప్ప విషయం అన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ' రూ. 10 కోట్లతో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేసుకున్నాం. ఇంకా నిధులు ఇస్తాము. సీఎం కేసీఆర్ ప్రకృతి వైద్యానికి రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేలా కృషి చేస్తున్నారు ' అని అన్నారు. కొత్తగా అభివృద్ధి చేసుకున్న ఈ ఆస్పత్రిని ప్రారం భించుకోడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీ లు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయి. వికారాబాద్, భూపాలపల్లి, సిద్ది పేటలో 50 పడకల కొత్త ఆయుష్ ఆస్పత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. నేచర్ క్యూర్ ఆస్పత్రిలో తాను కొన్ని రోజులు పేషెంట్‌గా ట్రీట్మెంట్ తీసుకున్నానని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. వికారాబాద్‌లో ఇలాంటి ఆస్పత్రిని డెవలప్ చేయాలని సూచించారు. మంత్రులు ఎంపి కేశవరావు, సీఎస్ శాంతి కుమారి, హెల్త్ సెక్రెటరీ రిజ్వి, టి ఎస్ఎం ఎస్ ఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆయుష్ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మెన్‌గా గొడుగు మహేష్ యాదవ్



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మెన్‌గా వంగూర్ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గొడుగు మహేష్ యాదవ్ నియమితుల య్యారు. ఈ మేరకు జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా గొడుగు మహేష్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో మొట్ట మొదటి సామాజిక ఉద్యమకారుడు మహాత్మ జ్యోతిబాపూలే ను గౌరవించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిమీదా ఉందన్నారు. దేశాన్ని పట్టిపీడిస్తున్నటు వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపిన భారత దేశ గొప్ప సంఘసంస్కర్త పూలే అని కొనియాడారు. మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని ఏప్రిల్ 11 న ప్రతి గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని కోరారు. నన్ను నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకి బీసీ సంక్షేమ శాఖ మాత్యులు గంగుల కమలాకర్‌కి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సహకార వ్యవస్థ రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు

వ్యవసాయ కో ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలో సాగర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయం వల్ల సహకార వ్యవస్థకు ప్రమాదం ఏర్పడిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. సహకార వ్యవస్థ రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్టేట్ వ్యవసాయ కో ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ ఎండీ సర్దార్ అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభోత్సవం సందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్రం సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు.

రాష్ట్రాల హక్కులను కాలరాసేలా నిర్ణయం తీసుకుంటున్నదని చెప్పారు. బడా పెట్టుబడిదారులకు వ్యవసాయ రంగాన్ని అప్పజెప్పేలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మల్టీస్టేట్ లెవెల్ కో ఆపరేటివ్ సొసైటీ చట్టాన్ని తీసుకొచ్చి సహకార సంఘాలన్నిటిని ప్రయివేటుపరం చేసేలా పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టిందన్నారు. సహకార సంఘ ఉద్యోగులు, రైతులు ఐక్యంగా ఆ విధానాలను తిప్పి కొట్టాల్సిన అవసరముందని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవాధ్యక్షులు కె. భూపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. జీవో నెంబర్44లోని లోపాలను సవరించి తద్వారా ఉద్యోగులకు అందాల్సిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పి ఈశ్వర్‌గౌడ్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. సహకార రంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

యూనియన్ ఆర్థిక నివేదికను పి నరేందర్‌రెడ్డి ప్రవేశ పెట్టారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం మహాసభ భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకుంది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. గౌరవాధ్యక్షులుగా కె.భూపాల్, అధ్యక్షులుగా ఎండీ సర్దార్, ప్రధాన కార్యదర్శిగా పి.ఈశ్వర్ గౌడ్, కోశాధికారిగా ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులుగా రాందాస్, నరేందర్ రెడ్డి, వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా నిసార్ అహ్మద్, యు. రవీందర్, బి గణేష్, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రెడ్డి, కేశవరెడ్డిని మహాసభ ఎన్నుకుంది.

వందే భారత్‌ను చూసేందుకు.. కిక్కిరిసిన నల్లగొండ రైల్వేస్టేషన్

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

ప్రధాని నరేంద్రమోడీ శనివారం సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ నుంచి బయల్దేరిన వందేభారత్ రైలును చూసేందుకు వచ్చిన జనంతో నల్లగొండ రైల్వేస్టేషన్ కిక్కిరిసింది. మధ్యాహ్నం 1:37 గంటలకు రైలు నల్లగొండకు చేరుకుంది. 1:46 గంటలకు నల్లగొండస్టేషన్ నుంచి తిరుపతికి బయల్దేరింది. మొదటిరోజు కావడంతో సెల్‌ఫోన్‌లో రైలును బంధించేందుకు, ఆగిన తర్వాత రైలు వద్ద నుంచి ఫొటోలు దిగేందుకు జనం పోటీపడ్డారు. కొంతమంది రైల్లోకి ఎక్కి లోపల ఉన్న సీట్ల తీరును, క్యాబిన్ పరిశీలించి సెల్ఫీలు దిగారు. అయితే టికెట్ రేట్లను చూసి జనం ముక్కున వేలేసుకున్నారు.

బీఆర్ఎస్, బీజేపీ మధ్య బలమైన బంధం బెల్లయ్యనాయక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య బలమైన బంధం ఉందంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్ ఎద్దేవా చేశారు. మోడీని ప్రశ్నిస్తున్నట్టు నటిస్తున్న గులాబీ నేతలు బీజేపీకే అనుకూలంగా ఉంటున్నారని విమర్శించారు. విభజన చట్టంలోని బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐటీలు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏమైందని ప్రశ్నించారు. అవకాశం వచ్చినప్పుడల్లా ప్రధాని మోడీ తెలంగాణను అవమానిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం బయటపడిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి తెలిపారు. రాష్ట్రానికి ఇస్తాన్న హామీలు నెరవేర్చని ప్రధాని రాష్ట్రానికి వస్తే. ఏమీ అడగకుండా సీఎం కేసీఆర్ మౌనంగా ఉన్నారని పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. అధికారిక కార్యక్రమాల్లో పీఎం రాజకీయాలు చేశారని తెలిపారు.

11న జ్యోతిబాపూలే 197వ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకల పోస్టర్‌ను మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, ఎల్. రమణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు ఉత్సవ కమిటీ ప్రతినిధుల సమక్షంలో అసెంబ్లీ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 11న ఉదయం 10 గంటల నుంచి రవీంద్రబారతిలో నిర్వహించే ఈ జయంతి వేడుకలకు అందరూ హాజరై విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

అసత్యాలు, అబద్ధాలే... : మంత్రి వేముల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ రాష్ట్రానికొచ్చి అసత్యాలు, అబద్ధాలే మాట్లాడారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ పార్లమెంట్ వేదికగా మాట్లాడిన మోడీ...తెలంగాణ ప్రజల మీద తనకు ప్రేమ ఉందంటే నమ్మగలమా ? అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పసుపు బోర్డు ఇస్తా అంటే అడ్డుకున్నమా?బాండ్ పేపర్ రాసిచ్చి ఐదు రోజుల్లో తేకుంటే రాజీనామా చేస్తానన్న ఎంపీ అర్వింద్ రాజీనామాను అడ్డుకున్నమా? అని ప్రశ్నించారు. బీజేపీ హయాంలో కార్పొరేట్ల బినామీల పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. మోడీ సచ్చీలుడైతే అదానీపై ఈడీ,సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కిసాన్ సమ్మాన్ నిధిని ప్రారంభించినప్పుడు ఎంత మందికి ఆ పథకం కింద డబ్బులు ఇచ్చారో, ఇప్పుడు ఎంతమందికి ఇస్తున్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడే సీపీఐ, సీపీఐ(ఎం) సంయుక్త సమావేశం

వేదిక హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్‌గ్రౌండ్

- ముఖ్యఅతిథులుగా ఏచూరి, రాజా, రాఘవులు, నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో సంయుక్త సమావేశం జరగనుంది. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శులు కె నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారు. ఈ సమావేశంలో ఆ రెండు పార్టీల మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులతోపాటు ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులంతా పాల్గొంటారు. ఇలాంటి సంయుక్త సమావేశాన్ని నిర్వహించడం తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. అందుకే ఈ సమావేశం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. సీపీఐ, సీపీఐ(ఎం) మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులను మరింత ఐక్యం చేసేందుకే దీన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఉభయ కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యత బలపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, మతోన్మాద వైఖరి దేశానికి, ప్రజలకు ఎంత ప్రమాదకరమో ఈ సమావేశంలో వివరించనున్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, సామాజిక న్యాయాన్ని, ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవడమే లక్ష్యంగా కర్తవ్యాలు రూపొందించనున్నారు.

మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే మోడీ ప్రభుత్వ కుట్రల పట్ల అప్రమత్తం చేయనున్నారు. మతం, కులం, ప్రాంతం, జాతి పేరుతో విభజన రాజకీయాలను ప్రోత్సహించే బీజేపీ విధానం ఎంత ప్రమాదమో వివరి స్తారు. వామపక్ష లౌకిక, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత ఎంత అవసరమో తమ శ్రేణులకు వివరించనున్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, కార్పొరేట్లకు రాయితీలు, సామాన్యులపై భారాలు మోపే మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టడంతోపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పట్ల ఎలాంటి వైఖరి అవలంబించాలనే దానిపైనా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు.

ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌ను పరిశీలించిన సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ ఆదివారం నిర్వహించనున్న సంయుక్త సమావేశ ప్రాంగణం ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ కార్యదర్శి ఛాయాదేవి, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడీ వచ్చారు... తెలంగాణకు ఏమిచ్చారు?

తెలంగాణ వనరులను అదానీకి కట్టబెట్టే కుట్ర : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ వచ్చారు.. తెలంగాణకు ఏమిచ్చారు, ఏమి తెచ్చారు? అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. విభజన హామీల్లో ఏ ఒక్క దాన్నీ కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణలోని వనరులను అదానీకి కట్టబెట్టేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయించకుండా, ఎలాంటి సహకారం ఇవ్వని మోడీకి తెలంగాణకు వచ్చే నైతిక హక్కు లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదంటూ ప్రధాని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విభజన హామీలన్నీ కేంద్రం చేతిలోనే ఉన్నాయని, వాటిలో ఒక్కటైనా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తొమ్మిదేండ్లు గడుస్తున్నా బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం వంటి అనేక హామీలను గాలికొదిలేశారని చెప్పారు.

తెలంగాణకు ఏమీ ఇవ్వకపోగా, అదానీకి వనరులను కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదని అన్నారు. దొడ్డి, దొంగదారిన సింగరేణి సంస్థ గొంతు నులిమి, ప్రయివేటుపరం చేసేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. గుజరాత్, జార్ఖండ్, బీహార్‌ల్లోని గనులను అక్కడి ప్రభుత్వాలకే అప్పగించారని, కానీ తెలంగాణలోని గనులను ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించకుండా ప్రయివేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కక్ష అని, అందుకే గనులను ఇవ్వకుండా ప్రయివేటుపరం చేస్తున్నారని అన్నారు.

మోటార్లకు మీటర్లను బిగిస్తే వ్యవసాయ రంగం కుదేలవుతుందని, అప్పుడు ఆ రంగాన్ని కూడా అదానీకి ఇచ్చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విద్యార్థులను బలిపశువులను చేశారని కూనంనేని విమర్శించారు. పేపర్ లీకేజీకి పాల్పడేవారు దేశభక్తులా?అని కూనం నేని ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇందుకోసం ఉపా కంటే మెరుగైన చట్టాన్ని తేవాలని సూచించారు. అదానీ వ్యవహారంపై పార్లమెంటులో చర్చకు ఎందుకు అవకాశం లేదని మోడీని ప్రశ్నించారు. మోడీ హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన సీపీఐ, విద్యార్థి సంఘం నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వానికి మించిన అత్యుత్సాహాన్ని వారు ప్రదర్శించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.







మోడీ పర్యటనకు నిరసనల వెల్లువ

నవతెలంగాణ- విలేకరులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకపోవడంపై మోడీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య భవన్ నుండి సరిత క్లీనిక్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. పాలేరులో నిరసన చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో హన్మకొండ అదాలత్ సెంటర్‌లో నిరసన తెలిపారు. బయ్యా రంఉక్కు, గిరిజన, హార్టికల్చర్ యూనివర్సిటీలు, ఎన్టీపీ సీ వి ద్యుత్‌కేంద్రం, ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ విభజన హామీల్లో ఉన్నా కేంద్రప్రభుత్వం ఊసే ఎత్తడంలేదని నాయకులు అన్నారు. హనుమకొండ కేయూసీ క్రాస్ రోడ్డు వద్ద సీపీఎం హనుమకొండ వెస్ట్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కరీమాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సీపీఐ(ఎం) మంచిర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ సమీపంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ముధోల్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దహనం చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చని మోడీకి తెలంగాణ రాష్ట్రంలో తిరిగే నైతిక హక్కు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సీపీఐ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. 'మోడీ హటావో దేశ్ కో బచావో' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మోడీ గో బ్యాక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వాగ్దానాలు, హామీలను మరిచిన మోడీ గో బ్యాక్ అంటూ సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాలు, నారాయణఖేడ్, హుస్నాబాద్, చేర్యాల, కొమురవెల్లి తదితర ప్రాంతాల్లో సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు.

భువనగిరిలో బాబు జగ్జీవన్‌రావు విగ్రహం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వలిగొండలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సూర్యాపేటలో నల్లాలబావి సెంటర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. నల్లగొండలో సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన, భారీ ర్యాలీ నిర్వహించి మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. చిట్యాల, నకిరేకల్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మిర్యాలగూడలో..సీపీఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దేవరకొండలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శనివారం నిరసనతో రాస్తారోకో నిర్వహించారు. హైదరాబాద్ సౌత్ జిల్లా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ రాకను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ పార్టీ కార్యదర్శి ఎం.డి అబ్బాస్ హాజరై మాట్లాడారు. నిరసన కారులను సంతోష్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రామంతపూర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.

ఘట్ కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద సీపీఐ(ఎం) కార్యకర్తలు నిరసన చేపట్టారు. సీపీఐ(ఎం), బాచుపల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సీపీఐ(యం) బాలానగర్, కూకట్‌పల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో "మోడీ గో బ్యాక్" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు.

ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులు

- 2.83 లక్షల మంది అప్లై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులొస్తున్నాయి. ఇప్పటి వరకు 2,83,128 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు తుది గడువు సోమవారం వరకు ఉందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి 1,81,693 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,01,138 మంది, రెండు విభాగాలకు 297 మంది కలిపి మొత్తం 2,83,128 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వచ్చేనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

పది పరీక్షకు 99.63 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన గణితం పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,92,269 మంది దరఖాస్తు చేసుకుంటే, 4,90,454 (99.63 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 1,815 (0.37 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 3,397 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 2,326 (68.47 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 649 (31.53 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జెడ్పీహెచ్ఎస్ రేగొండలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించామని పేర్కొన్నారు.

11 నుంచి విధుల బహిష్కరణ

- నల్లబ్యాడ్జీలతో జూడాల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపకారవేతనాలను 15 శాతం వరకూ పెంచాలనీ, వాటిని రెగ్యులర్‌గా అందజేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) డిమాండ్ చేసింది., ప్రతి పీజీ విద్యార్థికి డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం (డీఆర్ పీ) అమలు చేయాలని కోరింది. ఈ మేరకు శనివారం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రితో పాటు రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో టీజూడా ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ కుమార్ మాట్లాడుతూ నల్ల బ్యాడ్జీల నిరసనను ఈ నెల 10 వరకు కొన సాగిస్తామనీ, అప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే అత్యవసర సేవలు మినహా అన్ని రకాల వైద్య సేవలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. డీఆర్‌పీకి హాజరై వైద్య సేవలు అందించే పీజీ విద్యార్థులకు సరైన పరిశుభ్రమైన వసతి , భద్రత (ముఖ్యంగా మహిళా పీజీలకు), ఆహార సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు.

మళ్లీ మోడీ మొండి చేయి చూపారు

- ప్రధాని ప్రసంగంపై బోయినపల్లి ఎద్దేవా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పర్యటన ద్వారా ప్రధాని మోడీ మనకు మళ్లీ మొండిచేయి చూపారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. శనివారం ఈమేరకు మోడీ ప్రసంగంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని రాష్ట్రంపై ఆక్రోషం వెళ్లగక్కారే తప్ప...ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. కొత్త రాష్ట్రం సాధించిన ప్రగతిపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 14 జాతీయ రహదారులను మంజూరు చేస్తారని ఆశించామనీ, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటిస్తారని విశ్వసించామన్నారు. అవేవీ ప్రకటించని ప్రధాని...సీఎం కేసీఆర్, వారి కుటుంబ సభ్యులపై విమర్శలు చేసేందుకే ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. వందే భారత్ రైలును ఎన్ని సార్లు ప్రారంభిస్తారంటూ ప్రశ్నించారు.

సామాజిక రంగాలకు నిధులు విడుదల చేయాలి

కుల నిర్మూలన వేదిక డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంక్షేమ హాస్టళ్లకు వివిధ వస్తువులను సరఫరా చేసే వారికి గత ఏడాది బడ్జెట్ ఇంకా విడుదల కాలేదనీ, తక్షణం ఆ నిధులను విడుదల చేయాలని కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి పాపని నాగరాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మంత్రులు, అధికారుల కమిటీ 25శాతం మెస్ చార్జీలు పెంచాలంటూ సూచించిందని తెలిపారు. 3-7 తరగతులకు రూ.1,200, 8-10 తరగతులకు రూ.1,400, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు రూ.1,875 రూపాయలు ఇవ్వాలనే ప్రతిపాదనతో సీఎం ఆమోదం కోసం పంపించామంటూ పేపర్లలో ప్రకటించి నెలరోజులైందని తెలిపారు. అయినా ఇంతవరకు జీవో విడుదల కాలేదని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ నిర్వహించే అనేక రకాల కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు, సంక్షేమ హాస్టళ్లకు నిధులను విడుదల చేయకపోవటం పట్ల ఆయా సామాజిక వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ముందు వరుసలో నిలబడకుండా వెనకడుగు వేస్తున్నాయని తెలిపారు.

విశాఖ పర్యటనకు రండి

- సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం
- వినోద్‌కుమార్‌తో విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధుల భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం కార్మికులు చేపట్టిన పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విశాఖ పర్యటనకు రావాలంటూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆహ్వానం లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్‌తో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మెన్ సహా ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఆ కమిటీ చైర్మెన్ మంత్రి రాజశేఖర్, కో కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు, ప్రతినిధి మంత్రి మురళీకృష్ణ రావు పాల్గొన్నారు. పలు అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. సుమారు రూ.నాలుగు లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులు కలిగిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసి దాన్ని ప్రయివేటు సంస్థకు అప్పనంగా ధారాదత్తం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని మంత్రి రాజశేఖర్ తెలిపారు. ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని, జాతి సంపద అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ కమిటీ ఆహ్వానాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

కల్తీ కల్లు తాగి 10 మందికి అస్వస్థత

జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్

కల్తీ కల్లు తాగి పదిమంది అస్వస్థతకు గురైన సంఘటన మహబూబ్‌నగర్ పట్టణ శివారులో ఉన్న దొడ్డలోనిపల్లిలో శనివారం జరిగింది. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జీ డాక్టర్ శిరీష, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దొడ్డలోనిపల్లి, మోతీనగర్, కోయనగర్ ఇతర ప్రాంతాలకు చెందిన కూలీలు రోజు కూలి చేసుకుంటూ జీవిస్తున్నారు. కొంతమంది పని పూర్తయిన తర్వాత కల్లు తాగుతుంటారు. ఈ నేపథ్యంలో శనివారం కల్లు తాగుతున్న సమయంలో పదిమంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కల్లులో డోస్ ఎక్కువగా ఉండడం, కల్తీ అయి ఉంటుందని జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జీ తెలిపారు. అందులో నలుగురి పరిస్థితి కొంత విషమంగా ఉన్నా.. ఎవరికి ఎలాంటి ప్రాణహాని లేదని శిరీష తెలిపారు. అందుబాటులో ఉండి చికిత్స అందిస్తున్నామన్నారు. కల్తీ కల్లు సరఫరా చేస్తున్న వారిమీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

సంపాదకీయం

చరిత్రపై చెదపురుగులు

'చరిత్రను విస్మరించే వారు చరిత్రను నిర్మించలేరు' అని మన బాబాసాహెబ్ అంబేద్కర్ సెలవిచ్చారు. ఇది అక్షర సత్యం. చరిత్రను విస్మరించడమే కాదు, చెరిపేయ చూడటం, వక్రీకరించే ప్రయత్నం చేయటం మరింత దుర్మార్గమైన చర్యే అవుతుంది. ఎవరు ఈ పనికి పూనుకుంటారు?

గాంధీయేమీ విప్లవాన్ని కోరుకోలేదు, రామరాజ్యాన్నే ఆశించాడు. అయినా భారతీయులందరూ ఐక్యంగా జీవించాలని కృషిచేశాడు. విభజన, విచ్ఛిన్నకారులకు ఇది నచ్చని అంశం. క్రమేనా హంతకుల చరిత్రను, ఉదాత్త నాయకులుగా ప్రవేశపెట్టినా ఆశ్చర్యం పడవలసింది లేదు. కేవలం హిందూ ముస్లిం ఐక్యతకు గాంధీ చేసిన కృషికి సంబంధించిన చాప్టర్లనన్నింటినీ తొలగించడంతోనే వీరి దుర్బుద్ధి అర్థమవుతుంది.

హీన చరితులు మాత్రమే ఈ పనిచేస్తారు. గతకాలపు చరిత్రను తుడిచేసి, తమకనుకూలమైన చరిత్రను తిరగరాయించుకునే వాళ్లు నియంతలు. వీళ్లంతా హీన చరితులుగా కాలగర్భంలో కలిసిపోతారు. ఇది చరిత్ర చెబుతున్న పాఠం. సత్యాన్ని కొంత కాలం కప్పిపెట్టవచ్చు కానీ పూర్తిగా నిర్మూలించడం కుదరని పని. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోదు. చరిత్ర పునాది మీదనే వర్తమానం, భవిష్యత్తు కొనసాగు తుంది. ఈ భవిష్య గమనాలను తమ ఆలోచనల చుట్టూ తిప్పుకోవాలని ప్రయత్నిస్తున్నవాళ్లు గత కాలపు వాస్తవాలపై మసిపూసే పనికి పూనుకుంటున్నారు. ఈ వికృత చేష్టకు పాల్పడుతున్న వారి పన్నాగాలను పసికట్టి, పనిపట్టవలసివుంది!

మనదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో పాత్రలేని బీజేపీ, సంఘ్ పరివారం, పాత్ర పోషించిన వారిని చరిత్ర నుండి తొలిగించే పనికి సిద్ధమైంది. దేశానికి జాతిపితగా మనం గౌరవించుకునే మహాత్మాగాంధీ నిర్వహించిన జాతీయోద్యమ సంఘటనలను, ఆయన జీవిత విషయాలను ఎన్.సి.ఇ.ఆర్.టి. సిలబస్ నుండి తొలగించింది నేటి కేంద్ర ప్రభుత్వం. ఎందుకనంటే, దేశ ఐక్యత కోసం, స్వాతంత్ర్యం కోసం పనిచేసిన గాంధీని హతమార్చిన నాథూరాంగాడ్సే వారసులు వీరయినందువల్ల, దాన్ని పాఠంగా చదవడాన్ని తుడిచేస్తున్నారు. శాంతి, సహనం భారతీయ ఆత్మ అని ప్రబోధించిన మహాత్ముణ్ని అత్యంత కిరాతకంగా హత్య చేయటమనేది వ్యక్తి నిర్మూలనే కాదు, భారతీయతత్వాన్ని, ఐక్యతను అంతమొందించడమనే ఉగ్రవాద చర్య అది. గాంధీయేమీ విప్లవాన్ని కోరుకోలేదు, రామరాజ్యాన్నే ఆశించాడు. అయినా భారతీయులందరూ ఐక్యంగా జీవించాలని కృషిచేశాడు. విభజన, విచ్ఛిన్నకారులకు ఇది నచ్చని అంశం. క్రమేనా హంతకుల చరిత్రను, ఉదాత్త నాయకులుగా ప్రవేశపెట్టినా ఆశ్చర్యం పడవలసింది లేదు. కేవలం హిందూ ముస్లిం ఐక్యతకు గాంధీ చేసిన కృషికి సంబంధించిన చాప్టర్లనన్నింటినీ తొలగించడంతోనే వీరి దుర్బుద్ధి అర్థమవుతుంది. ఇక భారతదేశాన్ని పరిపాలించిన మొఘలు సామ్రాజ్యం గురించి మొత్తం



అధ్యాయాలను తొలగించారు. ఒక్క మొఘలులే కాదు అనేక జాతులవారు, మతాలవారు దేశాన్ని పాలించారు. ఇక్కడి సమాజంలో కలిసిపోయి స్థిరపడిపోయిన వాళ్లూ ఉన్నారు. విజ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు ఆదాన ప్రదానాలతో భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న నేటి సమాజాన్ని మత ప్రాతిపదికన విడదీయాలన్న ఆలోచనలో భాగమే ఈ చర్యలన్నీ.

మహాత్ముని హత్యానంతరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం నిషేధానికి సంబంధించిన చరిత్రనూ పాఠ్యభాగాలనుండి తొలగించి భావితరాలకు చరిత్ర తెలియకుండా చేస్తున్నారు. యువత మస్తిష్కాలలో అబద్ధాలను, అసత్యాలను చొప్పించి తమ లక్ష్యాలను సులభతరం చేసుకోవాలన్న కపటత్వం ఇందులో దాగివుంది. దేశంలో నూతన విద్యా విధానం పేర కాషాయ ఆలోచనలను నింపే ప్రయత్నంలో భాగంగానే ఈ తొలగింపులు జరుగుచున్నవి. ఇంకా సిలబస్‌లోంచి 'ప్రజాస్వామ్యం- భిన్నత్వం' అనే అంశాలనూ ఉద్యమ చరిత్రనూ తొలగించడం వారి అప్రజాస్వామిక విధానానికి మచ్చుతునక. విద్యారం గాన్ని మొత్తంగా తమకనుకూలంగా మార్చుకుని, చరిత్రను వక్రీకరించి, విద్యార్థుల మెదళ్లలో విషబీజాలు నాటాలని చూస్తున్నారు.

పాఠ్య గ్రంథాలలోని చరిత్ర తుడిచివేత ఒకవైపు జరుగుతుండగానే మరోవైపు చారిత్రక కట్టడాలనూ కనుమరుగు చేయాలన్న ఆలోచనలూ బహిరంగపడుతున్నాయి. అసోంలోని బీజేపీ శాసనసభ్యుడు రూప్ జ్యోతికుర్మి చారిత్రక కట్టడాలయిన తాజ్‌మహల్, కుతుబ్‌మినార్ మొదలైనవాటిని కూల్చేయాలని పిలుపునిచ్చాడు. అందుకోసం తన సంవత్సర కాలపు జీతాన్ని ఇస్తానని ప్రకటించాడు. ఇది వ్యక్తిగతమైన అభిప్రాయమే కాదు, సంఘ్ పరివార్ యొక్క ఆలోచనలో ఉన్న విషయాలివి. తుడిచేయడం, కూల్చేయటం విధ్వంసకారుల కార్యక్రమం. ముఖ్యంగా విద్యారంగంలో విషం నిండిపోతే భవిత ఉన్మాదమై తాండవిస్తుంది. చరిత్ర అబద్ధాలతో నిండితే భవిష్యత్తు అనర్థమై అపార్థాలను పండిస్తుంది. వక్రీకరణకారుల వక్రబుద్ధిని నిలదీసి నిలువరించకుంటే చరిత్ర హత్యకు గురవుతుంది. భవిష్యత్తుపై చీకట్లు కమ్ముతాయి. మేధావులారా మేల్కొనండి!

బీజేపీ కుయుక్తులు... మోడీజీ సూక్తులు!

తెలుగు రాష్ట్రాలలో బీజేపీ హడావుడి ప్రధాని మోడీ రాకతో పరాకాష్టకు చేరింది. అక్షరాలా అధికార కార్యక్రమమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ దాడికి దిగిన మోడీ దాదాపు ఎన్నికల ప్రచారసభలా మార్చేశారు. ఒకటికి రెండు ఆడియో విజ్యువల్స్ ప్రదర్శిస్తూ రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి గొప్ప కృషి జరుగుతున్నట్టు చిత్రించుకున్నారు. తర్వాత తనే స్వయంగా తన ప్రసంగంలోనూ అదే పాట పాడారు. దేశంలో ప్రాథమిక సదుపాయాల మెరుగుదల కోసం రవాణా విస్తరణ కోసం కేంద్రం పరితపిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని తిట్టిపోశారు. తాను అవినీతిపై పోరాడుతుంటే పరివార్‌వాదులు అంటే కుటుంబపాలన చేసేవారు అడ్డుతగులు తున్నారని ఆరోపణలు గుప్పించారు. మరో విధంగా చెప్పాలంటే పరోక్ష భాషలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేసీఆర్ కుటుంబంపై కసితీరా దాడి చేశారన్నమాట. ఇతర పార్టీల ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో కలసిరావడం లేదని అందరిపై అభాండం వేశారు. దానికి ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మోడీ నాయకత్వం వర్ధిల్లాలని పదేపదే నినాదాలు చేయించి తమ ఉద్దేశం బయటపెట్టుకున్నారు. హైదరాబాద్‌కు చార్మినార్ సంకేతమైతే మోడీ మాత్రం భాగ్యలక్ష్మి ఆలయం చిహ్నామనడంలోనూ, కిషన్‌రెడ్డి పదేపదే హిందువులు తిరుపతి దేవుణ్ని చూడాలనుకుంటారని నొక్కిచెప్పడం లోనూ వారి మతరాజకీయం బహిర్గతమైంది. అంతేగాక సంతుష్టీకరణ విధానాల పేరిట మైనార్టీ సంక్షేమంపై ధ్వజమెత్తే బీజేపీ నిరంతర పల్లవి కూడా ఆలపించారు.



తెలకపల్లి రవి

ఏపీలో మూడు పార్టీల వంత

నిజానికి దేశంలో వందేభారత్ రైలుకు పదోసారి పచ్చజెండా ఊపడం మోడీకే చెల్లింది. దశాబ్దాలుగా నడుస్తున్న ఎంఎంటిఎస్ పనులకు కూడా మరోసారి శంకుస్థాపన చేశారు. అయితే ఇవేవీ యాదృచ్ఛికమైనవి కానేకాదు. తెలంగాణలో ఒక విధంగా, ఆంధ్రప్రదేశ్‌లో మరో విధంగా రాజకీయ పరిస్థితులు ఉన్నప్పటికీ బీజేపీ మాత్రం ఏకైక లక్ష్యంతో పావులు కదుపుతున్నది. ఇక్కడి ప్రాంతీయ పార్టీల ప్రాభవాన్ని దెబ్బతీసి తను పాదం మోపడం. బీఆర్ఎస్ అధ్యక్షుడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీ మతతత్వ రాజకీయాలు కేంద్రం నిరంకుశ పోకడలపై తీవ్రంగా పోరాడుతున్నారు. ఈ విషయంలో వామపక్షాలు సహకారం ఇస్తున్నాయి కూడా. తామే అధికారంలోకి వస్తామని చెబుతున్న కాంగ్రెస్ విచిత్రంగా బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని ఆరోపిస్తుంది. మిగిలిన రెండుపార్టీలూ ఇదే విధంగా అవతలివారిపై ఆరోపణలు చేస్తున్నాయి. కొంతమంది కాంగ్రెస్ సీనియర్లు బీజేపీని ప్రధాన ప్రత్యర్థిగా చెబుతూ బీఆర్ఎస్‌తో అవగాహన సాధ్యమేనన్నట్టు మాట్లాడుతుంటారు. జాతీయ స్థాయిలో ఈ మధ్య చాలా సందర్భాలలో ప్రతిపక్ష కార్యాచరణలో ఈ రెండు పార్టీలూ కలసి పనిచేస్తున్నాయి గాని రాష్ట్రంలో ఆ సూచనలు లేవు. అదే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి మోడీ సర్కారుతో సత్సంబంధాలు నెరుపుతున్నారు. ప్రధాన ప్రతిపక్షనేత టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కూడా బీజేపీతో సత్సంబంధాలు ఉన్నట్టు చూపించుకోవడానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుతం ఆయనతో సన్నిహితంగా మెలుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అంతకు ముందునుంచి బీజేపీతో మిత్రుడుగా కొనసాగుతూ వచ్చే ఎన్నికలలో ఓట్లచీలిక నివారిస్తానంటున్నారు. సీపీఐ నాయకులు కూడా వైసీపీకి వ్యతిరేకంగా అందరూ ఒకతాటిపైకి రావాలని మాట్లాడుతున్నారు. వామపక్షాలు కూడా మాతోనే ఉంటాయన్నట్టు చెబుతున్న టీడీపీ నేతలు ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాలను అందుకు నిదర్శనంగా చూపుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీని కూడా కలుపుకోవాలని చెప్పడంపై సీపీఐ(ఎం) బహిరంగంగానే భిన్నాభిప్రాయం వెలిబుచ్చుతున్నది. వైసీపీ సర్కారులాగే ఈ పార్టీలు కూడా బీజేపీ కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేయడం గాక రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం చేయాలని, లౌకిక ప్రజాస్వామ్యం కాపాడుకోవాలని నొక్కి చెబుతున్నది. ఇటీవలే ముగిసిన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఇదే విషయం నొక్కి చెప్పడమే గాక కార్యాచరణ కూడా ప్రారంభించినట్టు కనిపిస్తుంది. తాజాగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం ఇందుకో ఉదాహరణగా చెప్పొచ్చు. ఆ సమావేశంలో టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకూ సీనియర్ నాయకులు వడ్డే శోభనాదీశ్వరరావుకు మధ్య జరిగిన వాడీవేడి చర్చ ఇందుకు అద్దం పడుతుంది. పోలవరం విషయంలో కీలకమైన కేంద్రాన్ని పక్కన పెట్టి గత ప్రస్తుత ప్రభుత్వాల కోణంలోనే విమర్శలు గుప్పిస్తే ఉపయోగం ఏమిటన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. నిజానికిది ఏపీ రాజకీయాలలోనే సంక్లిష్టమైన అంశం.

బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్య అవగాహన, ఉద్యమాలు ఉమ్మడి పోరాటం పెరుగుతున్న కొద్ది వచ్చే ఎన్నికలలో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం బీజేపీకి పెద్ద సవాలుగానే తయారవుతున్నది. నిరంకుశ కార్పొరేట్ మతతత్వం అదానీ కుంభకోణాలు, రాహుల్ అనర్హత వేటు వంటివాటిపై అనేక రూపాల్లో వ్యక్తమవుతున్న నిరసనలు ప్రజాగ్రహాలు బీజేపీని భయపెడుతున్నాయి. బలమైన ప్రాంతీయ పార్టీలూ, వామపక్షాలు ఉన్న చోటగతంలో వలే నల్లేరు మీద బండిలా గెలవలేకపోవచ్చున్న వాస్తవం భయపెడుతున్నది. ఉన్న మిత్రపక్షాలు కూడా దూరం కాగా కలసివచ్చే వారు కరువవుతున్నారు. అందులోనూ దక్షిణాదిన కాలూనడం బీజేపీకి ఎప్పుడూ సవాలుగానే ఉంది. కర్నాటక చేజారవచ్చున్న అంచనాలు అన్నివైపులా వినిపిస్తున్నప్పుడు, కేరళ, తమిళనాడులలో రికానాలేనప్పుడు తెలుగు రాష్ట్రాలపైనే ఆ పార్టీ అధిష్టానం దింపుడు కళ్లం ఆశ పెట్టుకుంది.

ప్రాంతీయ పార్టీల తీరు


మొదటగా టీడీపీ 41వ వ్యవస్థాపక సభ హైదరాబాదులో జరిగింది. చంద్రబాబు ప్రసంగంలో బీజేపీ విధానాలపై ఒక్క విమర్శ కూడా లేకపోగా ఒకటి రెండు సార్లు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెప్పారు. ఆయనతో కలసి తాను సాధించిన విజయాలు కూడా చెప్పడమే గాక పరోక్షంగా పెద్దనోట్ల రద్దును సమర్థించారు. పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబుకు అవగాహన ఉందనీ, జనసేన సీట్ల వరకూ చెప్పి బీజేపీ విషయం తనకు వదిలేయమని ఆయనకు చెప్పారని టీడీపీ కీలక నాయకులు చెబుతున్నారు. ఈ మధ్య ఒకటి రెండు సందర్భాలను పురస్కరించుకుని బీజేపీ అధ్యక్షుడు నడ్డా టీడీపీ గురించి సానుకూల సందేశాలిచ్చారు. అయితే వారే తమ వెంటపడుతున్నారని బీజేపీ నేతలంటారు. ఈ మధ్యలో ముఖ్యమంత్రి జగన్ ఒకటికి రెండుసార్లు ఢిల్లీ వెళ్లి అమిత్ షాతో సహా కేంద్ర మంత్రులను కలసి వచ్చాక పార్లమెంటులో ఏపీ ప్రశ్నలకు దాటివేత సమాధానాలు ఇచ్చారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపేది లేదనీ చెప్పారు. జగన్ ప్రభుత్వం ఎంత సానుకూలంగా చిత్రించినా పోలవరం సహా ఏ సమస్యపైనా కేంద్రం అవసరమైన చర్యలు నిధుల విడుదల చేసింది లేదు. విచిత్రంగా ఇలాంటి సమయంలోనే పవన్ కళ్యాణ్ హఠాత్తుగా ఢిల్లీ వెళ్లారు. ఆపార్టీ ఎంత హంగామా చేసినా కంటితుడుపుగా కొద్దిసేపు నడ్డాను కలిసాననిపించారు తప్ప భాగస్వామిగా ఆదరించింది లేదు. ఓట్ల చీలిక నివారించడం అనే పాట తప్ప ఆయన కొత్తగా చెప్పింది లేదు. మోడీ విశాఖ రాకలోనూ ఇలా కొద్దిసేపు భేటీ జరిపి రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయి అని ప్రకటించిన పవన్ కళ్యాణ్ ఢిల్లీలోనూ సాధించింది శూన్యమే. ఏపీ విషయంలో సానుకూల చర్చలు తీసుకునే ఉద్దేశమే బీజేపీకి లేదని దీంతో మరోసారి స్పష్టమైంది. అయితే దీని తర్వాత కూడా జనసేన నాయకులు కేంద్రం ఏదో ఒరగబెట్టినట్టు రాష్ట్రందే తప్పయినట్టు మాట్లాడటం వింత గొల్పుతుంది. రాహుల్‌గాంధీ అనర్హత సమస్యపై కలసి రావాలని కెవిపి రామచంద్రరావు ప్రత్యేకంగా అభ్యర్థించినా టీడీపీ నుంచి అధికారిక స్పందన లేదు! 'మేము కష్టాల్లో ఉన్నప్పుడు మాతో కలసిరాని ప్రాంతీయ పార్టీలతో మేమెందుకు కలవాలని' టీడీపీ నేతలు జవాబిచ్చారు. కనుకనే మూడు ప్రాంతీయ పార్టీలూ ఏదో రూపంలో బీజేపీ వ్యూహాలకే ఊతమిస్తున్న తీరును సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఇటీవలి రాష్ట్ర కమిటీ సమావేశానంతరం నిశితంగా విమర్శించారు.

కొత్తపార్టీగా వచ్చిన వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు షర్మిల బీజేపీతో కలసి కార్యక్రమాలు ప్రతిపాదించడం, రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరడం ఇదే కోవలో ఉంది. నిరుద్యోగ సమస్యపై అంతా కలసి పనిచేయాలని చెప్పే పేరుతో ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలను సందర్శించిన షర్మిల ఆ పార్టీలపై అనుచిత ఆరోపణలు చేస్తే తమ్మినేని గట్టిగానే ఖండించారు. బీజేపీ హానికర విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌కు మునుగోడు ఎన్నికలలో మద్దతివ్వడం సరైందేననీ స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బీఆర్ఎస్ బీ టీమ్‌గా ఉన్నారని మా ఆఫీసుకు వచ్చి నిందలు వేయడం మర్యాద కాదని షర్మిలకు సూటిగానే చెప్పారు. మీడియాలోనూ ఇది ప్రధాన చర్చనీయాంశమైంది గానీ కొన్ని పత్రికలు పనిగట్టుకుని షర్మిల వ్యాఖ్యలే ప్రధానం చేయడం మరోకథ.

నిరసనలే సమాధానం

తెలంగాణలో తామే అధికారానికి రాబోతున్నామని ఆర్భాటంచేసిన బీజేపీకి క్షేత్రస్థాయిలో పరిస్థితి అనుకూలంగా లేదని తేలిపోయింది. లిక్కర్ కేసు పేరిట బీఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను అనేకసార్లు విచారించడమే గాక అరెస్టు అనివార్యం అని హల్‌చల్ చేసినా ఇంతవరకూ అది సాధ్యం కాలేదు. ఇక ముందు ఏమయ్యేది తెలియదు. దేశవ్యాపితంగానే ప్రతిపక్షాలు ఈడీ, సిబిఐల దుర్వినియోగాన్ని రాజకీయంగా, న్యాయపరంగా కూడా సవాలు చేయడం వాతావరణం మార్చింది. ఈ లోగా ప్రశ్నపత్రాల వ్యవహారంలో బీజేపీ పాత్ర అనుమానాస్పదంగా తేలి సాక్షాత్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టయ్యారు. బెయిలు మీద ఆయన వచ్చినా కేసు కొనసాగుతున్నది. బీజేపీ ఆశించినట్టు ప్రముఖులెవరూ ఆ పార్టీలో చేరిందిలేదు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి మాత్రం చేరారు గాని ఆయన వల్ల ఒరిగేది ఏమీలేదని బీజేపీ నేతలే చప్పరిస్తున్నారు. తెలంగాణలో ఆశించింది జరగలేదని అర్థమైన మోడీ అమిత్ షాలు పదేపదే పిలిచి మాట్లాడటం, పర్యటించడం సర్వసాధారణమై పోయింది. బీఆర్ఎస్ స్థాపన తర్వాత కేటీఆర్ ఏపీ వ్యవహారాలపైనా దృష్టి పెంచి విశాఖ ఉక్కుపై లేఖ రాయడం చర్చకు కారణమైంది. ఈలోగా సింగరేణిలో ఐదు బావులు వేలం పెట్టడంతో విశాఖ ఉక్కు తంతు పునరావృత మవుతున్నది. మోడీ పర్యటన సమయంలోనే బీఆర్ఎస్ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన నిరసన ప్రదర్శనలు ఆయనకు నిజమైన సమాధానంగా ఉన్నాయి. తెలంగాణలో సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రలు పూర్తికాగా సీపీఐ సాగిస్తున్నది. ఏపీలోనూ ఉభయ పార్టీలూ 14వ తేదీనుంచి ప్రజా సమీకరణలకు ప్రచారోద్యమానికి శ్రీకారం చుడుతున్నాయి.

కొత్తపార్టీగా వచ్చిన వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు షర్మిల బీజేపీతో కలసి కార్యక్రమాలు ప్రతిపాదించడం, రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరడం ఇదే కోవలో ఉంది. నిరుద్యోగ సమస్యపై అంతా కలసి పనిచేయాలని చెప్పే పేరుతో ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలను సందర్శించిన షర్మిల ఆ పార్టీలపై అనుచిత ఆరోపణలు చేస్తే తమ్మినేని గట్టిగానే ఖండించారు. బీజేపీ హానికర విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌కు మునుగోడు ఎన్నికలలో మద్దతివ్వడం సరైందేననీ స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బీఆర్ఎస్ బీ టీమ్‌గా ఉన్నారని మా ఆఫీసుకు వచ్చి నిందలు వేయడం మర్యాద కాదని షర్మిలకు సూటిగానే చెప్పారు.



ప్రజల వ్యక్తి... నిలువెత్తు స్ఫూర్తి


నర్రా రాఘవరెడ్డి

రాష్ట్రంలో ఎన్నికల గాలి జోరుగా వీస్తున్న తరుణమిది. డబ్బు, మద్యమే రాజకీయాలను శాసిస్తున్న కాలమిది. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులు గెలవక ముందోమాట, గెలిచాక ఒక మాట చెప్తున్న పరిస్థితి. వీటికి భిన్నంగా గత కాలచరిత్రలో నిక్కచ్చిగా నిలిచి నిస్వార్థ రాజకీయాలను నింగెత్తు నిలిపిన మహానేత నర్రా రాఘవరెడ్డి. చివరికంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవించిన నిండైన వ్యక్తిత్వమూర్తి. నాటి అసెంబ్లీలో పల్లెపరిమళం. మాటల ఊట, ఉద్యమాల కోట, స్ఫూర్తినిచ్చే బాట ఆయనది.

1924న ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో నర్రా కనకమ్మ, రాంరెడ్డి దంపతులకు రాఘవరెడ్డి జన్మించాడు. చిన్ననాడే భాగవతం, నీతికథలు, శతక పద్యాలను పుక్కిటబట్టాడు. కొన్ని కారణాలరీత్యా బొంబాయికి వలసపోయాడు. తొలుత ఒక హోటల్లో కార్మికునిగా చేరాడు. తర్వాత సూరత్‌కు చేరుకుని బట్టలమిల్లులో పనిచేశాడు. అక్కడే లాల్‌బావుటా కార్మిక సంఘానికి ఆకర్షితుడై ఉద్యమంలో తిరుగుతూ వచ్చాడు. అలా 1945 నుండి ప్రజా ఉద్యమాల్లోకి ప్రవేశించిన నర్రా ఎక్కడా వెనుదిరగలేదు. అన్యాయం, అక్రమం ఉన్నచోట ఫిరంగై నిలబడ్డాడు. తండ్రి పిలుపుతో తిరిగి స్వగ్రామం చేరుకుని జిల్లా కేంద్రంగా ఉద్యమించడం, విస్తృతంగా కమ్యూనిస్టు పార్టీలో తిరగడం ప్రారంభించాడు. సామాన్యుల, రైతుల, కార్మికుల పక్షాన నిలబడి నడిచాడు. 1950లో పార్టీ సభ్యత్వం తీసుకుని క్రియాశీలకంగా పనిచేస్తూ వచ్చాడు. తారకమ్మతో వివాహమైనప్పటికీ ప్రజాసేవలో వెనకడుగు వేయలేదు.

1952 సాధారణ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తరపున అతికష్టం మీద 12మంది అభ్యర్థులను ఎంపికచేసి ఎన్నికల్లో నిలబెట్టగా యువకుడైన రాఘవరెడ్డిని చినకొండూర్ నియోజకవర్గానికి ప్రచారకుడిగా పంపింది. అక్కడినుండే ఆయన కళాకారుడిగానూ రాణించాడు. వట్టిమర్తిలోనే గాక, జిల్లా వ్యాప్తంగా పార్టీ నిర్మాణానికి ఎనలేని కృషి చేస్తూ వచ్చిన నర్రా 1959-67 మధ్యకాలంలో వట్టిమర్తి గ్రామసర్పంచ్‌గా ఎన్నికైనాడు. తర్వాత అనేక పదవులు చేపడుతూనే ప్రజలతో మమేకమై మంచిపేరును గడించాడు.

భారత-చైనా యుద్ధం కారణంగా సీపీఐ(ఎం) నాయకుల్ని బంధించింది నాటి ప్రభుత్వం. అలా రాఘవరెడ్డి ఒకటిన్నర సంవత్సరాలు జైలుకి వెళ్ళాల్సి వచ్చింది. 1966లో విడుదలై 1967లో అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో రాఘవరెడ్డి పోటీచేశాడు. కేవలం రూ.300లు మాత్రమే ఖర్చుచేసి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. పాతకాలపు మోటర్ సైకిల్‌పై ఒక సహాయకుడిని వెంట పెట్టుకుని ప్రచారం చేయడం, గెలవడం గమనార్హం. 1972 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యాడు. నిజానికి నక్సల్బరీ వాదం రావడం, పార్టీ చీలికకావడం ఆ ఓటమికి కారణాలు. వ్యక్తిగతంగా నర్రా గెలుపొందినట్లే లెక్క అటు తర్వాత వరుసగా 1978, 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో శాసనసభ్యునిగా గెలుపొందడం, వృద్ధాప్యం కారణంగా స్వచ్ఛందంగా పోటీనుండి తప్పుకోవడం రాఘవరెడ్డి ప్రత్యేకతలు. 1994 ఎన్నికల ప్రచారంలోనూ కేవలం రూ.30వేలు మాత్రమే ఖర్చుచేయడం చెప్పదగిన విషయం. సుదీర్ఘకాలం పదవిలో ఉన్నా చిల్లి గవ్వకూడా అక్రమంగా సంపాదించలేదు. ఏ ఒక్కరికీ అన్యాయం చేసిన దాఖలాలు లేవు. నిరంతరం ప్రజాసమస్యల పట్ల స్పందిస్తూ అధికార పార్టీకి చురకలు అంటిస్తూనే వాటిని పరిష్కరింపజేసిన ఘనత రాఘవరెడ్డిది.



సుదీర్ఘ శాసన సభ్యత్వంలో కాసు బ్రహ్మానందరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, విజయభాస్కరరెడ్డి, ఎన్టీఆర్, ఎన్. జనార్ధనరెడ్డి, చంద్రబాబునాయుడు ఇలా అనేకమంది ముఖ్యమంత్రుల పాలనను చూశాడు. ప్రతిపక్ష నేతగా ఉంటూ అనేక సమస్యల్ని వాళ్ళ ముందుంచేవాడు. గ్రామాల విద్యుద్దీకరణ, ప్రాజెక్టులపై, ముఖ్యంగా ఎస్ఎల్‌బిసి విస్తరణ పూర్తికోసం ఎన్నో కార్యక్రమాలు, దీక్షలు చేశాడు. సాధించుకొచ్చాడు. 1975 ఎమర్జెన్సీ మూలంగా మరోసారి జైలుకెళ్ళినా జైలులోనూ అందరినీ నవ్విస్తూ, నిరంతర అధ్యయనం చేస్తూ వచ్చాడు. 1978 శాసనసభలో సీపీఐ(ఎం) అభ్యర్థులు 8మంది ఉన్నా రాఘవరెడ్డి క్రియాశీలకంగా ప్రజలపక్షాన పనిచేశాడు. బాగారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో గ్రామాలకు రోడ్లు సాధించుకున్నాడు.

జనార్ధన్‌రెడ్డి ఎస్ఎల్‌బిసిపై ఎగతాళిగా మాట్లాడితే సహించలేదు. పట్టుబట్టి మరీ సాధించుకున్నాడు. చంద్రబాబు సీఎం అయినప్పుడు నర్రానే వారికి పెద్దదిక్కుగా వ్యవహరించాడు. రైతులపక్షాన నిలబడి నీటిసుంకాలు రద్దుచేయించాడు. గీతకార్మికులవైపు నిలబడి 'గీసేవారికే చెట్టువిధానం' ద్వారా సంఘాలను ఏర్పరచి వారికై పోరాడాడు. పేదలకు బంచరాయి భూపంపిణీలోనూ, డిబిఆర్ మిల్స్ కార్మికులకు న్యాయం చేయడంలోనూ, రైస్ మిల్లర్లకు స్లాబ్ రేటు తగ్గించడంలోనూ, హైదరాబాద్‌లో ఎస్సీకే స్థలసేకరణ, నిర్మాణంలోనూ, జిల్లా వ్యాప్తంగా తాగునీరు, కరెంటు సాధనలోనూ, విద్యకై పాఠశాలలను నెలకొల్పడంలోనూ, హైదరాబాద్- సికింద్రాబాద్‌లో కృష్ణాజలాల మళ్ళింపు విషయంలోనూ పోరాడాడు. మహిళా కమిషన్ బిల్లులో మార్పుల ఏట్లనూ, ఆల్మట్టి డ్యామ్ ఎత్తుపెంపుదలలోని సమస్యలను వ్యక్తపరచడంలోనూ, బీబీనగర్-నడికుడి రైలుమార్గం సాధనలోనూ ఇలా అనేక ప్రజోపయోగ పనులకు రాఘవరెడ్డి నాడు ముందు వరుసలో నిలబడి సాధించే వరకు విశ్రాంతెరుగని స్వచ్ఛమైన ప్రజానేతగా వెలుగొందాడు.

నాటి పంచవర్ష ప్రణాళికలోని లోపాలు ఎండగడుతూ 'లత్కోర్సాబ్' పుస్తకం తీయడంతోపాటు గొల్ల సుద్దులతో జనాలను చైతన్యం చేసిన కళాకారుడు. అసెంబ్లీలో తెలంగాణ తెలుగుభాషను నిటారుగా నిలిపిన మాతృభాషాభిమాని. తెలంగాణ నుడికారాలు, పలుకుబడులతో, సామెతలతో సభను ఉత్తేజపరిచిన ఘనత ఆయనది. ఈ విషయంలో రాఘవరెడ్డి కృషిని కొనియాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలు 2017లో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఇటీవల సీఎం కేసీఆర్ అసెంబ్లీలోనూ ప్రస్తావించడం సముచితం. నిజమే బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రిగారన్నట్లు నర్రా అచ్చంగా 'ప్రజలవ్యక్తి'. నిరాడంబర రాజకీయాలకు నిలువెత్తు స్ఫూర్తి. ముందుతరాలకు ఆదర్శదీప్తి.

(నేడు నర్రా రాఘవరెడ్డి వర్ధంతి)

- నర్రా ప్రవీణ్‌రెడ్డి, సెల్:9393636405

దొంగ... తేలు

దొంగకు తేలుకు అవినాభావ సంబంధం ఉంది. ఓ సినిమాలో దొంగ తన జేబులో ఓ నల్ల తేలును పెట్టుకొని తిరగడం చూడొచ్చు. అయితే ఆ తేలు వేరు ఈరోజు చెప్పుకునే తేలు వేరు. తేళ్ళయందు ఉన్న రకములు వేరయా అని పద్యంలా కూడా చెప్పుకోవచ్చు. అసలు తేలు కొన్ని చోట్ల దాక్కొని ఉండి దొంగలాగా కుడుతుందని అనుకున్నా దాని పని మీద అది పోతూ ఉంటే మనిషే దాంతో కుట్టించుకుంటాడని కొందరి అనుభవం. ఏమైనా తేలుతో పెట్టుకుంటే కష్టమే. ఒక్కోసారి ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులు ఎక్కువైపోయి గుర్తులు కేటాయించడం కష్టమైనప్పుడు తేలు గుర్తు కూడా పెట్టిన సందర్భాలున్నాయి. అలా తేలు పై చెప్పుకుంటూ, వినుకుంటూ పోవచ్చు.


ఓ దొంగతనానికై పోయిన దొంగకు తేలు కుట్టిందట. అనుకుంటాం కాని చాలా కష్టమైన సందర్భం, దొంగకి. గట్టిగా అరవలేడు, అరిస్తే ఇంటివాళ్ళొచ్చి బొక్కలిరగదీస్తారు. మరేం చేయాలి. వేరే దారి లేదు, నోరు మూసుకుని చేస్తున్న దొంగతనాన్ని ఆపి, ఇంటికిపోయి మందేమైనా వేసుకొని రెస్టు తీసుకోవాలి. లేదూ వచ్చిన పని ముఖ్యం అని ఆ సామాను, ఈ సామాను తాను తెచ్చిన సంచిలో వేసుకుంటూ ఉంటే చిమక్ చిమక్కుమని తేలు కుట్టిన నొప్పి, దాని విషం ఒంట్లోకి పోతున్న క్రమం తెలుస్తూ, మనిషి ఏకాగ్రత లేక వచ్చిన వ్యవహారమేమో కాని, తాను ఇంకెక్కడో కొట్టుకొచ్చిన వస్తువులు కూడా ఇక్కడ అంటే తేలు కుట్టిన ఇంట్లో పెట్టి పోవలసి వస్తుంది. అది సంగతి. అందుకే అరవడం లాంటివి లేకుండా, ఇక ఆలస్యం చేయకుండా వచ్చిన దొంగ దొంగలా జారుకోవడం ఉత్తమం. బయటకొచ్చాక ఏమైనా అరుచుకోవచ్చు, అది వేరే సంగతి.



జంధ్యాల రఘుబాబు
9849753298


అసలు ఏ పల్లెలో కూడా ఇప్పుడు తేళ్ళు కనబడని పరిస్థితి. వర్షాకాలం మొదట్లో భూమి లోపల ఉండే వేడికి తట్టుకోలేక తేళ్ళు బయటికొస్తాయి. ఇప్పుడైనా పొలాల్లో రాళ్ళు తీసి చూస్తే కనిపిస్తాయవి. పురుగుల కోసం, బొద్దింకల కోసం, ఇంకా ఇతర కీటకాలు రాకుండా మానవుడు మందులేయబట్టి ఈ తేళ్ళు, జర్రులు కనబడకుండా పోయిన పరిస్థితి. పిల్లలకి తేలు అని చెప్పినా అర్థం కాని కాలం, స్కార్పియన్ అని చెబితే కాని సమజై చావదు. మానవుడు తాను బతకడానికి ఎన్నో జంతువులను, జీవులను చంపుతాడు. అసలు జీవితం వాటితో పాటు జీవించడమని మరచిపోయాడు. మెదడుకు పోయే కాలం వచ్చినప్పుడు అలాగే ఉంటుంది మరి.

తేలంటే నాకు వెంటనే గుర్తొచ్చేది మన పాత ముఖ్యమంత్రి అంజయ్య గారు. ఆయన్ పేరు వింటేనే నవ్వొస్తుంది. ఆయనలోని పిల్లవాడే ఎప్పుడూ బయటకు కనిపించేది. పిల్లల్లాగే ఆయన ప్రజలను ప్రేమించే మనిషి. ఆయన ఎంత సాధారణ మనిషో, ఎంత మంచివాడో, ఎంత లోకప్రియుడో చెప్పాలంటే పేజీలు పేజీలు చాలవు. ఒక సారి గోదావరిలో అంటే నదిలో చమురు పడింది. ఆ సంతోషం



తట్టుకోలేకనేమో గోదారిలో తేల్ పడింది అనేశాడాయన. తేల్ అంటే నూనే అని కదా అర్థం. హిందీ కాని, ఉర్దూ కాని అంత సరిగా తెలీని జనాలు గోదావరిలో తేలు పడితే ఏమవుతుంది అని ఎవరి మెదడుకు తోచినంత వాళ్ళు అనుకున్నారు. కొందరైతే బయటికే అనేశారు. అలా గోదారిలో తేల్ పడ్డ సంఘటన తమాషాగా చెప్పుకోవచ్చు. గుర్తుకు రాక మానదు, అలాంటిది మరి మనం ఎంచుకున్న సబ్జెక్టు.

జనాలు సెల్లులో మొహం పెట్టి చదవడం మానేశారు కాని, వాళ్ళకో సూచన. వీరేశలింగం పంతులు గారి హాస్య సంజీవని అదే సెల్లులో కొడితే గూగుల్ తల్లి చూపిస్తుంది. ఒకానొక



పోరగాడు తేలు మంత్రం నేర్చుకుందామని ఒక అయ్యోరి దగ్గరికి పోతాడు. తేలు మంత్రమేమిటి అని పిల్లలు ఆశ్చర్యపోవచ్చు. కాని ఇప్పుడు చెప్పుకునే స్టోరీ పాత కాలానికి చెందింది అని మరవొద్దు. సరే ఆ అయ్యోరు తేలు మంత్రం నేర్పుతాను, ఫలానా చెట్టెక్కి దాని ఆకులు కోసుకురమ్మని పంపించాడు. మనోడు, అంటే తేలు మంత్రం నేర్చుకోవాలని తహతహలాడే పోరగాడు ఊరంతా తిరిగి వాళ్ళనీ వీళ్ళనీ అడిగి ఆ చెట్టేదో కనిపెట్టి ఆకులు కోద్దామని చెట్టెక్కుతాడు. ఆకులు కోస్తున్నాడు. ఇంతలో ఒక ఆకు వెనుకనున్న ఒకానొక తేలు నా పుట్టలో ఏలెడితే కుట్టనా అన్న చీమ మాదిరి వాణ్ణి కుట్టేసింది. వాడు కుయ్యో మొర్రో అనుకుంటూ ఆ అయ్యోరి దగ్గరికే పోతాడు మందో, మాకో, మంత్రమో ఏదో ఒకటి వేసుకుందామని. ఇంతటి తమాషా కథని ఆ కాలానికే రాసిన వీరేశలింగం గారిని మనం మెచ్చుకోవలసిందే. అలా తేలు మంత్రం నేర్చుకుందామని పోయిన పోరగాడికి తేలు కుట్టినందుకు వచ్చే నొప్పికి మంత్రం వేయడమేమో కాని అసలు తేలుతో కుట్టించుకోకపోవడమ సుఖం అన్న విషయం తెలిసి వచ్చింటుంది. వాడి బుర్రలో తెలివి ఉంటే అలాగే చేస్తాడు.

ఇక దొంగల ప్రతిజ్ఞ గురించి చూద్దాం. దొంగతనానికి పోయే దొంగ ఇతర దొంగలతో కలిపి ఇలా ప్రతిజ్ఞ చేయొచ్చు "దొంగనైన నేను, నా పని నిర్వర్తించే సమయంలో, తేలుకుట్టినా, ఇంకేదైనా కీటకం కుట్టినా, గట్టిగా అరవనని, సహనంతో తట్టుకుంటానని, నేను చేసేది దొంగతనమైనా పట్టుబడితే ఇతరులవైపు వేలు చూపించి దొంగ దొంగ అని అరుస్తానని..." ఇలాగుండొచ్చు. రౌడీ అల్లుడు సినిమాలో చిరు మారువేషంలో ఇంకో చిరుగా పోవలసి వస్తే, తనను పంపుతున్న దొంగలతో ప్రమాణం చేయిస్తాడు, మాట తప్పము అని. అలా దొంగలకూ ప్రతిజ్ఞలుంటాయని మరువరాదు. దొంగకు దొరలాగా మాట్లాడటం కూడా వచ్చి ఉండాలి. దొరలతో స్నేహం ఉండాలి, దొంగలను దొరలుగా మార్చడమెట్లో వచ్చి ఉండాలి. స్వతహాగా తాను ఆ క్రమంలో ఎలా పైకొచ్చిందీ తేలును చంపాల్సి వచ్చినప్పుడు దొరకని చెప్పు, వేరే సమయంలో దొరికితే వాటిని మోసి పరవశించి పోయిన సందర్భాన్ని గుర్తు తెచ్చుకొని మురిసి మురిసి పోయే వాళ్ళు దొరతనానికి దగ్గరయ్యే మార్గమేదో కనిపెట్టామని ఫీలవుతుంటారు. అలాంటి అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావాలని ఆరాటపడుతుంటారు.

దొంగకు దొరలాగా మాట్లాడటం కూడా వచ్చి ఉండాలి. దొరలతో స్నేహం ఉండాలి, దొంగలను దొరలుగా మార్చడమెట్లో వచ్చి ఉండాలి. స్వతహాగా తాను ఆ క్రమంలో ఎలా పైకొచ్చిందీ తేలును చంపాల్సి వచ్చినప్పుడు దొరకని చెప్పు, వేరే సమయంలో దొరికితే వాటిని మోసి పరవశించి పోయిన సందర్భాన్ని గుర్తు తెచ్చుకొని మురిసి మురిసి పోయే వాళ్ళు దొరతనానికి దగ్గరయ్యే మార్గమేదో కనిపెట్టామని ఫీలవుతుంటారు. అలాంటి అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావాలని ఆరాటపడుతుంటారు.

మానవి
హైదరాబాద్
నవతెలంగాణ 5
ఆదివారం 9 ఏప్రిల్ 2023
www.navatelangana.com

కళకు ప్రాణం పోస్తున్న ఆదివాసీ చిత్రకారిణి


దుర్గాబాయి వ్యామ్... ఆధిపత్య సమూహాల వల్ల అట్టడుగు కళలు ఎన్నో మరుగున పడిపోయాయి. వాటిలో ఆదివాసీలకు చెందిన గోండ్ కళ ఒకటి. దాన్ని కాపాడుకునేందుకు ఆమె ఎంతో కృషి చేస్తున్నారు. ఆ కళకు సంబంధించిన గోండ్ సంఘంలో పని చేస్తూ దాని వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. సుభాష్ వ్యామ్‌తో కలిసి ఆ కళతో మమేకమై ఎప్పుడూ బిజీగా గడుపుతున్నారు. 30 ఏండ్లుగా ఆమె భారతదేశంలోని గిరిజన మ్యూజియంలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గ్యాలరీలలో తన చిత్రాలను ప్రదర్శించారు. ప్రముఖ విమర్శకుల నుండి ప్రశంసలు అందుకున్నారు. ఎన్నో అవార్డులు పొందారు. అభ్యుదయ ప్రచురణ కర్తల మధ్య గొప్ప పేరు సంపాదించారు. 2022లో పద్మశ్రీ సైతం అందుకున్నారు. అంతర్జాతీయ వేదికలపై గోండు కళ ప్రాముఖ్యతను వివరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆ ఆదివాసీ చిత్రకారిణి తమ కళ గురించి ఓ ఇంగ్లీషు పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు మానవి పాఠకులకు ప్రత్యేకం.






చాలా చిన్నప్పటి నుండే ఈ కళతో మమేకమై ఉన్నారు. ఈ అభిరుచి మీకు ఎలా వచ్చిందో చెబుతారా?

పర్ధన్ గోండ్ సమాజానికి చెందిన మహిళలకు తమ గోడలు, భవనాలు, అంగన్ (ప్రాంగణం), కోఠి (వంటగది)లో భిత్తి చిత్రాన్ని తయారు చేయడం సంప్రదాయం. మేము వివిధ రంగుల మాటి (బురద)తో, అనేక విభిన్న ఆకృ తులలో నమూనాలను తయారు చేస్తాం. వీటిలో ప్రతి ఒక్కటి విభిన్న మూలం, కథనాన్ని కలిగి ఉంటాయి. భిత్తిచిత్రమే కాకుండా హోలీ వంటి వేడుకలకు రంగులు వేయడానికి, అలంకరణకు గోబర్(పేడ)ని ఉప యోగిస్తాము. చిన్నతనంలో మా ఊరి పండుగలు, పెళ్లిళ్లకు దిగ్నా భిత్తిచిత్రం చేయడం నేర్చుకున్నాను. నేను మొదట ఇది నేను మా నాన్నమ్మ దగ్గర నేర్చు కున్నాను. ఆపై మా గ్రామంలోని ఇతర మహిళ లందరితో కలిసి ఈ నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడం కొనసాగించాను.





భోపాల్‌కు వెళ్లడం, నగరంలో కళను పరిచయం చేయడం ఎలా అనిపిస్తుంది?

1996లో నేను నా భర్త సుభాష్, మా పిల్లలతో కలిసి భోపాల్‌కు వెళ్లాను. అతని బంధువు జంగర్ సింగ్ శ్యామ్, గోండి కళలో కొత్త శైలికి మార్గ దర్శకుడు. అప్పటికే ఆయన స్వామినాథన్ మద్ద తుతో పెద్ద నగరంలో స్థిరపడ్డారు. ఆ ప్రారంభ కాలంలో మేము అతనితో పని చేసాము. సుభాష్ స్క్రీన్ ప్రింటింగ్, వుడ్ వర్క్ చేసాడు. నేను కూడా నా కళాత్మక నైపుణ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నించాను.

మీరు చెప్పినట్లుగా ఆధునిక భారతీయ కళలో జంగర్ సింగ్ శ్యామ్ చాలా ముఖ్యమైన వ్యక్తి. అతని గురించి మీ జ్ఞాపకాలు ఏమిటి?

అతను గొప్ప కళాకారుడు. మమ్మల్ని చాలా ప్రోత్సహించాడు. కళాత్మక అభ్యాసం మాత్రమే కాకుండా అన్ని ప్రయత్నాలను ప్రోత్సహిస్తుంది. అది సృజనా త్మక పని అయినా లేదా ఒక కప్పు టీ తయారీ అయినా. అతను నన్ను సోదరిలా చూసుకున్నాడు. నా ప్రయత్నాలను, కళాకృతిని ఎల్లప్పుడూ అభినందిస్తూ, అభివృద్ధి చెందడానికి నన్ను ప్రేరేపించాడు.

మీరు గోడల నుండి పేపర్‌కి ఎలా మారారు?

భోపాల్‌కి మారిన ఏడాది తర్వాత నేను జంగర్‌తో కలిసి భారత్ భవన్‌లో పని ప్రారంభించాను. ఆ తర్వాతే కాన్వాస్ పెయిం టింగ్స్ వేయడం ప్రారంభించాను. అప్పుడే మొదటిసారి బ్రష్‌లు, సింథటిక్ పెయింట్‌ని ఉపయోగించాను. డిగ్నా సౌందర్యాన్ని కాన్వాస్ లోని పరిమిత స్థలంలో ఎలా చూపించ గలనో అని మొదట్లో చాలా భయ పడ్డాను. అయితే మా ఆరాధ్య దైవం ఖార్థదేవ్‌ను మధ్యలో ఉంచి, సంప్రదాయ డిజైన్‌లతో నాలుగు వైపులా చుట్టుముట్టడం ద్వారా ఒక మార్గాన్ని రూపొందించాను.

మీ మొదటి పెయింటింగ్ ఎక్కడుఉంది?

చండీగఢ్‌లోని ప్రభుత్వ మ్యూజియం కొనుగోలు చేసింది.

మీరు ఉపయోగించే ఐకానోగ్రఫీ ఎలా అభివృద్ధి చెందింది?

నా పనిలోని దృశ్యాలన్నీ మన పూర్వీకుల జానపద కథలు, ఆచారాలు, సాంప్రదాయాలకు చిహ్నాలు. బేసిన్ కన్యా కథ, వెదురు కన్య గురించి ఒక గోండ్ జానపద కథ, చంద్రుడు, సూర్యుడు, జంతువులు, చెట్లు, ప్రకృతి మాత, గోండి దేవతలకు సంబంధించిన కథనాలన్నీ నా పనిలో భాగమే. ఏండ్ల సాధన వల్ల నా చిత్రాలను మరింత మెరుగు పరుచుకున్నా. అన్ని రకాల వీక్షకులకు అందుబాటులో ఉండేలా చేయగలిగా.

ది నైట్ లైఫ్ ఆఫ్ ట్రీస్ (తారా బుక్స్, 2006) సహ రచయితగా బోలోగ్నా రాగజ్జీ అవార్డు 2008ని గెలుచుకోవడంతో సహా మీ పుస్తకాలకు అంతర్జాతీయ ప్రశంసలు పొందారు. ఇది ఎలా సాధ్యం?

నేను ఏకలవ్య ఫౌండేషన్ వారు ప్రచురించే బుక్‌లెట్‌ల కోసం చిత్రాలను రూపొందించడం 2000లో ప్రారంభించాను. ఈ సమయంలో వీటిలో ఒకటి న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ప్రదర్శించబడింది. అప్పుడే చెన్నైకి చెందిన పబ్లిషింగ్‌హౌస్ అయిన తారా బుక్స్ వారు నన్ను సంప్రదిం చింది. ఆ తర్వాత 2007లో నవయాన అనే ఢిల్లీకి చెందిన పబ్లిషింగ్ హౌస్ వారి కోసం గీయడానికి నన్ను నియమిం చారు. అప్పటి నుండి నేను, కొన్నిసార్లు నా భర్త సహ కారంతో తారా బుక్స్, నవయాన రెండింటికీ అనేక ప్రచురణలకు సహకరించాను.



అంబేద్కర్ జీవితానికి సంబంధించిన గ్రాఫిక్ రీటెల్లింగ్‌కు మీరు, సుభాష్ కలిసి పని చేశారు. దాని గురించి మాట్లాడగలరా?

భీమాయనాన్ని ఎలా వివరించాలో మేము ఒత్తిడికి గురయ్యాము. అంబేద్కర్ ప్రయాణం కష్టాలు, సవాళ్లతో కూడుకున్నదని మేము అర్థం చేసు కున్నాం. నేటి యువత ఆయన జీవితం, అంట రానితనానికి వ్యతిరేకంగా చేసిన కృషి గురించి తెలుసు కోవడం వల్ల మన ప్రస్తుత కాలంలో కొన సాగుతున్న అన్యాయాలపై ప్రశ్నించగలుగుతారు. అంతే కాదు మా సొంత గ్రామంలో చూసిన అను భవాలకు, ఈ పుస్తకంలో ఉన్నవాటికి సంబంధం ఉంది. కాబట్టి మా అనుభవాల ద్వారా కంటెంట్‌ను యాక్సెస్ చేయగలిగాము. చివరకు కథలోకి మా డిగ్నా ఆర్ట్‌ని తీసుకురావడం ద్వారా ఫార్మాట్ సమస్యను పరిష్కరించాం.

స్వాతంత్ర్యం కోసం అంబేద్కర్ చేసిన పోరాటాన్ని చూపించడానికి మీరు ఎలాంటి పద్ధతి అనుసరించారు?

కథనంలోని లక్షణాలను సూచించడానికి బిత్తిచిత్ర నుండి డిజైన్‌లు, చిత్రాలను ఉపయోగించాము. కానీ మా సొంత కల్పన ద్వారా పాములా రైలును తయారు చేయడం, సమాజ సంఘీభావాన్ని తెలియజేయడానికి నెమలి ఈకను ఉపయోగించాం. అయితే పాఠకులు ఈ రూపాలను గుర్తించలేకపోవడంతో మేము కొన్నిసార్లు వీటిని ఎత్తి చూపవలసి వచ్చింది.

పల్లెటూరి జీవితానికి చెందిన మీ కళను పట్టణ, సమకాలీన ప్రపంచం ఎలా అర్థం చేసుకుంది..?

నేను నగరం, పట్టణ జీవితాన్ని నా పనిలోకి తీసుకువచ్చాను. ప్రస్తుత సంఘటనలకు ప్రతిస్పందించాను. 2011, సెప్టెంబర్‌లో యుఎస్ భవనంపైన విమానాలు కూలి పోవడం గురించి రేడియోలో విన్న తర్వాత దానికి సంబం ధించిన ప్రగతి మైదాన్‌లో చిత్రాన్ని గీశాను. భారతదేశం నుండి జర్మనీకి నా మొదటి పర్యటన తర్వాత విమానాలను తయారు చేశాను. ఇప్పుడు పెద్ద నగరంలో జరుగుతున్న సాంప్రదాయ పండుగలు, వివాహాల దృశ్యాలను కూడా చూపిస్తున్నాను. అలాగే నా సొంత జీవితం నుండి కూడా కొన్నింటిని తీసుకున్నాను.

2022లో పద్మశ్రీ అవార్డు పొందారు.. దీని గురించి మీ స్పందన?

ఇది నాకు దక్కిన చాలా గొప్ప గౌరవం. భోపాల్‌లో కారు ప్రయాణంలో ఉండగా పద్మశ్రీ గురించి తెలియజేయ డానికి, అభినందించడానికి మండల జిల్లా కలెక్టర్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. కొద్ది సేపట్లోనే గ్రామం లో, ఇంటి దగ్గర నన్ను అభినందించడానికి జనం గుమిగూడింది.

అభివృద్ధి పేరుతో రాజ్య విధానాల వల్ల ఆదివాసీ భూమి, వనరులు దోపిడీకి గురవుతున్నాయి. సహజ పర్యావరణాన్ని రక్షించుకునే విషయంలో గోండ్ కళను మీరు ఎలా ఉపయోగిస్తున్నారు?

మన సాంప్రదాయక కళా సాధనలో, ప్రకృతి మాత మన పాత జీవన విధానాల నుండి మేము గాఢంగా ప్రేరణ పొందాము. నా పనిలో కూడా నేను ఎల్లప్పుడూ ప్రకృతిని కాపాడుకోవడం గురించి నొక్కి చెబుతాను.

బిత్తిచిత్ర, గోండు కళల ముందున్న లక్ష్యం ఏంటి?


ఇది పాత కళ, కానీ దానికి కొత్త దిశానిర్దేశం చేయాలని మేము ఆశిస్తున్నాము.

❄❄



ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

- తమను సంప్రదించలేదంటూ ఎన్‌సీఈఆర్టీపై ఆగ్రహం
- ఇది విచ్ఛిన్నకర రాజకీయ యత్నమేనని విమర్శ



న్యూఢిల్లీ : 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 12వ తరగతి పాఠ్యపుస్తకాలలో కొన్ని చాప్టర్లను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పలువురు చరిత్రకారులు ఎన్‌సీఈఆర్టీని డిమాండ్ చేశారు. గతంలో పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భాగస్వాములైన నిపుణులను సంప్రదించకుండానే ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. రోమిలా థాపర్, జయతీఘోష్ సహా 250 మంది చరిత్రకారులు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీఈఆర్టీ చర్యను వారు ముక్తకంఠంతో ఖండిస్తూ ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మార్పులు భారత రాజ్యాంగ నీతికి విరుద్ధమని ఆక్షేపించారు. జాదవ్‌పూర్, జవహర్‌లాల్ నెహ్రూ, ఢిల్లీ, అశోకా యూనివర్సిటీలతో పాటు యూనివర్సిటీ ఆఫ్ అమ్‌స్టర్‌డామ్ సహా పలు విద్యాసంస్థలకు చెందిన విద్యావేత్తలు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు. 'చరిత్ర పుస్తకాల నుంచి కొన్ని చాప్టర్లను తొలగించాలన్న ఎన్‌సీఈఆర్టీ నిర్ణయంపై మేము ఆందోళన చెందుతున్నాం. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. విచ్ఛిన్నకర ఉద్దేశాలతోనే ఎన్‌సీఈఆర్టీ ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ నీతి, భారత ఉపఖండపు అవిభక్త సంస్కృతికి ఈ నిర్ణయం వ్యతిరేకం. అందువల్ల దీనిని సాధ్యమైనంత త్వరగా రద్దు చేయాలి' అని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భాగస్వాములైన కమలానెహ్రూ కళాశాలకు చెందిన విక్టోరియా పాషంగ్‌బామ్, జీసస్ అండ్ మేరీ కళాశాలకు చెందిన మాయా జాన్, రమ్‌జాస్ కళాశాలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ముకుల్ మంగాలిక్ తదితరులు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు. చరిత్రకారులు, అధ్యాపకులు సహా పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పాలుపంచుకున్న వారిని సంప్రదించేందుకు ఎలాంటి ప్రయత్నం జరగలేదనీ, ఎన్‌సీఈఆర్టీ సభ్యుల అభిప్రాయాలు కూడా తీసుకోలేదని వారు విమర్శించారు. 'కోవిడ్ మహమ్మారి కారణంగా ఎదురైన ఇబ్బందులను, జాతీయ విద్యావిధానం-2020ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే పేరుతో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలలో కొన్ని చాప్టర్లను తొలగించింది. ఇందులో భాగంగానే మొఘల్ చరిత్ర, కులం-అసమానతల ప్రస్తావనలు, 2002 గుజరాత్ అల్లర్లు, మహాత్మాగాంధీ జీవితం-హత్య వంటి చాప్టర్లు మాయమయ్యాయి. విద్యార్థులపై భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందంటూ అందుకు కోవిడ్, లాక్‌డౌన్‌ను సాకుగా చూపడం వివాదాస్పదమే' అని చరిత్రకారులు అభివర్ణించారు. '6-12 తరగతులకు చెందిన సామాజిక శాస్త్రం, చరిత్ర, రాజకీయ శాస్త్రం పాఠ్యపుస్తకాల నుంచి మొఘలుల చరిత్ర, 2002 గుజరాత్ మత ఘర్షణలు, అత్యవసర పరిస్థితి, దళిత రచయితల ప్రస్తావన, నక్సలైట్ ఉద్యమం, సమానత్వం కోసం పోరాటం వంటి చాప్టర్లను వారు తొలగించారు. అయితే కోవిడ్ అనంతరం పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుతున్న తరుణంలో, ఆన్‌లైన్ పద్ధతి అవసరం లేని ప్రస్తుత సమయంలో సైతం నూతన పాఠ్యపుస్తకాలలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి' అని వారు విమర్శించారు. విలువైన సమాచారాన్ని పొందే అవకాశాన్ని విద్యార్థులకు దూరం చేయడం సమస్యలకు దారి తీస్తుందనీ, ప్రస్తుత, భవిష్యత్ సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన విలువలు వారికి అందకుండా పోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. చరిత్రకారుల ఏకాభిప్రాయంతోనే మార్పులు, చేర్పులు చేయాలని వారు అభిప్రాయపడ్డారు. అలా కాకుండా కొన్ని చాప్టర్లను తొలగించడం విచ్ఛిన్నకర రాజకీయం అవుతుందని విమర్శించారు. ఈ రాజకీయాల కారణంగానే మొఘలుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి కనుమరుగు చేశారనీ, విజయనగర సామ్రాజ్యానికి సంబంధించిన అంశాల జోలికి వెళ్లలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రను సరిగా అవగాహన చేసుకోకుండా పాఠ్యాంశాలను తొలగించడం మతోన్మాదమే అవుతుందన్నారు. ఇది పాలకుల విచ్ఛిన్నకర మత, కుల అజెండాను బహిర్గతం చేస్తోందని చరిత్రకారులు విమర్శించారు.

సుఖోయ్‌లో రాష్ట్రపతి

తేజ్‌పూర్ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్ 30 (ఎంకేఐ) ఫైటర్ జెట్‌లో 30 నిమిషాలపాటు సోర్టీని చేపట్టారు. సుఖోయ్ జెట్ ఉదయం 11:08 గంటలకు బయలుదేరి...11.38 గంటలకు ల్యాండ్ అయింది. సుఖోయ్‌లో ప్రయాణించిన దేశానికి రెండో మహిళా అధ్యక్షురాలిగా ముర్ము నిలిచారు. అంతకు ముందు మాజీ రాష్ట్రపతి ప్రతిభా సింగ్ పాటిల్ కూడా సుఖోయ్‌లో ప్రయాణించారు.ఎయిర్‌ఫోర్స్ అధికాలు వివరాల ప్రకారం, రాష్ట్రపతి 30 నిమిషాల విమానంలో బ్రహ్మపుత్ర , తేజ్‌పూర్ వ్యాలీని కవర్ చేశారు. ఈ విమానం సముద్ర మట్టానికి దాదాపు రెండు కిలోమీటర్ల ఎత్తులో గంటకు 800 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. ఈ విమానాన్ని 106 స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ నడిపారు. విమాన ప్రయాణానికి ముందు వైమానిక దళ కార్యాచరణ సామర్థ్యం గురించి అధికారులు రాష్ట్రపతికి వివరించారు. అయితే మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ రెండు రికార్డులు సృష్టించారు.ముర్ము కంటే ముందు, దేశ 12వ రాష్ట్రపతి ప్రతిభా సింగ్ పాటిల్ 2009లో సుఖోయ్‌లో ప్రయాణించారు. ప్రతిభా పాటిల్ సుఖోయ్‌లో ప్రయాణించి రెండు ప్రపంచ రికార్డులు సష్టించింది. మొదటిది- సుఖోయ్‌లో ప్రయాణించిన ప్రపంచంలో తొలి మహిళా అధ్యక్షురాలు. రెండవది - అతి పెద్ద వయసు(74 ఏండ్లు) ఉన్న మహిళగా ప్రతిభా పాటిల్ రికార్డు సాధించారు. ఆమె పేరు గిన్నిస్ బుక్‌లో కూడా నమోదైంది.ప్రతిభా పాటిల్ కంటే ముందు, డాక్టర్ అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్నప్పుడు జూన్ 8, 2006న సుఖోయ్ నడిపారు. అలా ఫీట్ చేసిన దేశానికి తొలి రాష్ట్రపతి ఆయనే. అతని తర్వాత ప్రతిభా పాటిల్ సుఖోయ్‌లో పయనిస్తే.. ఇప్పుడు ద్రౌపది ముర్ము అలా చేసిన మూడవ రాష్ట్రపతి కావటం విశేషం. నిర్మలా సీతారామన్ కూడా 2018 జనవరి 17న రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు సుఖోయ్ 30ఎంకేఐలో ప్రయాణించారు. దేశంలోనే అత్యాధునిక యుద్ధ విమానమైన సుఖోయ్‌లో ప్రయాణించిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

రూ.5 వేల కోట్ల ప్రత్యేక గ్రాంటు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

తరగతుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నదని పేర్కొన్నారు. వాటిలో ఒక్క గది మాత్రమే ఉంటుందని వివరించారు. కొన్నిచోట్ల స్వంత భవనాల్లేక కిరాయి గదుల్లో నడుపుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్సు గల బాల, బాలికలు రావాలని పేర్కొన్నారు. ఆ గదిలోనే వంట కూడా చేయాలని వివరించారు. అంగన్‌వాడీ టీచర్ ఒక్కరే అందరినీ చూసుకోవాలని తెలిపారు. ఈ కారణాల వల్ల ఆయా కేంద్రాలను తల్లిదండ్రులు పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా పరిగణించడం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వేల రూపాయలు వెచ్చించి మూడేండ్లు నిండగానే ప్రయివేటు పాఠశాలలకు పంపించాల్సి వస్తున్నదని తెలిపారు. తద్వారా వారు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు 18 వేల వరకున్నాయని తెలిపారు. వాటిలో పదివేల ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతుల ఏర్పాటు కోసం రూ.ఐదు వేల కోట్లు ప్రత్యేక గ్రాంటును తెలంగాణ రాష్ట్రానికి విడుదల చేయాలని నర్సిరెడ్డి కోరారు.

తెలంగాణ విరోధి

(మొదటిపేజీ తరువాయి)



చట్టంలోని హామీలను అమలు చేయని ప్రధాని, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రావడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. సింగరేణిని ప్రయివేటీకరించేందుకు కుట్ర పన్నుతున్నారని, అందుకే టెండర్లు పిలిచారని విమర్శించారు. రామగుండం ఎరువుల కర్మాగారం ప్రారంభించేందుకు వచ్చినపుడు సింగరేణిని ప్రయివేటీకరించేది లేదంటూ ప్రధాని హామీనిచ్చారని గుర్తు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచటంతో సామాన్యులు విలవిల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులను మోడీ కాలరాస్తున్నారని, ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలన్న మోడీ ఈ తొమ్మిదేండ్లలో 18 కోట్ల మందికి ఉద్యోగాలివ్వాల్సి ఉందన్నారు. కానీ 18 లక్షల మందికి కూడా ఉద్యోగాలివ్వలేదని ఎద్దేవా చేశారు. ఇంకోవైపు ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని చెప్పారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సహజ వనరులను అదానీకి అప్పగిస్తున్నారని అన్నారు. ప్రధాని మోడీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశాన్ని రిటైల్‌గా అమ్ముకుంటారని అన్నారు. నిరంకుశ విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి రవికుమార్, ఆర్ శ్రీరాం నాయక్, టి స్కైలాబ్‌బాబు, జె బాబురావు, బి ప్రసాద్, ఎం అడివయ్య, నగర నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'వి'పత్తే

(మొదటిపేజీ తరువాయి)

అందుకు సుముఖంగా లేరు. ఆశించిన ధరలు లేక క్వింటాళ్ల కొద్దీ పత్తి నిల్వలు ఇండ్లలోనే ఉండడంతో ఏమి చేయగలమని కన్నీరుమున్నీరవుతున్నారు. కొంతమంది పట్టేదారులు బాగా ఒత్తిడి చేస్తుండటంతో కౌలుదారులతో విభేదాలు, స్పర్థలు చోటుచేసుకుంటున్నాయి. 'పత్తికి ఆశించిన ధర లేదు.. కండ్ల ముందే కనబడుతోంది.. డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి.. ఇట్లనే ఇబ్బంది పెడితే వచ్చే ఏడాది కౌలుకు ఇవ్వకపోయినా ఫర్వాలేదా' అని కొందరు కౌలుదారులు భూ యజమానులను అడుగుతున్నారు. మరికొందరు నెల రోజుల సమయం పెట్టి.. ఎంతో కొంత తగ్గించాలని ప్రాథేయపడుతున్న ఉదంతాలు పల్లెల్లో కనిపిస్తున్నాయి. ప్రతియేటా జనవరి,ఫిబ్రవరి నెలల నాటికి పత్తి తీతలు పూర్తి చేసి ఆ పంటను తొలగించేవారు.అమ్ముకునేవారు.వాటిని రబీ(యాసంగి) కింద మొక్కజొన్న, వరి, పెసర సాగు పెట్టుబడులకు ఉపయోగించేవారు. ఇప్పుడు పత్తి అమ్ముడుపోక తిరిగి అప్పు, చేబదుళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉత్పన్నమైంది. దీనికి పెట్టుబడి పంటగా భావించే పత్తి ధరల పతనమే ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు.

ధరలేదు.. దిగుబడి రాలేదు..

ఖమ్మం జిల్లాలో పత్తి అధికంగా సేద్యం చేసే మండలాల్లో ముదిగొండ ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల ఎకరాల వరకు పత్తి సాగు చేస్తే ముదిగొండలో 40వేల ఎకరాల వరకు ఈ పంట వేస్తుంటారు. మండలంలోని పమ్మి రెవెన్యూలో 500 మంది రైతులు మూడు వేల ఎకరాల్లో పత్తి సేద్యం చేశారు. వీరిలో 300 మందికి పైగా కౌలుదారులే ఉన్నారు. ఖరీఫ్‌లో పత్తి వేసి, రబీలో ఆ పంటను తొలగించి మొక్కజొన్న సాగు చేస్తుంటారు.

సాధారణంగా 8 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి ఈ ఏడాది నాలుగు క్వింటాళ్లలోపే వచ్చింది. క్వింటాకు రూ.12వేలకు పైగా ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతుండగా ఈ ఏడాది ఆరంభంలో రూ.8వేలకు పైచిలుకు రేట్లు పలికాయి. ఆ ధర మరింత పెరుగుతుందని ఆశ పడిన రైతులు పంటను నిల్వ చేసుకున్నారు. కానీ రోజురోజుకు ధరలు పడిపోయాయి. ప్రస్తుతం రూ.6వేల వరకే పలుకుతోం ది. ఫలితంగా ఇంటింటా పత్తి నిల్వలు పేరుకున్నాయి. కాయలు కుళ్లిపోయాయి. ఎక్కువకాలం నిల్వ చేయడంతో మకెర పురుగుల ఉధృతి అధికమైంది. ఈ పురుగుల వల్ల దురదలు వస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. ప్రతియేటా కౌలుకు తీసుకునే సమయంలో తొలుత సగం కౌలు భూ యజమానులకు చెల్లిస్తారు. ఆరుతడి పంటలు సాగు చేసే భూమికి ఎకరానికి రూ.20వేల చొప్పున కౌలు ఉంది. మాగాణైతే పది బస్తాల వడ్లు (రూ.15 నుంచి రూ.20వేలు) ఇవ్వాల్సి ఉంటుంది. ఉగాదికి కౌలు కాగితం తిరగరాస్తారు. కానీ ఈ ఏడాది మే నెలలో చెల్లిస్తామని రైతులు భూ యజమానులతో ఒప్పందం చేసుకుంటున్నారు. కొందరు ఒప్పుకుంటుండగా మరికొందరు అంగీకరించట్లేదు. సమస్య తీవ్రతను అర్థం చేసుకుని కేంద్రప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రంగంలోకి దించి నిల్వ ఉన్న పత్తి మొత్తాన్ని రూ.8000 పైగా ధర పెట్టి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వమూ జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

తమిళనాడులో అలా..తెలంగాణలో ఇలా..

(మొదటిపేజీ తరువాయి)

వేలం నుంచి తప్పించాలని కోరారు. వాటిని ప్రయివేటీకరించకుండా సింగరేణికే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ట్వీట్ చేస్తూ.. తమిళనాడులోని గనులను వేలం జాబితా నుంచి కేంద్రం తప్పిస్తున్నట్టు ఓ ఆంగ్ల పత్రిక రాసిన వార్తను పోస్టుకు జత చేశారు. ఈ క్రమంలో ఒకే దేశంలో ఉన్న రాష్ట్రాలకు వేర్వేరు నిబంధనలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. కాగా ప్రభుత్వం లేదా ప్రయివేటు కంపెనీలు ఏవైనా సరే వేలంలో టెండర్లు దాఖలు చేసి బొగ్గు గనులు సొంతం చేసుకోవాల్సిందేనని కేంద్రం మరోసారి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే గనులను స్వచ్ఛందంగా సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న సంగతి విదితమే. కానీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లోని 101 బొగ్గు గనులను వేలం వేయడానికి గత నెల 29న కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ గనులపై ఈ నెల 12న ప్రీ బిడ్ సమావేశం నిర్వహిస్తామనీ, ఆసక్తి గల ప్రభుత్వ లేదా ప్రయివేటు కంపెనీలు హాజరై టెండరు ప్రక్రియ వివరాలు తెలుసుకోవాలని కేంద్ర బొగ్గుశాఖ తాజాగా మరో నోటిఫికేషన్ జారీచేసింది. ఈ క్రమంలో కేంద్రం విధానాలను తప్పుబడుతూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

దేవతలు కాదు...శూర్పణఖల్లా..!

న్యూఢిల్లీ : బీజేపీ నేతలు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా... వారి వాచాలత ఒకే విధంగా వుంటుంది. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్‌ను నిజంగా ప్రేమించాడా? అనే అంశంపై విచారణ జరపాలనీ, అసలు తాజ్‌మహల్‌ని కూల్చేయాలని అసోంకి చెందిన రూపజ్యోతి కుర్మీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. త్రిపుర అసెంబ్లీలో పోర్న్ వీడియో చూస్తూ దొరికిపోవడం వంటివి దేశప్రజలు చూస్తూనే వున్నారు. తాజాగా అమ్మాయిలు ధరించే డ్రెస్సుల వల్ల దేవతల్లా కాకుండా.. శూర్పణఖల్లా కనిపిస్తున్నారని బీజేపీ నేత కైలాశ్ విజయ్ వర్గియా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు దుమారం రేపాయి. కైలాశ్ వ్యాఖ్యలపై ప్రతిపక్షనేతలు మండిపడుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గురువారం హనుమాన్ జయంతి, మహావీర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ పాల్గొని మాట్లాడుతూ.. 'నేను రాత్రిపూట బయటకు వెళ్లినప్పుడు మద్యం మత్తులో ఉన్న యువకులను చూస్తే వారిని ఐదారు చెంపదెబ్బలు కొట్టాలనిపిస్తుంది. ఇక మనం ఆడపిల్లలను దేవతల్లా భావిస్తాం. కానీ వారు వేసుకునే డ్రెస్సుల్ని చూస్తే వారు దేవతల్లా కాదు.. శూర్పణఖల్లా కనిపిస్తారు. మంచి బట్టలు వేసుకోమని మీ పిల్లలకు మీరు నేర్పించండి' అని ఆయన అన్నారు. కైలాశ్ వ్యాఖ్యలకు సోషల్‌మీడియా నెటిజన్లు, ప్రతిపక్షనేతలు నైతికవిలువల్ని దిగజార్చుతున్నారని ఆయనపై మండిపడ్డారు.కాగా, కైలాశ్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత సంగీతా శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు మహిళలను పదేపదే అవమానిస్తున్నారని, ఇది వారి ఆలోచనాతీరుకి, వైఖరికి నిదర్శనంగా నిలుస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కైలాష్ విజయవర్గీయ మహిళలను శూర్పణఖలని అనడం, వారి దుస్తులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కర్నాటకలో 4స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ

- 15న బాగేపల్లి అభ్యర్థి అనిల్ కుమార్ నామినేషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) నాలుగు స్థానాల్లో పోటీ చేయనున్నది. ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థులను ఆ పార్టీ కర్నాటక రాష్ట్ర కమిటీ ప్రకటించింది. బాగేపల్లి నియోజకర్గం నుంచి డాక్టర్ అనిల్ కుమార్, కెజీఎఫ్ నియోజకవర్గం నుంచి పి. తంగరాజు, కెఆర్ పురం నియోజకవర్గం నుంచి నంజేగౌడ, కల్బుర్గి రూరల్ నియోజకవర్గం నుంచి పాండురంగ మావినాకర్ పోటీ చేయనున్నారు. బాగేపల్లిలో అభ్యర్థి అనిల్ కుమార్ ఈనెల 15న నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ జరగనుంది. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొననున్నారు.

మన దేశ సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శనీయం



నవతెలంగాణ - హస్తినాపురం
రంజాన్ కానుకులను పంపిణీ చేసిన కార్పొరేటర్ సుజాతా

నాయక్ కుల, మత, ప్రాంత బేదాలు లేకుండా అందరితో సామరస్యంగా ఉండే సంస్కృతి మన దేశానిదని, భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ లౌకిక ప్రజాతంత్ర దేశం గా మన దేశం ప్రపంచదేశాలకు ఆదర్శనీయమని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు.రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కానుకలను డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తా నగర్ మసీదులో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులతో పాటు బి.ఆర్.ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శశి పాల్గొన్నారు.

ఘనంగా అల్లు అర్జున్ జన్మదినోత్స వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో
హైదరాబాద్ రామంతపూర్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. తమ అభిమాన నటుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పుష్ప- 2 ట్రైలర్ రికార్డులు సష్టిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సినిమా హాలీవుడ్ బాలీవుడ్ రికార్డులను తిరగరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో



సూరం శంకర్, ఆపిల్ శీను, చాంద్ బాషా ,సాయి, దేవేంద్ర చౌదరి, పెద్దబాబు, శ్రీకాంత్ శివ పాల్గొన్నారు

రాచకొండలో ప్రశాంతంగా ఎస్ఐ రాత పరీక్షలు

- పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో
రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ఎస్ఐ రాత పరీక్ష మొదటిరోజు ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ ఇన్స్పెక్టర్ రిక్రూట్మెంట్ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. 8,9 రెండు రోజులపాటు కొనసాగే పరీక్షా కేంద్రాలను శనివారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం రామంతాపూర్‌లోని ప్రిన్సిటన్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల, టికేఆర్ కళాశాలతోపాటు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రా వద్ద తీసుకుంటున్న భద్రతపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచాలని పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మహిళా అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు.



రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 14సెంటర్లలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ప్రతి సెంటర్ వద్ద సీఐ ర్యాంక్ అధికారి నేతృత్వంలో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. అంతేకాకుండా ఏసీపీ, డీసీపీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉందన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్లు తీసుకెళ్లినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం కొనసాగే సబ్-ఇన్స్పెక్టర్ తుది రాత పరీక్షలకు కూడా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సీపీ వెంట డీసీపీలు జానకి, డి.శ్రీనివాస్, ఏసీపీ నరేష్ రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డితోపాటు ట్రాఫిక్ అధికారులు తదితరులున్నారు.

గిరిజన బిడ్డ సివిల్ కోర్టు జడ్జిగా ఎంపిక కావడం పట్ల హర్షం





నవతెలంగాణ-బడంగ్‌పేట్
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నల్లమల్ల ప్రాంతంలోని ఏజెన్సీ ఏరియా ఇప్పలపల్లి తండా నుంచి వంకరావత్ మంగ హరియానాయక్ దంపతుల రెండో కుమారుడు శివ సివిల్ జడ్జిగా ఎంపిక కావటం పట్ల మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని మధురా నగర్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజార సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసి పూల మాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కష్టపడి చదువుకొని వెనుక బడిన గిరిజనులు ఉన్నత శిఖరాలకు చేరుకోవటం వల్లనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో దేవేందర్ సీఐ మధురా నగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు చందర్, శంకర్, రామ చందర్, దశరథ్, భారత్, హన్మంతు, గోపాల్, రామ చందర్, నాను, భాస్కర్, గాను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి చైన్ స్నాచింగ్

24గంటల్లో పట్టుబడ్డ నేరస్తుడు
నిందితుడి వద్ద నుండి 3తులాల బంగారు గొలుసు, ఫోన్,ద్వి చక్ర వాహనం స్వాధీనం



నవతెలంగాణ-హయత్‌నగర్
నేరస్తులు ఎలాంటి నేరాలు చేసిన రాచకొండ పోలీసులు అప్రమత్తంగా ఉన్నామనడానికి అబ్దుల్లా పూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కు పాల్పడిన నేరస్తుడిని పట్టుకున్నామని ఎల్బీ నగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ స్పష్టం చేశారు. శనివారం ఎల్బీనగర్‌లో ఉన్న ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. గోసుకొండ గ్రామం, పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన వరికొప్పుల శివ కృష్ణ.ఈనెల 7న అబ్దుల్లా పూర్ మెట్ మండలంలోని బండరావిర్యాల గ్రామానికి చెందిన ముల్లి బాలమ్మ అనే వృద్ధురాలు సద్దుపల్లి గ్రామం చౌరస్తా నుండి తన ఇంటికి(బండరావిర్యాల)కు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో యూనికాన్ ద్వీ చక్ర టీ ఎస్ 07జీ ఎల్ 1992గల వాహనంపై లిఫ్ట్ ఇస్తానని చెప్పి నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం వద్దకు వెళ్ళాక తన వాహనం ఆగిపోయింది అని వృద్ధురాలి కి చెప్పి ఆమె మెడలో ఉన్న 3తులాల బంగారు గోలుసును అపహరించుకుని పారిపోయాడు.వెంటనే తేరుకున్న ఆమె 100కు ఫోన్ చేయగా అబ్దుల్లా పూర్ మెట్ పోలీసులు స్పందించి గువ్వలేటి గ్రామము వద్ద వాహనాల తనిఖీ లో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 3తులాల బంగారు గొలుసు, ఫోన్,ద్వీ చక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.ఆమె వెంట వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి,అబ్దుల్లా పూర్ మెట్ ఇన్స్పెక్టర్ స్వామి,క్రైమ్ ఎస్ఐ విక్రమ్ రెడ్డి, శ్రీధర్, రాజు వున్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-నాగోల్
ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్లోని వెంకటరమణ కాలనీకి చెందిన జరీనా అనే మహిళ కడుపు నొప్పి సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సరైన వైద్యం పొందలేక వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సహాయం కోసం సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జరీనా ఆపరేషన్ కోసం ఖర్చు చేసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించడం జరిగింది. ఈ నేపథ్యంలో జరీనా పేరిట రెండు లక్షల 50 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరయ్యాయి. అట్టి ఎల్‌ఓసి చెక్కును శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాధిత తల్లి బిపాసకు రెండు లక్షల 50వేల ఎల్‌ఓసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం లాంటిదని, పేద ప్రజలకు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలను పొందేందుకు అండగా ఉంటుందని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, శ్రీనివాసయాదవ్, జాంగీర్ బాబుగౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా బండ్లగూడెం క్రాంతిగౌడ్

ఘట్కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కేశపావుల వినోద్ కుమార్



నవతెలంగాణ-ఘట్కేసర్
మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా బండ్లగూడెం క్రాంతి గౌడ్, ఘట్కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కేశపావుల వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి నియామక ఉత్తర్వు జారీ చేసి క్రాంతి గౌడ్, వినోద్ కుమార్ లకు అందజేశారు. ఘట్కేసర్ మండలం చౌదరిగూడ గ్రామానికి చెందిన వీరు ప్రజా సమస్యలపై పోరాటం, యూత్ కాంగ్రెస్ పటిష్టతకు చేసిన కృషిని గుర్తించి పదవిని అప్పగించినట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి తెలిపారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా శివసేనరెడ్డి అన్నారు. క్రాంతిగౌడ్, వినోద్‌కుమార్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన పదవిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తామన్నారు. తమకు పదవి ఇచ్చిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, సహకరించిన నేషనల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బివి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సురభి ద్వివేది, కార్యదర్శి రమేష్ బాబు, కార్యదర్శి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, యూత్ జోడో, బూత్ జోడో మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి పొన్నం తరుణ్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లు తోటకూర వజ్రేష్ యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోడుప్పల్‌లోని మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వజ్రేష్ యాదవ్‌ను క్రాంతిగౌడ్, వినోద్ కుమార్‌లు ఉమ్మడి మండల నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. వజ్రేష్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ పాలడుగు అమరేందర్ రెడ్డి, బోడుప్పల్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, ఎంపీటీసీ పులి కంటి భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు ఆర్.భోజిరెడ్డి, మంచాల సుధాకర్, ఘట్కేసర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లె బాబురావుగౌడ్, చౌదరిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులు గౌడ్, నాయకులు బండ్లగూడ అనిల్ గౌడ్, పసులాది నర్సింగ్ ముదిరాజ్, పులికంటి రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎనుతుల నాగేష్, సున్నాల భాస్కర్, జ్ఞానేశ్వర్, సాయి, వంశీ, ప్రవీణ్, శివగౌడ్, సాయి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలకే తిరిగి పట్టాలు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 2009 సంవత్సరానికి ముందు వైఎస్ఆర్ ముఖ్య మంత్రిగా ఉన్నపుడు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేద ప్రజలకు ఇచ్చిన స్థలాలకు తిరిగి ఇప్పుడు 58,59 జీవో ప్రకారం పట్టాలు ఇస్తున్నామని, ఇది సీఎం కేసీఆర్ ప్రభుత్వం చలవే అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి చెప్పటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్ ఇతర గ్రామాల్లో పేద, మధ్యతరగతి ఇండ్లు లేని కుటుంబాల్ని గుర్తించి వేల మంది పేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని తెలిపారు. దాదాపు అల్మాస్ గూడ గ్రామంలోనే 690 మంది లబ్దిదారులకు 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాలని 2008 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడే పేద ప్రజలకు కేటాయించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. 58,59 జీవోల ముసుగులో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో కొంత మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసుకొని, దర్జాగా కబ్జా చేసిన స్థలాల్ని రెగ్యూలరైజ్ చేసుకోవటానికి ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. ఇప్పటికే అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని, అందుకుగాను ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకురావటానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తంచేశారు.

అభివృద్ధికి ఆదర్శ డివిజన్‌గా చిల్కానగర్

కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్
గ్రేటర్ హైదరాబాదులోని చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి ఆదర్శ డివిజన్‌గా నిలుస్తుందని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. శనివారం డివిజన్లోని బాలేందర్ షాపు నుండి పాల సత్తి వీధి నుండి బొడ్రాయి వెనక వీధి వరకు 60 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యవేక్షించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపొందిన వెంటనే చిల్కానగర్ డివిజన్ కి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి చిల్కానగర్ డివిజన్ అభివృద్ధి చేయడం జరుగుతుంది, దీనికి పెద్ద ఎత్తున సహకరిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి మేయర్ గద్వాల విజయలక్ష్మి గకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
అదేవిధంగా... సీసీ రోడ్డు పనులలో నాణ్యత పాటించాలని, ఎక్కడ కూడా పనులలో జాప్యం జరగకుండా, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, సీసీ రోడ్డు పనులు పూర్తి అయ్యేవరకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం ప్రజలకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాజ్ కుమార్, రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకుండ జగన్, మైనారిటీ అధ్యక్షులు అబ్బా భాయ్, సీనియర్ నాయకులు మహమూద్, బాలేందర్, ఫోటో బాలు, శైనాజ్, బిజెపి నాయకులు విట్టల్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఇబ్రహీం, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ మొదలగు వారు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సామాజిక కార్యకర్త పదమ్ చంద్ బఫ్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వరూప్ సేవ సంస్థాన్ వ్యవస్థాపకులు, సామాజిక కార్యకర్త పదమ్ చంద్ బఫ్నా శనివారం తెలిపారు. స్వరూప్ సేవ సంస్థాన్ నేతృత్వంలో కోఠీలోని గాంధీ జ్ఞాన మందిర్ యోగా కేంద్రం, శ్రీ అజిత్ పార్శ్వ యువ అండ్ జూనియర్ సంఘటన్ సంయుక్తంగా మెగా వైద్య శిబిరాన్ని ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కోఠీలోని గాంధీ జ్ఞాన మందిర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంప్‌లో మహావీర్ ఆస్పత్రి అండ్ రిసెర్చ్ సెంటర్, సాధురామ్ ఐ ఆస్పత్రి(లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్) డాక్టర్లు పాల్గొంటారని పదమ్ చంద్ బఫ్నా తెలిపారు. ఇందులో ఐ, డెంటల్ చెకప్‌తోపాటు ఫిజియోథెరఫీ, పీడియాట్రిసియన్, జనరల్ ఫిజీషియన్, గైనాకాలజిస్ట్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ పరీక్షలు చేస్తారన్నారు. అంతేకాకుండా ఇసీజీ, 2డీ ఎకో, బీఎండీ, ఆర్‌బీఎస్, బీపీ చెకప్ చేస్తారన్నారు. తన తల్లి రెండవ వార్షికోత్సవం నేపథ్యంలో ఈ మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశిష్ జైన్‌తోపాటు ఆ సంస్థ కన్వీనర్లు షిల్‌కుమార్ జైన్, రితేష్ ముత్త, నిషాంత్ సమ్దారియా, ప్రణయ్ తేటెడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా రాత్రిపూట పనిచేస్తున్న వాసవి బిల్డర్స్

నిర్మాణం పనులు వెంటనే నిలిపి వేయాలి

నవతెలంగాణ -ఎల్బీనగర్
సరూర్‌నగర్ ఎల్బీనగర్‌లోని వాసవి బిల్డర్స్ రాత్రి వేళ పనులు చేస్తున్నారని, వెంటనే నిర్మాణం పనులు నిలిపి వేయాలని వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కృష్ణానగర్, భగత్‌సింగ్ నగర్, శంకర్‌నగర్, డాక్టర్స్ కాలనీ, ఇంద్రనగర్, తదితర ఏరియాలలో బ్లాస్టింగ్ కావడం వల్ల ఇంట్లో ఉన్న జనాలు బయటికి వచ్చి, భయభ్రాంతులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి బ్లాస్టింగ్ కావడంతో అక్కడ ఇండ్లు పునాదులతోపాటు కిటికీల అద్దాలు, దర్వాజాలు, గోడలకు పగుళ్లు రావడం జరిగిందని తెలిపారు. వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో సిరీస్ కెమికల్ ఫ్యాక్టరీ ప్రభుత్వం దగ్గర లీజు తీసుకొని, అనంతరం వాసవి బిల్డర్స్ పెద్ద పెద్ద మిషిన్లతో మూడు నెలలుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అలా చేయడంవల్ల చుట్టుపక్కల ప్రాంతాల వారికి శబ్ద కాలుష్యం, దుమ్ము ధూళి, రాత్రులు సైతం నిద్ర లేకుండా అరచేతిలో ప్రాణాలను బిగపట్టుకొని ఉన్నారని అన్నారు. రాత్రిపూట పర్మిషన్ లేకుండా పనిచేయడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. వాసవి బిల్డర్స్ యాజమాన్యం సరైన సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణం చేయడం వల్ల అక్కడ ఉన్న బిల్డింగులకు ప్రమాదం ఉందని, కాంట్రాక్టరుకు ఏ విధంగా పర్మిషన్ ఇచ్చారో అధికారులు వెంటనే అనుమతులను బహిర్గతం చేసి, వెంటనే నిజాలు బయటపెట్టాలని పాండురంగచారి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకొనని ఎడల, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు చుట్టుపక్కలున్న బస్తీ వాసులకు భద్రత కల్పించాలి అన్నారు.

మురుగు పరుగేనా?

ప్రజా సమస్యలు పాలకులకు పట్టవా?
మీ ఇంటి దగ్గర అయితే అధికారులు ఇలాగే ఊరుకుంటారా?

నవతెలంగాణ-ఉప్పల్
రామంతపూర్ డివిజన్లోని మోడల్ ఫంక్షన్ హాల్ వద్ద గత 15 రోజులుగా మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతున్న పాలకులు పట్టించుకోరు అధికారులు స్పందించడం లేదంటూ పాలకుల, అధికారుల తీరు నిరసనగా కాలనీవాసులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రహదారిపై కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు శ్రీనివాస్, కాలనీవాసులు రమేష్ లలిత వారు మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడు హడావిడి చేసే నయకులు తప్ప సమస్యలతో సతమతమవుతుంటే పట్టించుకునే నాయకులు లేరా అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫంక్షన్ హాల్ వల్ల వచ్చే ఆదాయం జీహెచ్ఎంసీ తీసుకోగా వ్యర్థాలను మాత్రం రోడ్లపైకి వదిలి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బులు మీకు రోగాలు మాకా? అంటూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూరుగు రమేష్, లలిత, సుశీల, అల్లు, జ్యోతి, మరియు స్థానికులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మల్కాజిగిరి
ఆదివారం 09 ఏప్రిల్ 2023

108 సిబ్బందికి విజయ్‌రెడ్డి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



ఆరు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్న కీసర మండల 108 సిబ్బందికి ఆర్థిక సహాయం చేసి తన మానవత్వం చాటుకున్నారు రామిడి విజయ్ రెడ్డి. కీసరకు చెందిన 108 ఈఎంటీ రవి సిబ్బంది రాష్ట్ర సర్కార్ నుంచి జీతాలు రావడం లేదని తమ ఆవేదన అర్థం చేసుకుని సహాయం చేయండని రామిడి విజయ్ రెడ్డిని కోరారు. స్పందించిన ఆయన వారికి చిన్న సహాయంగా రూ.5వేలు అందించి మీ సమస్యకు పరిష్కారంకై కాంగ్రెస్ నాయకత్వంలో పోరాటం చేస్తామని హామీనిచ్చారు.

రొట్టెల ధరణ్‌కుమార్‌కు దళిత రత్న అవార్డు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



బీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ రొట్టెల ధరణ్‌కుమార్‌కు దళిత రత్న అవార్డు లభించింది. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేతుల మీదుగా ఈ అవార్డును ధరణ్‌కుమార్ అందుకున్నారు. ఇటీవల జరిగిన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఈ అవార్డును ఎమ్మెల్యే ధరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరిన్ని అవార్డులు ధరణ్‌కుమార్‌కు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్, కుమార్, బాలస్వామి, సురేష్, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్, శేఖర్, కృష్ణ, పిట్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మంద భాస్కర్, మాలమహానాడు సూర్యప్రతాప్, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ సమక్షంలో ఇండ్ల పట్టాలు

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్



ప్రపంచం అబ్బురపడేలా తెలంగాణలో వినూత్న పథకాలు అమలవుతున్నాయనీ, మన పథకాలు దేశంలోని అనేక రాష్ట్రాలు కీర్తిస్తూ తమ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు పథక రచన చేస్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్‌లోని తహశీల్దార్ మీటింగ్ కార్యాలయంలో తహశీల్దార్ అనిత ఆధ్వర్యంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ కమిషనర్ రామలింగం సమక్షంలో మంత్రి మల్లారెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మండుటెండల్లో సైతం మత్తడి దుంకుతున్న జలాలను చూస్తుంటే చూస్తుంటే ప్రతి ఒక్కరూ సంతోష పడుతున్నారన్నారు. రాష్ట్రం వ్యవసాయ రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలబడి అన్నపూర్ణగా మారిందంటే ఈ ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. జవహర్ నగర్ తన గుండెకాయలాంటిదనీ, ఇప్పటికే రూ.200కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు. గతంలో జవహర్ నగర్ అభివృద్ధికి దూరంగా ఉండేదనీ, పూర్తిగా పేద ప్రజలే నివసించే కార్పొరేషన్ లో కనీ వినీ ఎరగనీ రీతిలో అభివృద్ధి చేస్తూ మోడల్ టౌన్ గా తీర్చిదిద్దుతున్నాం అన్నారు. అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తూ సీఎం కేసీఆర్ జనరంజక పాలన సాగిస్తూ దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తున్నారన్నారు.

త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు పంపిణీ..

మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఏండ్లగా ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద ప్రజలకు జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులకు పట్టాలు అందజేస్తామన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు అత్యధిక పట్టాలు వచ్చాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆధారం లేకుండా భయంభయంగా బతికేవారని, పట్టాలు అందజేస్తే పూర్తి స్వాతంత్రం లభించినట్టు అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

కార్పొరేషన్‌లో మరో నాలుగు బస్తీ దవాఖానాలు..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మరో నాలుగు బస్తీ దవాఖానాలను మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఒక పల్లె, బస్తీ దవాఖానాలు ప్రారంభయ్యాయనీ, అరుంధతినగర్ లో నివసించే పేద ప్రజలకు బస్తీ దవాఖానా వరం లాంటిద న్నారు. అనంతరం బస్తీ దవాఖానను జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ప్రతి పల్లెకూ, పట్టణానికి వైద్యం దగ్గర చేసిన ఘనత సీఎం కేసీఆరే దక్కుతుందన్నారు. పేద ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నమన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ నూతన కార్యాలయంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మెడికల్ ఆఫీసర్ పద్మజ, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోడీ



నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముస్తాల కృపా సాగర్ విమర్శించారు. శనివారం మండల కమిటీ సమావేశం గుంటి లక్ష్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావే శంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు వివిధ సంద ర్భాల్లో ప్రధాని నరేంద్రమోడీ చేసిన వాగ్దానాలు, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దక్కాల్సిన హక్కులు, వాటాలను కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తూ, నిర్లక్ష్యం చేస్తూ, వివక్షను ప్రదర్శిస్తూ తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. సింగరేణి లాంటి సంస్థలను పూర్తిగా ప్రయివేటీకరించడా నికి పూనుకుంటున్నదన్నారు. తాజాగా సింగరేణిలో మరోసారి బొగ్గుగనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకు న్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర పన్ను తున్నదన్నారు. బయ్యారం ఉక్కు, గిరిజన, హార్టికల్చర్ యూనివర్సిటీలు, ఎన్‌టీపీసీ విద్యుత్ కేంద్రం, ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఊసే ఎత్తడం లేదన్నారు. యూపీఏ హయాంలో మంజూరైన ఐటీఐఆర్‌ను రద్దు చేసినట్టు తెలిపారు. కృష్ణా నదీజలాల పంపిణీ పంచాయతీపై రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి రెండు నదులను తన పరిధిలోకి లాక్కుందన్నారు. గిరిజన, వెనకబడిన ప్రాంతా ల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ నేపథ్య ంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి తెలంగాణ కు వస్తే గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసి రావాలన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు గుంటి లక్ష్మన్, నర్సింగ్ రావ్, పార్టీ నాయకులు కామ్రేడ్ నారాయణ రెడ్డి, విజయ్ కుమార్, మురళి మోహన్, నర్సింగ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ-మల్కాజిగిరి



రాష్ట్ర ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారనీ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ విమర్శించారు. శనివారం నియోజకవర్గంలోని 140వ డివిజన్‌లోని కేశవ్‌నగర్, భగత్ సింగ్ నగర్ లో శనివారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గడప గడపకూ వెళ్తూ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వాజ్‌పేయి నగర్ రైల్వే ట్రాక్ వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కేంద్ర నుంచి 50శాతం నిధులు మంజూరైనా రాష్ట్ర ప్రభుత్వం వాటా 50శాతం నిధులు ఇవ్వాల్సి ఉందన్నారు. నిధులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎమ్మెల్యే రెండు వేల కోట్లతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశామని చెప్తున్నారనీ, ఎక్కడ ఆ నిధులు మంజూరు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దోమల నివారణకు చర్యలేవన్నారు. బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచారన్నారు. బ్యారెల్ రేటు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడం లేదన్నారు. డీజిల్ వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, 14వ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, బీసీ సెల్ చైర్మన్ వినోద్ యాదవ్, మైనార్టీ సెల్ చైర్మన్ ఎండి అలీ, ఎస్సీ సెల్ చైర్మన్ సానాది శంకర్, ఉమేష్ సింగ్, బి కే శ్రీనివాస్, వంశీ ముదిరాజ్, కే రాములు, నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

లతకు ఆలిండియా ఘట్టమనేని చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

ఆలిండియా ఘట్టమనేని చారిటబుల్ ట్రస్ట్, కృష్ణ మహేష్ బాబు అభిమానుల గ్రూప్స్ ప్రమాదంలో గాయపడిన మల్కాజిగిరి ఆర్కేపురం అంతయ్య కాలనీ గాజుల లతకి అసోసియేషన్ గ్రూప్ తరపున రూ.16, 116 ఆర్థిక సహాయం కమలానగర్ కామ్రేడ్: ఎస్. వి. భాస్కరరావు భవనం, సీఐటీయూ ఆఫీసులో అందించిన ట్టు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బంగారు నర్సింగరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండి యా కృష్ణ మహేష్ ప్రజాసేన జాతీయ అధ్యక్షులు ఖాదర్ గోరి విచ్చేసి తన చేతుల మీదుగా ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆల్ ఇండియా ఘట్టమనేని కృష్ణ అండ్ మహేష్ బాబు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆపదలో ఉన్నవారికి, అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు, ఆర్థికంగా వెనుకబడిన వారి కుటు ంబానికి కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినెలా తోచిన ఆర్థిక సాయం అందిస్తుందనీ, అందులో భాగంగా నే మార్చి నెల 56వ సేవా కార్యక్రమంలో భాగంగా గాజుల లత కుటుంబానికి ట్రస్ట్ సభ్యుల అందరి సహకా రంతో ఆర్థిక సాయం అందించారు. నాచారం విలేజీలో ఉంటున్న ఒంటరి మహిళ, అనాధకు రూ.2వేలు అందిం చారు. కృష్ణ మహేష్ బాబు ను స్ఫూర్తిగా తీసుకుని నిరంత రం పలు ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తతంగా నిర్వహించడం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మహేష్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాలాజీ శర్మ, మహిళా సంఘం నాయకురాలు సఫియా, సుల్తానా, సోమనపల్లి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణకు మంత్రి తలసాని పరామర్శ

నవతెలంగాణ-కంటోన్మెంట్



మొండా మార్కెట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృ ష్ణను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం పరామర్శించా రు. హరికృష్ణ అనారోగ్యానికి గురై యశోద హాస్పిటల్‌లో చికిత్స పొం దుతున్న విషయం తెలుసుకున్న మంత్రి శనివారం హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు.

బొల్లారం ఈద్గా వద్ద బోర్‌వెల్ ఏర్పాటు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బొల్లారం, రిసాల బజార్ ప్రాంత మైనార్టీ సోదరులకు తుర్కపల్లి బొల్లారం ఈద్గా వద్ద నీటి సౌకర్యం లేదని తెలుసుకుని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు శనివారం కొత్త బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశారు. నూతన బోర్ వెల్‌కు స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, శాంతి శ్రీనివాసరెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, ఎస్సై పరుశురాం, ఇసాక్ ఖాన్, అక్రమ్ పాష, షేక్ గౌస్, బొబ్బిలి సురేందర్ రెడ్డి, మల్లికార్జున్, దేవేందర్, నాగేశ్వరరావు, బలవంత రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా ప్రవీణ్



నవతెలంగాణ-కాప్రా

జ్యోతిరావు పూలే 179 జయంతి ఉత్సవాల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్‌గా మీర్పేట డివిజన్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కరిపే ప్రవీణ్ వంజరిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

ఎలక్ట్రికల్ వాటర్ కూలర్ చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కాప్రా



ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సౌజన్య ంతో ఎలక్ట్రికల్ వాటర్ కూలర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి సద్గురువు డాక్టర్. ఉమర్ అలీషా సద్గురు, డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డితో కలిసి శనివారం కాప్రా సర్కిల్, శ్రీనివాస్ నగర్ కాలనీ, వర్టిక్స్ కాంప్లెక్స్ వద్ద ఎలక్ట్రికల్ వాటర్ కూలర్ చలివేంద్రంను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ చేస్తున్న సేవలను కొనియాడారు. వేసవిలో ప్రజల దాహన్ని తీర్చే చలివేంద్రాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమ ంలో శ్రీనివాస్‌నగర్ కాలనీ అధ్యక్షుడు జి.సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎమ్.మోహన్, ఎమ్.సాంబయ్య పి.ఉపేం ద్రచారి, ప్రధాన కార్యదర్శి వివిన్వి సత్యనారాయణ (నాగు), సలహాదారులు డి.దశరథ, ఎమ్ఎన్ చారి, ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కార్యకర్తలు నాగవర్ధన్, భవాని, హైదరాబాదు డిస్టిక్ డీఆర్ఓ సూర్యలత, విజయ, సువర్చల, రాజ్యలక్ష్మి మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కీసర మండల నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



తెలంగాణపై వివక్ష చూపుతున్న మోడీ పర్యటనను అడ్డుకోవాలని కాంగ్రెస్ పిలుపునివ్వడంతో కీసర మండల్ కాంగ్రెస్ నాయకులు జూపల్లి రవీందర్, కందాడి శివరాం రెడ్డి, మధు సుదన్ రెడ్డి, గండిపల్లి అశోక్, సమీ, సోమిరెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి కీసర పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన 'బొంతు'

నవతెలంగాణ-కాప్రా



చక్రిపురం నుంచి ఏఎస్‌రావు నగర్ వరకు జరిగే రన్ ఫర్ జీసస్ వినూత్న సువార్త ర్యాలీని జెండా ఊపి ప్రారంభిం చిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. ఈ కార్యక్రమంలో నాగిళ్ల బాల్ రెడ్డి, ప్రభు గౌడ్, హన్మంతు నాయక్, శ్రీకాంత్ యాదవ్, రాజు గౌడ్, లక్ష్మారెడ్డి, రాఘవ రెడ్డి, మహిపాల్ రెడ్డి, దశరథ్ నాయక్, రెడ్యా నాయక్, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్ కార్యక్రమం

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో పీపీడబ్ల్యూఏ, ఎన్‌పీఏ పాస్టర్స్ ప్రేయర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, కొయ్యడ జయపాల్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌కు చెందిన చింత రామకృష్ణ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం తో వారి కుటుంబ సభ్యులకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆపద వస్తే తమ ట్రస్టు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంకిర్యాల నరసింహ, వెంకటేష్, కష్ణ, సాగర్, సాయి, కాలనీసభ్యులు పాల్గొన్నారు.

ఎల్బీ స్టేడియంలో అర్మాన్ పాటల జోష్

నవతెలంగాణ-సిటీబ్యూరో



స్ట్రీట్ కాజ్ హైదరాబాద్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం వేదికగా శనివారం రాత్రి ఆర్ఎఫ్‌సీ 9.0 పేరుతో జరిగిన బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ లైవ్ ఇన్ కాన్సర్ట్ వీక్షకులను ఉర్రుతలూగించింది. ఈ కాన్సర్ట్ రెండు గంటల ముందే వీక్షకులతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అర్మాన్ తన ప్రసిద్ధ పాటలైన బుట్టా బొమ్మ, కోపంగా, పెహ్లీ ప్యార్ పాటలతో కాన్సర్ట్‌ను ప్రారంభిస్తూ తన పాటలతో వీక్షకులను ఓలలాడించారు. అర్మాన్ పాటకు కక్రకారు స్వరం కలుపుతూ, డాన్స్‌లతో సరగదా ఎంజాయ్ చేశారు. ఆయన స్వర రాగ సంగీత పాటలతో యువత మదిని దోచారు, అర్మాన్ తన హిట్‌లైన బుట్టా బొమ్మా, మై హూన్ హీరో తేరా, హలో, సూరజ్ డూబా హై, ఏమైందో, పడి పడి లేచే, రెండు కళ్ళు, నిన్నిలా నిన్నిలా, విన్నవే విన్నవే, లబోన్ పే నామ్, జాన్ హై మేరీ రొమాంటిక్ వంటి పాటలతో అలరిస్తూ అందరినీ ఉత్సాహ పరుస్తూ జోష్ నింపారు. తన మ్యాజికల్ వాయిస్‌తో వీక్షక హృదయాలను దోచుకున్నాడు. ఇక నటి సమంత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రిలీజ్ కానున్న శాకుంతలం సినీ యూనిట్ గుణ శేఖర్, మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ వేదిక పై మాట్లాడారు. బ్యాండ్ క్యాప్రిషియో లైవ్ మ్యూజిక్ అలరించింది. స్ట్రీట్ కాజ్ ఇండియా సీఈఓ జి.రమ్య, సీఎఫ్ఓ ప్రవల్లిక, ప్రెసిడెంట్ శృతి మాట్లాడుతూ 2009లో ప్రారంభించినప్పటి నుంచి ఏడాది కాలంలోనే సంస్థ 15వేల ప్రాజెక్టులు పూర్తి చేసిందన్నారు. దాదాపు రూ.30 కోట్లు ఖర్చు చేసి, 3 లక్షల మందిని, 2730 జంతువులను ప్రభావితం చేశామని తెలిపారు. 8వలే వర్క్‌ఫోర్స్‌తో 10వేల పూర్వ విద్యార్థులతో హైదరాబాద్ అంతటా 550 కంటే ఎక్కువ కళాశాలల్లో దాని విభాగాలను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు కొచ్చి, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం, పూణే తమ సేవలను విస్తరించామని మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ కాజ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ శృతి తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గోధుమకుంట గ్రామానికి చెందిన పొట్ట జంగయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.20 వేల చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ సోమని ఆంజనేయులు, మేడ్చల్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు చీర సురేష్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-కాప్రా

రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఏఎస్ రావునగర్ అణుపురంలోని జామై మజీద్ ఈ మహమ్మదీయ మసీదులో శనివారం ఏఎస్ రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, మసీదు కమిటీ అధ్యక్షుడు రియాజ్ మహమ్మద్ ఖాన్, ఎండి ఎక్బాల్, ఎండి సాధిక్, సయ్యద్ ఖదీర్, ఎండి సలీం ఖాన్, నబిల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీ నూతన కార్యవర్గానికి అభినందనలు

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ రైల్ విహార్ కాలనీ నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అధ్యక్షులుగా బొడిగె ప్రభాకర్ గౌడ్ వారి కార్యవర్గాన్ని అభినందించిన నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. ఈ కార్యక్రమంలో నాయకులు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, ఇన్చార్జి నాగిళ్ల బాల్ రెడ్డి, కనకరాజు గౌడ్, బొడిగె ప్రభు గౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, రాజు గౌడ్, సంపత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల వ్యాపార విధానం మంచి పరిణామం

నవతెలంగాణ-సిటీబ్యూరో



వాణిజ్య వ్యాపారాలు, దుకాణాలు, అవుట్‌లెట్‌లను 24 గంటలు, వారంలో ఏడు రోజులూ అదనంగా చెల్లించి తెరిచి ఉంచుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీవోను విడుదల చేశారు. ఈ ప్రభుత్వ నిర్ణయంతో స్వతంత్ర కేంద్రం కొన్నాళ్లుగా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. స్థానిక ప్రభుత్వాలకు తగిన వనరులు, సామర్థ్యాన్ని పెంపొందించడం, జవా బుదారీ చర్యలను పటిష్టం చేయడం, దీర్ఘకాలం పాటు విక్రయదారులను అధికారికీకరించే ఖర్చును తగ్గించడం వంటి ఈ సవాళ్లను పరిష్కరించడానికి చురుకైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభు త్వాన్ని కోరుతున్నారు. ఈ సందర్భంగా స్వతంత్రత సెంటర్ వ్యవస్థాపకుడు, ప్రెసిడెంట్ వెంకటేష్ గెరిటి మాట్లాడుతూ 24/7 వ్యాపారాలను ప్రారంభి ంచాలనే రాష్ట్ర నిర్ణయం చారిత్రాత్మకమైనదన్నారు. ఇది మెరుగైన జీవనోపా ధికి, సరసమైన ధరల్లో ఉత్పత్తులు, సేవల నాణ్యతను మెరుగుపరిచే దిశగా కొత్త దిశను సూచిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయనీ, వ్యాపారాన్ని సులభతరం చేస్తుందని తాము భావిస్తున్నామని తెలిపారు. ఈ సంస్థల వృద్ధికి తోడ్పడే మెరుగైన విధానాలు, అభ్యాసాల కోసం వారు చురుకుగా నిమగ్నమై ఉన్నారని స్వతంత్ర సెంటర్ సహ వ్యవస్థాపకుడు రాఘవేంద్ర అస్కాని చెప్పారు. "తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం సరైన దిశలో ఒక అడుగు అని మేం నమ్ముతున్నాం. ఈ చర్యను మేం అభినందిస్తు న్నాం, స్వాగతిస్తున్నాం' అన్నారు. మార్కెట్‌కు అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఇంకా అనేక సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు గుర్తించారని ఆయన తెలిపారు. ప్రభుత్వం, పౌర సమాజ సంస్థలు, ఇతర వాటాదారులతో కలిసి పని చేయడం ద్వారా, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే వాతావరణాన్ని తాము సృష్టించగలం అన్నారు. తెలంగాణ మొత్తం ఆర్థిక వృద్ధి, అభివృద్ధికి దోహదపడగలమని తెలిపారు.

సీపీఐ(ఎం), సీపీఐ ఉమ్మడి రాష్ట్ర స్థాయి సమావేశాలకు భారీ ఏర్పాట్లు

నవతెలంగాణ-ధూల్‌పేట్



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నేడు జరుగనున్న సీపీఐ, సీపీఐ(ఎం) ఉమ్మడి రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు చేస్తున్న ఏర్పాట్లను సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎండీ.అబ్బాస్, ఛాయాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్ష పార్టీలు చూపే ప్రత్యామ్నాయ విధానాలు మాత్రమే దేశానికి రక్షణ కల్పిస్తాయన్నారు. నేడు జరిగే సమావేశాలు రాష్ట్ర రాజకీయాలకు మూలమలుపుగా నిలువనున్నాయన్నారు. ఈ సమావేశంలో ఇరు పార్టీల మండల, జిల్లా కమిటీల నాయకులు, కార్యవర్గ సభ్యులు 6000 మంది పాల్గొంటారన్నారు.

కోలాహలంగా మెగా జాబ్ మేళా.. నియామక పత్రాలు అందజేత

నవతెలంగాణ-ఓయూ



డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ జన్మ దినాన్ని పురస్కరించుకుని సీతాఫల్‌మండిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో సికింద్రాబాద్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 16 వందల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. సెట్విన్‌తో పాటు వివిధ సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 24 ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు పాల్గొన్నాయి. ఉద్యోగాలకు ఎంపికైన వారికి సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్, సీతాఫలమండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల కిరణ్ కుమార్, సెట్విన్ సితాఫలమండి సెంటర్ ఇన్‌చార్జి నవీన్, నేత కరాటే రాజు, శ్రీకాంత్ శనివారం నియామక పత్రాలను అందజేశారు.

మోడీ దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-ఓయూ





ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేట్ వద్ద ప్రధాన మంత్రి మోడీ దిష్టి బొమ్మను బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ అభివృద్ధి చాతకాని మోడీకి ఆర్భాటాలు ఎందుకు అనీ, మోడీ ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రంలో పర్యటిస్తారని ప్రశ్నించారు. రామగుండంలో సింగరేణి బొగ్గు గనులను కూడా అదానీకి అమ్మేస్తే, రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదనీ, దేశంలోని యువతకు, విద్యార్థులకు ఇస్తానన్న ఉద్యోగాలు ఏవి అని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఏ విధంగా సహకరించడం లేదన్నారు. రాష్ట్ర విభజన చట్ట హామీలను కేంద్రం ఇప్పటికీ నెరవేర్చడం లేదనానరు. ఒక్క వందేమాతరం రైలును నాలుగైదు సార్లు ప్రారంభిస్తారా? అని ప్రశ్నించారు. వందేమాతరం రైలు పేరుతో రాష్ట్రంలో చిచ్చులు రేపడనికి వస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రధాని రాష్ట్ర అభివృద్ధి నిరోధకుడు అన్నారు. తెలంగాణలో అభివృద్ధి పేరుతో విద్వేషాలు సృష్టించి రాజకీయ పబ్బం గడపడం కోసమే ఈ పర్యటన తప్ప వేరే ఏమీ లేదన్నారు. తెలంగాణలోని విద్యార్థులందరూ ప్రదాని పర్యటనను ఆడుడుగునా అడ్డుకుంటారని చెప్పారు. తెలంగాణలోని కేంద్ర ప్రభుత్వం సంస్థలను ఎందుకు పునరుద్ధరణ చేయడం లేదో రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలోని ఖాళీ ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కోతి విజయ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పెద్దమ్మ రమేష్, శిగ వెంకటేష్, వేరువాండ్ల కృష్ణ, మేకల రవి, బొల్లు నాగరాజు యాదవ్, జంగయ్య, కొమ్మనబోయిన సైదులు యాదవ్, కాటం శివకుమార్, నాగారం ప్రశాంత్, ముట్ట పోతుల రమేష్ గౌడ్, శ్రీను నాయక్, అనమల రేణు, వెలుపుకొండ రామకృష్ణ, మిద్దె సురేష్, సంపత్, బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఓయూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఓయూలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓయూ కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ తెలంగాణ రాష్ట్రాన్నికీ ఇచ్చిన హామీల పైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీలను, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, నవోదయ విద్యాయాలను స్థాపించకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రామటంకి శ్రీను మాట్లాడుతూ మోడీ తెలంగాణకు మూడుసార్లు వచ్చారు కానీ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. జాతీయస్థాయి ఫెలోషిపులు ఆర్‌జిఎన్ఎఫ్, ఐసీఎస్ ఎస్ఆర్, సీఎస్ఐ, ఆర్,ఆర్ జె ఎన్ ఎఫ్ ఇవ్వకుండా పరిశోధక విద్యార్థులకు పరిశోధన చేయకుండా కుట్రపన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సాయికిరణ్, పవన్ కళ్యాణ్, సహాయక కారదర్శి రాజు, కృష్ణ, నాయకులు సందీప్ అనిల్ విజయ్ దిలీప్ శ్రీకాంత్ మంజునాథ్ పాల్గొన్నారు.

మోడీకి తెలంగాణలో పర్యటించే హక్కు లేదు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్

నవతెలంగాణ-ముషీరాబాద్



దేశవ్యాప్తంగా విద్యార్థి యువజనలను మోసం చేసిన ప్రధాని మోడీకి తెలంగాణలో పర్యటించే హక్కు లేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. శనివారం మోడీ హైదరాబాద్ పర్యటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో సుందరయ్య పార్క్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, కోట రమేష్ మాట్లాడుతూ స్వాతంత్రం సాధించిన తర్వాత ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగ రేటు పెరిగిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రానికి దక్కాల్సిన విభజన హామీలను తుంగలోకి తొక్కి తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎనిమిదేండ్ల కాలంలో ఒక్క ఉన్నత విద్యా సంస్థ కూడా తెలంగాణకు కేటాయించలేదన్నారు. గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీలు, నవోదయ విద్యాలయాలు, నర్సింగ్ కళాశాలల్లో కేటాయింపులు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. ప్రధానమంత్రి హోదాలో పర్యటన చేయకుండా టూరిస్ట్ లాగా తెలంగాణకు వచ్చి పోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని ధ్వంసం చేయడం చరిత్ర పాఠాల నుండి విప్లవకారులు జాతి ఉద్యమ వీరుల చరిత్రను మార్పు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అస్మి బాబు, మాజీ నాయకులు కొమ్ము విజయ్, పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరేందర్, శ్రీమాన్, స్టాలిన్, పవన్ పాల్గొన్నారు.

గిరిజన పార్లమెంట్ స్థానాల్లో ఎన్నికలను బహిష్కరిస్తాం



నవతెలంగాణ-ముషీరాబాద్

గిరిజన రిజర్వుడు పార్లమెంటు స్థానాల్లో ఎన్నికలను బహిష్కరిస్తామనీ, గిరిజనుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదనీ, ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ శనివారం బాగ్ లింగంపల్లిలోని సేవలాల్ సేన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన వ్యవస్థాపకులు, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ భూక్య సంజీవ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభజన హామీలు నెరవేర్చడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీ, నియోజకవర్గాల పునర్విభజన పట్ల కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందన్నారు. గిరిజన జనాభా దామాషా ప్రకారం 7.5 శాతం నుండి 10 శాతానికి పెంచకపోవడంతో పాటు సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ చేసి కార్మిక వ్యతిరేక నిర్ణయాలు అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి గిరిజనులు దూరం కావడం ఖాయమనీ, అందుకు మిగతా రాష్ట్రాల్లో ఉన్న గిరిజనులను చైతన్యం చేస్తూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గిరిజన పార్లమెంటు స్థానాల్లో ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. గిరిజనులకు రాష్ట్రపతి పదవి ఇచ్చి మొత్తం గిరిజనానికి మేలు చేస్తున్నట్టు ఫోటోలు ఇవ్వడం కాదనీ, గిరిజనుల హక్కులను రావాల్సిన రాజ్యాంగ హక్కులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు వడిత్య కల్యాణ్ నాయక్, నాయకులు హెూబా నాయక్, మున్నా నాయక్, నారాయణ, బాలు నాయక్, గాన్సీరామ్, శీను, కృష్ణ, చందు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నవతెలంగాణ-అడిక్‌మెట్



ప్రతి ఇంటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగి తయారయ్యేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యం అని శ్రీధర్స్ కాలేజ్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ (సీసీఈ) నిర్వాహకులు వరుణ్ పేర్కొన్నారు. నగరంలో ఉన్న తమ రెండు బ్రాంచ్‌లలో 712 మంది అభ్యర్థులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సి), రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ (ఆర్.ఆర్.బి), గ్రూప్-4 తదితర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఫైనల్ సెలక్షన్ సాధించిన సందర్భంగా శనివారం సీసీఈ బ్రాంచీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ సౌత్ ఇండియా మొత్తంలో ఇంతమంది విద్యార్థులు ఏ ఇనిస్టిట్యూట్ నుంచి కూడా సెలెక్ట్ కాలేదని తెలిపారు. నాణ్యమైన విద్యను తక్కువ ఫీజులతో అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఎక్కువ ఉద్యోగాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థినీ ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 17 బ్రాంచీలుగా సీసీఈ అవతరించిందని తెలిపారు. ప్రతి బ్రాంచీలో సక్సెస్ మీట్ జరుపుతామని వెల్లడించారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా రూపొందించేలా దిశా నిర్దేశకం చేసి బలమైన దేశాన్ని, మంచి సమాజాన్ని సృష్టించేలా సీసీఈ ముందుకు సాగుతుందన్నారు. తమను నమ్మి వచ్చిన ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీసీఈ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సక్సెస్ మీట్‌లో సీనియర్ ఫ్యాకల్టీ శివ, రఘు, శశి, తదితరులు పాల్గొన్నారు.

'హెల్త్ ఫర్ ఆల్' ప్రచారాన్ని ప్రారంభించిన శ్రావణి హాస్పిటల్స్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రావణి హాస్పిటల్స్ అధ్వర్యంలో ఆరోగ్యకరమైన జీవనం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి వినూత్నమైన ఆరోగ్య అవగాహన డ్రైవ్‌ను ప్రారంభించింది. హాస్పిటల్ సిబ్బంది, అంబులెన్స్‌తో పాటు, నగరంలోని 121 ప్రదేశాలను సందర్శించి, ఆరోగ్య కోట్స్ ఆరోగ్యకరమైన జీవనశైలిని నడిపించడానికి చిట్కాలను ప్రజలతో పంచుకున్నారు.'హెల్త్ ఫర్ ఆల్' ప్రచారాన్ని ప్రారంభించినట్టు డాక్టర్ ప్రసాద్ నీలం, డాక్టర్ నవీన్ చెట్టుపల్లి, సీఈవో శ్రావణి చెట్టుపల్లి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి ఆరోగ్యం శ్రేయస్సును కాపాడుకోవడం, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా వేలాది మందికి చేరువలో ఒకే రోజు 200 కిలో మీటర్ల మేర ప్రచారం కొనసాగిందన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. సమాజాన్ని సృష్టించేందుకు కట్టుబడి ఉన్నామనీ, వారి ఆరోగ్యం పట్ల బాధ్యత వహించేలా ప్రజలను ప్రేరేపించాలని తాము ఆశిస్తున్నామన్నారు. ఈ ప్రచారానికి ప్రజల నుండి సానుకూల స్పందన లభించిందన్నారు. సుమారు 25వేల మంది ప్రజలకు చేరుకున్నామని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సకాలంలో ఆరోగ్య తనిఖీలతో సహా నివారణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. హెల్త్ ఫర్ ఆల్ క్యాంపెయిన్‌కు అద్భుతమైన స్పందన వస్తుందన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మాదాపూర్‌లోని శ్రావణి హాస్పిటల్స్ సీఈఓ శ్రావణి చెట్టుపల్లి, టైమ్స్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుతో ప్యానెల్ డిస్కషన్‌లో పాల్గొన్నట్టు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నగరంలో ఇండియా-ఘనా ట్రేడ్ సమ్మిట్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఘనా నుంచి వచ్చిన వాణిజ్య ప్రతినిధి బృందం హైటెక్ సిటీలోని హోటల్ ట్రైడెంట్‌లో ట్రేడ్ సమ్మిట్‌ను నిర్వహించింది. పశ్చిమ ఆఫ్రికా దేశానికి చెందిన అగ్ర బ్యూరోక్రాట్‌లు తమ దేశం ఎందుకు అత్యంత అనుకూలమైన ప్రదేశంగా ఉందో వివరించారు. ఈ సమ్మిట్‌ను జీవీ కృష్ణ ట్రేడ్ కమిషనర్ ఆఫ్ ఇండియా ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్-ఘనా నిర్వహించారు. రాష్ట్ర హెూం, జైళ్లు, అగ్నిమాపక సేవల మంత్రి మహమూద్ అలీ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఘనా ప్రతినిధి బృందానికి ఘనా హైకమిషనర్ అసోమా చెరెమె క్వాకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అవగాహన ఒప్పందాలపై సంతకాలు కూడా జరిగాయి. మంత్రి మహ్మద్ అలీ తన ప్రసంగంలో వ్యాపారాన్ని సులభతరం చేయడానికి, వ్యవసాయంలో వాణిజ్యానికి, రెండు దేశాలకు చెందిన విధాన రూపకర్తలకు ఉపయోగకరంగా ఉండటానికి ఈ వాణిజ్య సదస్సు ఒక ముఖ్యమైన వేదిక అ అన్నారు. బ్యూరోక్రసీ నిర్వహణ, పోలీసు వ్యవస్థ, నీటిపారుదల, టీఎస్ ఈ-పాస్, వ్యవసాయంలో రైతులకు సబ్సిడీ, ఇంధనం, ఫార్మాస్యూటికల్స్, ఎగుమతి, దిగుమతులలో అనేక ఇతర పథకాలను నిర్వహించడం నుండి ఆధునిక తెలంగాణ వ్యవస్థను ఆయన అందించారు. అనేక రంగాల్లో ఘనాతో కలిసి పని చేయడానికి నగరం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. జీవీ కృష్ణ ట్రేడ్ కమిషనర్ ఆఫ్ ఇండియా మాట్లాడుతూ 50వేల ఎకరాల్లో 2 లక్షల ఎకరాల భూమి డీపీఆర్ కింద ఉందనీ, దీన్ని ఘనా సైనిక దళాలు వ్యవసాయం కోసం ఇచ్చాయని, ఆరోగ్యం, వాణిజ్య డేటా, వ్యాపార పరిచయాల్లో ఘనాకు భారతదేశం అసమా నమైన అంచనాను అందిస్తోందన్నారు. నెట్‌వర్కింగ్ అవకాశాలు, విద్య, పెట్టుబడి అవకాశాలు, డాక్యుమెంటేషన్, ట్రేడ్ లైసెన్స్, మరెన్నో అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా, అసఫ్ జాస్ 9వ అధిపతిగా నియమితుడైన హెచ్.ఇ.రౌనక్ యార్ ఖాన్, సుచిర్ ఇండియా ఎండీ.లయన్ కిరణ్, మెడికల్ డివైజ్ పార్క్‌లోని పారిశ్రామికవేత్తలు డాక్టర్ అజయ్ అగర్వాల్, దాదాపు 150 మంది వ్యాపార సిబ్బంది పాల్గొన్నారు.

పూలే జయంతి ఉత్సవాల కమిటీ కో-ఆర్డినేటర్‌గా కొత్తపల్లి అబినాష్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వం ఈ నెల 11న నిర్వహించే మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ కో-ఆర్డినేటర్‌గా కొత్తపల్లి అబినాష్ నాయిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అబినాష్ మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని చెప్పారు. నాయీ బ్రాహ్మణ (మంగలి) సామాజికవర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, బీసీ కమిషన్ సభ్యులు కిషోర్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ముఠారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అత్యంత వైభవంగా పూలే జయంతి వేడుకలను నిర్వహిస్తాం



నవతెలంగాణ-అడిక్‌మెట్

అత్యంత వైభవంగా పూలే జయంతి వేడుకలను నిర్వహిస్తాం అని మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ టి.రాజు కుమార్ తెలిపారు. మహాత్మా జ్యోతి రావు పూలే 197వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజు కుమార్, బీసీ వెల్ఫేర్, సివిల్ సప్లై శాఖ మంత్రి గంగుల కమలాకర్ నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కే గురువు జ్యోతిరావు పూలే జయంతిని పండగ వాతావరణం తలపించేలా నిర్వహిస్తామన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతల అప్పగించిన మంత్రి గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయ సాధనకు నిరంతర కృషి



నవతెలంగాణ-అడిక్‌మెట్

మహాత్మా జ్యోతి రావు పూలే ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తాం అని జ్యోతిరావు పూలే ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ భూపెష్ సాగర్ తెలిపారు. మహాత్మా జ్యోతి రావు పూలే గారి 197వ జయంతి సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా బీసీ భుపేశ్ సాగర్‌ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ ఆర్.కృష్ణయ్య నియమిస్తున్నట్టు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా బోయపల్లి లింగం గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా అంబర్‌పేట నియోజవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోయపల్లి లింగం గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బీఆర్ఎస్‌లోకి గెలవయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

సీనియర్ వామపక్ష నాయకులు పులిజాల గెల్వయ్య అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, నగర అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో నేడు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. గతంలో విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, నగర కార్యదర్శిగా, సీపీఐ(ఎం) నగర నాయకులుగా, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తెలంగాణ ఉద్యమంలో ఉన్నారు.

జార్జిరెడ్డి 51వ వర్ధంతి మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

అరుణతార జార్జిరెడ్డి 51వ వర్ధంతి మహాసభల పోస్టర్‌ను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ మాట్లాడుతూ మతోన్మాద బ్రాహ్మణీయ శక్తుల ఆటకట్టించిన ఉస్మానియా క్రాంతితార జార్జిరెడ్డి అని పేర్కొన్నారు. నేడు విస్తృమవుతున్న మతచాందస పాలనలో జార్జిని స్మరించడమంటే ప్రజాస్వామ్యన్ని కాపాడుకోవడమే అన్నారు. విద్యార్థి నిరుద్యోగుల బలిదానాలపై ఏర్పడ్డ తెలంగాణలో టీఎస్‌పీఎస్‌సీ పేపర్ మొదలు పదవ తరగతి ప్రశ్న పత్రాలు లీక్ అవ్వుతుండడం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. లీక్ వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనల కోసం రోజుకో రకంగా రక్తికట్టిస్తున్నాయి తప్ప విద్యార్థి, నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధి శూన్యమన్నారు. మరో వైపు మోడీ ప్రభుత్వం ప్రజలందరూ బయటికి వెళ్లలేని కరోనా పరిస్థితుల్లో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 తీసుకొచ్చి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణతో పేద మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నా రని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కంచనపల్లి శ్రీను, భయ్యం వికాస్, గణేష్, ఆసిఫ్, అమ రేందర్, శ్రీకాంత్, సాయి, సందీప్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

గౌడ సమస్యలను పరిష్కరించాలని ప్రధానికి లేఖ

నవతెలంగాణ-ముషీరాబాద్



కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కల్లుగీత కార్పొరేషనుకు రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని తెలంగాణ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మెయిల్ ద్వారా పంపారు. అనంతరం చిక్కడపల్లి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 40 లక్షల మంది గౌడ సామాజిక వర్గానికి చెందిన వారున్నారన్నారు. వీరిలో 2.18 లక్షల మంది ప్రజలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నట్టు చెప్పారు. ఎక్సైజ్ శాఖ పరిధిలో నిర్వహించే వైన్స్ అండ్ బార్లలో కల్లుగీత వృత్తిదారులకు 50 శాతం కేటాయించాలన్నారు. ప్రతి సొసైటీకీ పావలా వడ్డీతో రూ.25 లక్షల రుణం మంజూరు చేయాలన్నారు. 50ఏండ్లు పైబడిన కల్లుగీత వృత్తిదారులకు ప్రతినెలా రూ.5 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. చెట్లపై నుంచి పడి మరణించినా, తీవ్ర గాయాలపాలైనా రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. దామాషా ప్రకారం గౌడ్‌లకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలన్నారు. ఈ అంశాలను బీజేపీ మ్యానిఫెస్టోలో చేర్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

'తక్కువ ధరలకు ఆభరణాలు విక్రయించడం అభినందనీయం'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



నగరవాసులకు సరసమైన ధరలకు బంగారు ఆభరణాలను విక్రయించడం అభినందనీయమని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రైమ్ ప్లాజా పున్ణప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై వినియోగదారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సామజిక సేవా కార్యక్రమాల్లో మలబార్ గోల్డ్ చురుకైన పాత్ర పోషించడం స్ఫూర్తిదాయకమన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపి.అహ్మద్ మాట్లాడుతూ 30 ఏండ్ల వేడుకల్లో భాగంగా ప్రతి రూ.30 వేల కొనుగోలుతో 100 మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి, డైమండ్, జెమ్స్టోన్, పోల్కీ డిజైన్ ఆభరణాల కొనుగోలుపై 250 మిల్లి గ్రాముల సమానమైన విలువను బంగారు నాణేనికి పొందుతారన్నారు. ఈ ఆఫర్ ఈ నెల 18 నుండి 30 వరకు వర్తిస్తుందన్నారు. సామాజిక సేవా కారక్రమాల్లో భాగంగా, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్ ద్వారా ఆర్జించిన లాభాలలో 5 శాతం మొత్తాన్ని ఇదే ప్రాంతంలో వివిధ ధార్మిక దాత కార్యకలాపాల కోసం కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ప్రతినిధులు హెడ్ రిటైల్ రెఫ్ అఫ్ ఇండియా సిరాజ్ పికె, హిమాయత్ నగర్ స్టోర్ హెడ్ నయీమ్, సోమాజిగూడ స్టోర్ హెడ్ శరీఫ్, కూకట్‌పల్లి స్టోర్ హెడ్ షానిబ్, ధరావత్ రాంబాబు, మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుత కట్టడాలకు తెలంగాణ ప్రత్యేకం : మంత్రి



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో అద్భుతమైన చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు ఎంతో ప్రత్యేకమని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు యువజన సర్వీసుల శాఖల మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహించుకోవాలని యునెస్కో ప్రకటించిందని తెలియజేస్తూ శనివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ కట్టడాలను కాపాడుకోవడానికి యూనెస్కో వివిధ దేశాల ప్రాచీన కట్టడాలను గుర్తించి పరిరక్షణ, పర్యాటకుల కోసం ప్రజల సందర్శనార్థం ప్రకటిస్తుందన్నారు. దేశంలోని 40 కట్టడాల్లో 39వ సంఖ్యగా రామప్ప నిలిచిందనీ, ఇది అప్పటి కాకతీయ రాజుల ఒకరైన రుద్ర రాజు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రామప్ప ఆలయం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ15 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, రాష్ట్ర హెరిటేజ్ తెలంగాణ అధికారులు నారాయణ, రాములు నాయక్, నాగరాజు, ములుగు జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి, చారిత్రక పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణకు తీరని ద్రోహం చేసిన మోడీ సర్కార్'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



తెలంగాణకు తీరని ద్రోహం చేసిన కేంద్ర బీజేపీ మోడీ సర్కార్‌పై ప్రజలు తిరుగుబాటు చేయాలని దళిత బహుజన పార్టీ (డిబిపి) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ సూచించారు. శనివారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోడీ సర్కార్ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తూ సికింద్రాబాద్‌లో పార్టీ సభ ఏర్పాటు చేసి మోసపూరిత ప్రసంగం చేయడం సిగ్గు చేటన్నారు. కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, నిజామాబాద్ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బీజేపీ సర్కార్ పార్లమెంట్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. సింగరేణి ప్రాంతంలో నాలుగు బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ పరం చేసి వేలం పాట నిర్వహించడానికి కోల్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఆదేశాలు ఇవ్వడం కాంట్రాక్టర్లకు దోచుపెట్టడమేననీ, తెలంగాణ బొగ్గు సంపదను తరలించుకుపోవడానికే అని ఆరోపించారు. ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామనీ,, రాష్ట్ర విభజన హామీలు నేటికీ నెరవేర్చకుండా మోడీ సర్కార్ తెలంగాణకు తీరని అన్యాయం చేశారన్నారు. అంబానీ, ఆదానీలకు దేశ, రాష్ట్ర సంపదలను దోచిపెట్టడానికే బీజేపీ మోడీ సర్కార్ సిద్ధమైందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మనువాద దోపిడీ విధానాలతో దేశం తిరోగమనం పట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సర్కార్‌ను రాజకీయంగా సమాధి చేయాలనీ, లేకపోతే ప్రజలకు భవిష్యత్ ఉండదని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గంధం శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్.కరుణాకర్ రావు, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సిరి డ్రెస్ డివైన్ ఎక్స్‌క్లూసీవ్ ఉమెన్స్ ఫ్యాషన్ స్టోర్"ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి పరిధిలోని రాయ్‌చందని మాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'సిరి డ్రెస్ డివైన్ ఎక్స్ క్లూసీవ్ ఉమెన్స్ ఫ్యాషన్ స్టోర్"ను శనివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జనగాం నాగరాజు గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన జనగాం నాగరాజు గౌడ్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి ఉత్తర్వులు జారీ చేయగా టీపీసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తన పై నమ్మకంతో నియామకానికి సహకరించిన నియోజకవర్గ సీనియర్ నాయకులు, ఐకార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పొన్నం తరుణ్ గౌడ్,ఎన్ ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రధాని నరేంద్ర మోదీ గో బ్యాక్' నిరసనలు





నవతెలంగాణ-సంతోష్‌నగర్

హైదరాబాద్ సౌత్ జిల్లా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ రాకను వ్యతిరేకిస్తూ నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ పార్టీ కార్యదర్శి ఎం.డి అబ్బాస్ హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, కొత్తగా గ్యాస్ ధరలు పెంచడానికి వ్యతిరేకంగా ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి ప్రజలపై భారాలు మోపుతున్న నరేంద్ర మోదీ హైదరాబాదు నగరానికి రావడానికి నిరసిస్తూ నరేంద్ర మోదీ గో బ్యాక్ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నిరసన కారులను సంతోష్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి నిర్బంధంగా సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండి అబ్బాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.కోటయ్య, ఎం.మీనా, జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలు నాయక్, అబ్దుల్ లతీఫ్, అన్వర్ ఖాన్, మహమ్మద్ సాహెబ్, ముక్తార్, శ్రీను నాయక్, కిషన్ నాయక్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రామంతపూర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, జీఎస్టీ పేరుతో ప్రజలపై అనేక రకాల భారాలు మోపుతూ, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గియాలంటూ, తొలగించిన కార్మిక చట్టాలనుతిరిగి తీసుకురావాలని, నాలుగు కోడ్లను రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వై.వెంకటేశ్వర్లు, బాలయ్య యాదగిరి, చలపతి, చలపతిరావు, తుకారం, కిరణ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్కేసర్ : విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణకు అన్యాయం చేసిన మోడీ ఏ మొఖం పెట్టుకొని తెలంగాణకు వస్తున్నాడో ప్రజలకు జవాబు చెప్పాలని, తెలంగాణకు వచ్చే నైతిక అర్హత లేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్.సబిత విమర్శించారు. శనివారం ఘట్ కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద సీపీఐ(ఎం) కార్యకర్తలు నిరసన నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటన వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. తెలంగాణ పర్యటన కోసం వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాకను నిరసిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎర్రజెండాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకురాలు చల్లగొండ అరుణ, గుర్రం నాగమణి, కె.అలివేల, కె.అనసూయ, ఎస్.కవిత, కె.లక్ష్మి పి.సునీత, వై.అరుణ, ఎస్.కుమారి, డి.కొండమ్మ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజించినప్పటికీ ఆనాటి రాష్ట్ర విభజన హామీలు ఇప్పటివరకు నెరవేర్చని దేశ ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చే అర్హత లేదని సీపీఐ(ఎం) బాచుపల్లి నాయకులు ఎం.చంద్రశేఖర్, బాలపీర్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రగతి నగర్ ఆటో స్టాండ్ దగ్గర తెలంగాణ రాష్ట్రానికి మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం), బాచుపల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో" శనివారం మోడీ గో బ్యాక్" అని నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బాబు నాయక్ శీను సింగోటం ప్రభుదాస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ : కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని ప్రధాని మోడీ రాష్ట్రానికి రావడాన్ని వ్యతిరేకిస్తూ బాలానగర్‌లోని వై జంక్షన్ వద్ద శనివారం సీపీఐ(యం) బాలానగర్, కూకట్‌పల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో "మోడీ గో బ్యాక్" అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(యం) పార్టీ సీనియర్ నాయకులు బిఎస్.సుదర్శన్, ఐలాపురం రాజశేఖర్, ఎం.శంకర్ లు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులకు టెండర్లు పిలిచిన నరేంద్ర మోడీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(యం) నాయకులు కె.కష్టా నాయక్, శివప్రసాద్, సుగుణ, ధర్మారావు, శ్రీనివాస్,రజియా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్సై తుది పరీక్ష

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహన్



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో టీకేఆర్ కళాశాలలో శనివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష కేంద్రాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహన్, ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సై తుది పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మీర్‌పేట్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి మానవత్వం చాటున్నారు.



ఓ ఎస్ఐ మహిళ అభ్యర్థి ప్రెగ్నెన్సీ ఉండటంతో తన కారులో పరీక్ష కేంద్రం వరకు తీసుకెళ్లి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, డీఐ సైదులు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా

కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజుల రామారం డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలో నెలకొని ఉన్న పెండింగ్ సమస్య లను దశలవారీగా పరిష్కరిస్తానని డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం డివిజన్ పరిధి అంబేద్కర్ నగర్‌లో ప్రజా సమస్యలపై స్థానికులతో కలిసి పాదయాత్ర చేశారు . బస్తీలో నెలకొన్న మంజీరా, కరెంటు, డ్రైనేజీ, సమస్యలను ప్రజల నుండి తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అట్టి సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నవాబు, ఉపాధ్యక్షులు సింగారం మల్లేష్, బీసీ సెల్ ఉపాధ్యక్షులు, నాయకులు మురళి ,చందు, మహేందర్ రెడ్డి, సంతోష్, మధు, శ్రీకాంత్,రాజు, రాధా బాయ్, జాంగిర్, దస్తగిరి, బిలాల్, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

భరత్ నగర్ హెచ్ఐజీ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



నవతెలంగాణ - బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ పరిధిలోని హెచ్ఐజీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సమస్యల పరిష్కారం కొరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సంబందిత అధికారులతో చర్చించి రానున్న వర్షాకాలం వరకు పరిష్కరిస్తామని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం హెచ్ఐజీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నివాసితులు వర్షాకాలంలో వరదల సమయంలో వరదనీరు హెచ్ఐజీ ఇళ్లలోకి వస్తున్నాయని, వరదనీటిని ఆపడానికి వెనుక ఉన్న నాలాకు ఆనుకుని కాంక్రీట్ గోడ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. కొత్తగా కాంక్రీట్ రోడ్డు వేయడంతో పాటు హెచ్ఐజీ లేన్ 65 నుండి 75,76,85 వరకు కొత్త డ్రైనేజీ పైప్‌లైన్‌ను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కోరారు. తరచుగా భరత్ నగర్ మెట్రో స్టేషన్‌లోని నాలాను క్రమం తప్పకుండా శుభ్రపరచడం, డ్రైనేజీలో నీరు సజావుగా ప్రవహించేలా చేయడం సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా హెచ్ఐజీ రోడ్లపై పిల్లలు ఆడుకోవడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నందున వారికి ఆట స్థలాన్ని కల్పించాలని కోరారు. సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

అర్జున్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సుందర్ నగర్‌లో గల అర్జున్ స్కూల్ 7 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 8వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ తనయుడు సోమ శేఖర్ రెడ్డి హాజరై విద్యార్థులకు పట్టాలు అందించి, సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణకి, ఉపాధ్యాయుల బృందానికి మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శబ్ద వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్ద వలసిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఉందన్నారు.

పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధిస్తూ వస్తుందని అన్నారు.ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించి, డివిజన్ కు మంచి పేరు తెస్తుందని ఆశ భవాని వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులు పరీక్ష సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, రాజీవ్ గృహకల్ప అధ్యక్షుడు శివ గౌడ్, తిరుపతి ,వెంకట్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు, జాంగిర్, సంతోష్ ,రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులు

కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికి వారదులుగా నిలవాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. డివిజన్ పరిధిలోని మల్లారెడ్డి నగర్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీ ప్రజలతో కమిటీ సభ్యులు ఐకమత్యంగా ఉండాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయ న్నారు. రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా, కాలనీ అభివృద్ధి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కార్పొరేటర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీ రెడ్డి ,సికిందర్ రావు, శెట్టి బలిజ సంఘం జంట నగరాల అధ్యక్షులు(వై.ఎఫ్ .సి .ఏ), మల్లారెడ్డి నగర్ మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దంపన బోయిన శ్రీనివాస్ స్థానిక నాయకులు కస్తూరి బాలరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది బయోమెట్రిక్‌ను పరిశీలించిన కమిషనర్



నవ తెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ, మునిసిపల్ కమిషనర్ కె. సత్యనారాయణ రావు శనివారం ఉదయాన్నే వేకువ జామున అన్ని వార్డ్‌ల యందు పారిశుధ్య పనులను, సిబ్బంది బయో మెట్రిక్ హజరును పరిసీలించినారు, అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వార్డ్‌లయందు మెయిన్ రోడ్ సైడ్ వేస్ట్ ప్లాస్టిక్ చెత్త కుప్పలు లేకుండా వుండాలని ఆదేశించినారు, షాప్ ల వద్ద తడి చెత్త పొడి చెత్త కు సపరేటుగా డస్ట్ బిన్ వుండాలని, చెత్తను స్వచ్ఛ్ ఆటోలను అందించాలని సూచించినారు, సింగల్ యూస్ ప్లాస్టిక్ ని నిషేధించడమైనది కావున ప్లాస్టిక్ బదులు జుట్ బ్యాగ్‌లు వాడాలని సూచించినారు, ఈ కార్యక్రమం మునిసిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, అన్ని వార్డ్‌ల జవాన్‌లు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్‌గుప్త



నవతెలంగాణ-నాగోల్

శనివారం నగరంలోని ఉప్పల్ రామంతపూర్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్ర కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్త పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారి చేతుల మీదుగా మంచినీళ్లు, ప్రజలకు అందజేసి దాహార్తిని తీర్చడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గారిని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలోఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు పాండయ్య గుప్త,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్ర శేఖర్, రమేష్ గుప్త, శ్రవన్కుమార్, బోనగిరి శ్రీనివాస్,కార్పొరేటర్ యుగంధర్‌రెడ్డి, సాంబశివరావు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్ పనులు పరిశీలన



నవతెలంగాణ -సరూర్‌నగర్

ఆర్కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలోని పార్కులో 30లక్షల నిధులతో చేపట్టిన కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్ పనులను డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడకుండా పనులు త్వరగా పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమకూర్చాలసిందిగా కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మహేందర్, మురళీధర్ రెడ్డి లు వారిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాజిద్, మహేందర్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, ఎల్లన్న, శంకర్ నాయక్, జగన్, సిద్దగోని వెంకటేష్, శేఖర్, పబ్బు శ్రీను పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా, అబద్దాలు చెప్పిన మోడీ గో బ్యాక్

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికరణ కొరకు వస్తున్న ప్రధాని రాకను నిరసిస్తూ శనివారం సీపీఐ, సీపీఎం నాయకులు షాపూర్ నగర్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్, సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ లు మాట్లాడుతూ... విభజన హామీలైన గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారం ఉక్కు కర్మగారం, ఎయిమ్స్ లాంటి హామీలను అమలు పరచకుండా, కనీసం వాటి అమలు కోసం ప్రయత్నం చేయకుండా తెలంగాణకు రావడం అన్యాయమని అన్నారు. రామగుండంలో సింగరేణి ప్రైవేట్ పరం చెయ్యబోము అని హామీ ఇచ్చి మళ్లీ మూడు గనులకు టెండర్లు పిలవడం ఒక ప్రధాని స్థాయి వ్యక్తి రాజకీయాల కోసం అబద్దాలు ఆడడం ఘోరమైన తప్పిదమని అన్నారు. జీఎస్టీ ద్వారా వచ్చిన 20 లక్షల కోట్లలో 17 లక్షల కోట్లు పేద మధ్యతరగతి ప్రజల నుండి వసూలు చేసినట్లు సాక్షాత్తు పార్లమెంటులో ప్రకటించారని, పన్నులు కట్టేది పేద మధ్యతరగతి ప్రజలైతే, పన్నుల రూపంలో ఇచ్చిన లోన్లు మాఫీతో లాభపడేది సంపన్నులని, ఈ రకంగా పన్నులు పెంచి పేద ప్రజలపై భారం మోపి సంపన్నులకు దోచిపెడుతుందని విమర్శించారు. గత 75 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ నష్టపోని ఎల్ఐసి మోడీ విధానం వల్ల, అయిన మిత్రుడైన ఆదానికి అప్పుజెప్పడం వల్ల 75 వేల కోట్లు నష్టపోయిందని దీని గురించి మాత్రం నోరు మెదపట్లేదని అదే ప్రతిపక్షాలు ఏమి చేసినా విద్వేషా ప్రచారం చేయడంలో ఆయనకు తిరుగులేదని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా ప్రధాని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని లేని పక్షంలో నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, సీఐటీయూ నాయకులు దేవదానం, అంజయ్య సీపీఐ నాయకులు రాములు, శ్రీనివాస్, రాము, అశోక్ రెడ్డి, మహేందర్, శేఖర్, సుంకి రెడ్డి, సీపీఎం నాయకులు సత్యం లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారికతే కాదు సాంస్కృతిక సాధికారికత కావాలి



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ సాధించుకున్న తరువాతనే మన భాష యాస గుర్తింపునకు వస్తున్నాయని, రాష్ట్రంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. ఆర్థిక సాధికారత మాత్రమే కాదు జాతి గుర్తింపునకు సాంస్కృతిక సాధికారికత సాధించాలని ఆయన కోరారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ నిర్వహణలో యవనిక పేరిట జరుగుతున్న నాటికోత్సవాలలో భాగంగా ఆస్కార్ అవార్డ్ అందుకొన్న గీత రచయిత చంద్ర బోస్‌కు సత్కార సభ జరిగింది. చంద్ర బోస్ మాట్లాడుతూ 95 సంవత్సరాల ఆస్కార్ చరిత్రలో తొలిసారిగా వినిపించిన తెలుగు పదం నమస్తే, పాట పాదం పొలం అని రెండూ దేశ సంస్కృతికి తెలుగు జాతి సంప్రదాయానికి ప్రతీకలని అన్నారు భాష తెలియకున్నా ఇతర దేశాలవారు నాటు నాటు పాటకు నృత్యం చేశారని, ఇందుకు కారణం నాద మాధుర్యం అన్నారు. మూడు వెలపైగా పాటలు రాసి జాతీయ పురస్కారం కోసం ఎదురుచూసిన నాకు ఆస్కార్ రావటం అద్భుత మని యువత నిరాశ పడకుండా కృషి చేస్తే ఫలితం తప్పక లభిస్తుందని అన్నారు. వేదికపై సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, అకాడమీ చైర్మెన్ దీపికారెడ్డి పాల్గొన్నారు. రచయిత్రి ఇనాంపూడి శ్రీలక్ష్మి సన్మాన పత్రంలో చంద్రబోస్ కవిత్వం ఆవిష్కరించారు. విస్వశాంతి కల్చరల్ వారిచే బీఎమ్ రెడ్డి దర్శకత్వంలో కల నేత నాటిక అజయ్ దర్శకత్వంలో ఆల్ఫా నాటిక ప్రదర్శించారు.

మేడ్చల్ నుండి సికింద్రాబాద్‌కు ఎంఎంటిఎస్ రైలు ప్రారంభం

నవతెలంగాణ - మేడ్చల్

రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు హైదరాబాద్ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలును ప్రారంభించారు.అనంతరం పరేడ్ గ్రౌండ్ వేదికగా పలు ఎంఎంటిఎస్ రైలు సర్వీసులను ప్రారంభించారు.ఆ సర్వీసులలో మేడ్చల్ నుండి సికింద్రాబాద్ కు ఎంఎంటిఎస్ రైలు ప్రధాని జెండా ఊపడంతో ప్రారంభమైంది.మొదటి సర్వీస్ మేడ్చల్ రైల్వే స్టేషన్ నుండి సికింద్రాబాద్ వరకు రైలు ప్రయాణికులతో బయలుదేరింది.ప్రతిరోజు 12సర్వీసులు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, కౌన్సిలర్ బత్తుల శివ కుమార్,కో ఆప్షన్ సభ్యురాలు గీత,రైల్వే ఉద్యోగులు,మేడ్చల్ రైల్వే స్టేషన్ సిబ్బంది,మల్కాజ్ గిరి కి చెందిన జ్యోతి హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



రాయల్స్ రైడ్



ఐపీఎల్‌లో నేడు
గుజరాత్ X కోల్‌కత
వేదిక :అహ్మదాబాద్,సమయం: మ:3.30
హైదరాబాద్ X పంజాబ్
వేదిక : ఉప్పల్, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

రాజస్థాన్ రాయల్స్ గెలుపు బాట పట్టగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ముచ్చటగా మూడో మ్యాచ్‌లో పరాజయం పాలై ఓటముల్లో హ్యాట్రిక్ కొట్టింది. జోశ్ బట్లర్ (79), యశస్వి జైస్వాల్ (60) ధనాధన్ అర్థ సెంచరీల మోతతో తొలుత రాజస్థాన్ రాయల్స్ 199/4 పరుగుల భారీ స్కోరు చేసింది. పేసర్ ట్రెంట్ బౌల్ట్ (3/29), స్పిన్నర్ చాహల్ (3/27) విజృంభణతో ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 142/9 పరుగులకే పరిమితమైంది. 57 పరుగుల తేడాతో ఢిల్లీపై రాజస్థాన్ ఘన విజయం సాధించింది.

- బట్లర్, జైస్వాల్ ధనాధన్ జోరు
- ట్రెంట్ బౌల్ట్, చాహల్ వికెట్ల వేట
- ఢిల్లీపై రాజస్థాన్ ఘన విజయం

నవతెలంగాణ-గువహటి

రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్16లో రెండో విజయం నమోదు చేసింది. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా కదం తొక్కటంతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసి 57 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పంజాబ్ కింగ్స్‌తో ఉత్కంఠ మ్యాచ్‌లో ఓటమి అనంతరం రాజస్థాన్ పుంజుకోగా.. ఢిల్లీ క్యాపిటల్స్ సీజన్లో ఆడిన మూడు మ్యాచుల్లోనూ పరాజయాలు మూటగట్టుకుంది. జోశ్ బట్లర్ (79, 51 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), యశస్వి జైస్వాల్ (60, 31 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో చెలరేగారు. షిమ్రోన్ హెట్‌మయర్ (39 నాటౌట్) రాణించటంతో రాజస్థాన్ రాయల్స్ తొలుత 199/4 పరుగులు చేసింది. ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చేతులెత్తేసింది. కెప్టెన్ డెవిడ్ వార్నర్ (65, 55 బంతుల్లో 7 ఫోర్లు) అర్థ సెంచరీకి తోడు లలిత్ యాదవ్ (38, 24 బంతుల్లో 5 ఫోర్లు) రాణించినా.. ఇతర బ్యాటర్లు ఎవరూ అంచనాలను అందుకోలేదు. స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (3/27), పేసర్ ట్రెంట్ బౌల్ట్ (3/29) మూడు వికెట్ల ప్రదర్శనతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేశారు. 20 ఓవర్లలో 9 వికెట్లకు 142 పరుగులు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ హ్యాట్రిక్ ఓటమి చవిచూసింది. రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

బౌల్ట్, చాహల్ తిప్పేశారు

200 పరుగుల భారీ ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చతికిల పడింది. ఆరంభ ఓవర్లోనే రెండు వికెట్లు చేజార్చుకుని లక్ష్యం దిశగా సాగలేకపోయింది. పేసర్ ట్రెంట్ బౌల్ట్ తొలి ఓవర్లో పృథ్వీ షా (0), మనీశ్ పాండే (0)లను డగౌట్‌కు చేర్చాడు. వరుస వికెట్లతో రాయల్స్ బ్రేక్ సాధించింది. రౌలీ రొసో (14)ను అశ్విన్ సాగనంపాడు. 36/3తో కష్టాల్లో ఉన్న క్యాపిటల్స్‌ను కెప్టెన్ డెవిడ్ వార్నర్ (65), లలిత్ యాదవ్ (38) ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ జోడీ నాల్గో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. వికెట్ల పతనాన్ని నిలువరించిన ఈ జోడీ రన్‌రేట్‌ను అందుకోవటంలో విఫలమైంది. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగటంతో స్పిన్నర్ చాహల్‌కు మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు దొరికిపోయారు. లలిత్ యాదవ్ వికెట్‌తో ఢిల్లీని బౌల్ట్ మళ్లీ దెబ్బ కొట్టగా..



అక్షర్ పటేల్ (2), అభిషేక్ పోరెల్ (2) సహా డెవిడ్ వార్నర్ (65)లను వెనక్కి పంపించిన చాహల్ రాయల్స్ విజయాన్ని ఖాయం చేశాడు. 20 ఓవర్లలో 9 వికెట్లకు 142 పరుగులే చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌పై ఆశలను ఆరంభంలోనే ఆవిరి చేసుకుంది.

యశస్వి, బట్లర్ ధనాధన్

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన రాజస్థాన్ రాయల్స్‌కు ఓపెనర్లు అదిరే ఆరంభాన్ని అందించారు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (60) తొలి ఓవర్లోనే ఐదు బౌండరీలతో హడలెత్తించాడు. హ్యాట్రిక్ ఫోర్లతో ఇన్నింగ్స్‌ను మొదలెట్టిన జైస్వాల్.. చివరి రెండు బంతులనూ బౌండరీ లైన్ దాటించాడు. జోశ్ బట్లర్ సైతం బౌండరీల మోతలో జత కలవటంతో పవర్‌ప్లేలో రాయల్స్ మరోసారి పవర్‌ఫుల్ ప్రదర్శన చేసింది. యశస్వి జైస్వాల్ 25 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదటంతో రాయల్స్ స్కోరు పరుగులు పెట్టింది. తొలి వికెట్‌కు 98 పరుగులు జోడించిన అనంతరం యశస్వి వికెట్ కోల్పోయాడు. ఆ తర్వాత జోశ్ బట్లర్ క్రీజులో నిలిచినా.. రాయల్స్ పరుగుల వేగం నెమ్మదించింది. సంజు శాంసన్ (0), రియాన్ పరాగ్ (7) నిరాశపరిచారు. షిమ్రోన్ హెట్‌మయర్ (39 నాటౌట్, 21 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెరవటంతో రాయల్స్ 199 పరుగులు చేసింది. యశస్వి క్రీజులో ఉండగా 250 పైచిలుకు స్కోరుపై కన్నేసిన రాజస్థాన్.. అతడి నిష్క్రమణతో 199 పరుగులతోనే సరిపెట్టుకుంది. క్యాపిటల్స్ బౌలర్లలో ముకేశ్ కుమార్ (2/36) రెండు వికెట్లు తీసుకున్నాడు.

స్కోరు వివరాలు :

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి,బి) ముకేశ్ కుమార్ 60, జోశ్ బట్లర్ (సి,బి) ముకేశ్ కుమార్ 79, సంజు శాంసన్ (సి) నోకియా (బి) కుల్దీప్ యాదవ్ 0, రియాన్ పరాగ్ (బి) రోవ్‌మన్ పావెల్ 7, షిమ్రోన్ హెట్‌మయర్ నాటౌట్ 39, ధ్రువ్ పోరెల్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు :6, మొత్తం : (20 ఓవర్లలో 4 వికెట్లకు) 199.

వికెట్ల పతనం : 1-98, 2-103, 3-126, 4-175.

బౌలింగ్ : ఖలీల్ అహ్మద్ 2-0-31-0, ఎన్రిచ్ నోకియా 4-0-44-0, ముకేశ్ కుమార్ 4-0-36-2, అక్షర్ పటేల్ 4-0-38-0, కుల్దీప్ యాదవ్ 4-0-31-1, రోవ్‌మన్ పావెల్ 2-0-18-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ : పృథ్వీ షా (సి) శాంసన్ (బి) బౌల్ట్ 0, డెవిడ్ వార్నర్ (ఎల్బీ) చాహల్ 65, మనీశ్ పాండే (ఎల్బీ) బౌల్ట్ 0, రౌలీ రొసో (సి) జైస్వాల్ (బి) అశ్విన్ 14, లలిత్ యాదవ్ (బి) బౌల్ట్ 38, అక్షర్ పటేల్ (స్టంప్డ్) శాంసన్ (బి) చాహల్ 2, రోవ్‌మన్ పావెల్ (సి) హెట్‌మయర్ (బి) అశ్విన్ 2, అభిషేక్ పోరెల్ (సి) హెట్‌మయర్ (బి) చాహల్ 7, కుల్దీప్ యాదవ్ నాటౌట్ 3, ఎన్రిచ్ నోకియా (బి) సందీప్ శర్మ 0, ముకేశ్ కుమార్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 10, మొత్తం : (20 ఓవర్లలో 9 వికెట్లకు) 142.

వికెట్ల పతనం : 1-0, 2-0, 3-36, 4-100, 5-111, 6-118, 7-138, 8-139, 9-140.

బౌలింగ్ : ట్రెంట్ బౌల్ట్ 4-1-29-3, సందీప్ శర్మ 4-0-20-1, రవిచంద్రన్ అశ్విన్ 4-0-25-2, జేసన్ హెూల్డర్ 3-0-28-0, యుజ్వేంద్ర చాహల్ 4-0-27-3, మురుగన్ అశ్విన్ 1-0-11-0.

ఫైనల్లో రజావత్

- సెమీస్‌లో ఐర్లాండ్ షట్లర్‌పై గెలుపు
- ఓర్లీన్స్ మాస్టర్స్ సూపర్ 300



ఓర్లీన్స్ (ఫ్రాన్స్) : భారత బ్యాడ్మింటన్ యువ క్రీడాకారుడు ప్రియాంశు రజావత్ చరిత్రకు అడుగు దూరంలో నిలిచాడు!. ఓర్లీన్స్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి ప్రవేశించిన ప్రియాంశు రజావత్ కెరీర్ తొలి మెగా బిడబ్ల్యూఎఫ్ టైటిల్ ముంగిట నిలిచాడు. ఐర్లాండ్ షట్లర్ న్యాట్ నుయన్‌పై వరుస గేముల్లోనే విజయం సాధించిన ప్రియాంశు రజావత్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. 44 నిమిషాల్లోనే ముగిసిన సెమీఫైనల్లో ప్రియాంశు రజావత్ 21-12, 21-9తో ఏకపక్ష విజయం నమోదు చేశాడు. రెండు గేముల్లోనూ భారత ఆటగాడికి ఐర్లాండ్ షట్లర్ నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు.

తొలి గేమ్ ఆరంభంలో రజావత్ వెనుకంజ వేశాడు. 2-5తో న్యాట్ నుయన్‌కు ఆధిక్యం కోల్పోయాడు. విరామ సమయానికి ముందు పుంజుకున్న రజావత్ 11-9తో కీలక సమయంలో ముందంజ వేశాడు. ద్వితీయార్థంలో న్యాట్ నుయన్ భారత షట్లర్‌ను అందుకోలేకపోయాడు. వరుస పాయింట్లు సాధించిన ప్రియాంశు 15-9, 19-12తో రెచ్చిపోయాడు. 21-12తో తొలి గేమ్‌ను అలవోకగా సొంతం చేసుకున్నాడు. ఇక రెండో గేమ్‌లో ప్రియాంశు రజావత్ విశ్వరూపం చూపించాడు. ఏకంగా వరుసగా 11 పాయింట్లు సాధించిన రజావత్ ఐర్లాండ్ షట్లర్‌ను చిత్తు చేశాడు. 4-0తో రెండో గేమ్‌ను మొదలెట్టిన రజావత్ 7-2 తర్వాత వరుసగా పాయింట్లు కొల్లగొట్టాడు. మ్యాచ్ పాయింట్లు న్యాట్ నుయన్ కొన్ని పాయింట్లు సాధించినా.. రజావత్ దూకుడు నిలువరించేందుకు ఆ పోరాటం ఏమాత్రం సరిపోలేదు. 21-9తో రెండో గేమ్‌తో పాటు టైటిల్ పోరులో బెర్త్‌ను సైతం ప్రియాంశు రజావత్ కైవసం చేసుకున్నాడు. వియత్నాంలో జన్మించిన న్యాట్ నుయన్.. కుటుంబంతో పాటు ఐర్లాండ్‌కు వలస వెళ్లాడు. ఇక నేడు టైటిల్ పోరులో డెన్మార్క్ షట్లర్ మాగ్నస్ జొహాన్నెసెన్‌తో ప్రియాంశు రజావత్ పోటీపడనున్నాడు.

రహానె విశ్వరూపం

- ముంబయిపై చెన్నై ఘన విజయం



ముంబయి : ఐపీఎల్ దిగ్గజాల పోరులో సూపర్‌కింగ్స్ పైచేయి సాధించింది. స్పిన్నర్లు జడేజా (3/20), శాంట్నర్ (2/28) మాయజాలంతో తొలుత ముంబయి ఇండియన్స్ 157/8 పరుగులకే పరిమితమైంది. ఇషాన్ కిషన్ (32), టిమ్ డెవిడ్ (31), తిలక్ వర్మ (22), రోహిత్ శర్మ (21) ముంబయికి గౌరవప్రద స్కోరు అందించారు. ఛేదనలో అజింక్య రహానె (61, 27 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) విశ్వరూపం చూపించాడు. 19 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన రహానె మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. రుతురాజ్ (40 నాటౌట్), దూబె (28), రాయుడు (20 నాటౌట్) రాణించటంతో 18.1 ఓవర్లలోనే 159/3తో చెన్నై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. చెన్నైకి ఇది రెండో విజయం కాగా, ముంబయికి ఇది వరుసగా రెండో పరాజయం.

ముగిసిన జిమ్నాస్టిక్స్ పోటీలు

హైదరాబాద్ : 2023 ఇంటర్‌స్కూల్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. జూబ్లీహిల్స్‌లో సియటెడ్ ఫెలిసి స్కూల్‌లో రంగారెడ్డి జిల్లా జిమ్నాస్టిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 200 మందికి పైగా విద్యార్థులు పోటీపడ్డారు. 1-8వ తరగతుల విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహించారు. సోనాక్షి పట్నం, మీలా రెడ్డి, థియ బోపన్నలు పోటీల్లో ఉత్తమ జిమ్నాస్ట్‌లుగా అవార్డులు అందుకున్నారు.



సన్‌రైజర్స్ పుంజుకుంటారా?

- నేడు పంజాబ్‌తో హైదరాబాద్ ఢీ

హైదరాబాద్ : ఐపీఎల్16లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంకా అంచనాలను అందుకోలేదు. ఆడిన రెండు మ్యాచుల్లోనూ పోటీ ఇవ్వకుండానే పరాజయం పాలైంది. మరోవైపు తొలి రెండు మ్యాచుల్లో మెరుపు విజయాలు సాధించిన పంజాబ్ కింగ్స్.. నేడు ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. బ్యాటర్లు, బౌలర్లు మంచి ఫామ్‌లో ఉండటంతో సీజన్లో హ్యాట్రిక్ విజయంపై పంజాబ్ కింగ్స్ కన్నేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ ఓటమి ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు ఏం చేయనుందో ఆసక్తికరం. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రం, స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ సహా మయాంక్ అగర్వాల్, రాహుల్ త్రిపాఠిలు రాణించటంపై సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ ఆధారపడి ఉంది. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్ ఫామ్ కోల్పోయాడు. సఫారీ పేసర్ మార్కో జెన్సన్ రాకతో పేస్ విభాగానికి జవసత్వాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

నవచిత్రం



కె.వి.రమణాచారి, సంజయ్ కిషోర్, వెంకయ్యనాయుడు

ఆ మూడు 'బీ'లు ఉంటేనే వస్తున్నారు..
- వెంకయ్యనాయుడు

రచయిత సంజయ్ కిషోర్ సేకరించి రచించి రూపకల్పన చేసిన 'స్వాతంత్రోద్యమం - తెలుగు సినిమా - ప్రముఖులు' పుస్తకావిష్కర ణోత్సవం హైదరాబాద్‌లోని దస్పల్లా హోటల్లో అతిరథ మహారథుల సమక్షంలో శనివారం ఉదయం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా భారత మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పుస్తకాన్ని విడుదల చేశారు.
ఆయన మాట్లాడుతూ,'తెలుగు సినిమా పరిశ్రమ స్వాతంత్ర్యం రాకముందు నుండి ఉన్నది. అందుకే ఈ పుస్తక రచయిత సంజయ్ కిశోర్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తెలుగు సినిమా ప్రముఖులు, అప్పటి పరిస్థితులు, సినిమాల గురించిన చక్కటి విశ్లేషణ చేశాడు. ఇలాంటి పుస్తకాలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం. ఒకప్పుడు ఒక సభ నిర్వహిస్తున్నామంటే ఎక్కడెక్కడి నుండో ప్రజలు పాల్గొనేవారు. ఇప్పుడు ఏ సభ అయినా నిర్వహిస్తే మూడు బీలు సమకూర్చాలి అంటున్నారు. మూడు బీ-లంటే 'బస్సు- బిర్యానీ- బాటిల్'. ఈ మూడు ఉంటేనే సమావేశాలకు హాజరవుతున్నారు. ఇవన్నీ వింటుంటే మనదేశం ఎక్కడికిపోతుంది అని బాధేస్తుంది. గూగుల్‌ను రిపేర్ చేయాలన్నా గురువే కావాలి. అదీ గురువు గొప్పతనం. ఇటువంటి మంచి పుస్తకాన్ని వీడియో రూపంలో తీసుకురావటానికి సంజయ్ కిశోర్‌ని ప్రయత్నించమని కోరుతున్నా' అని అన్నారు.
కె.వి.రమణాచారి గారు ఆజాదికా అమృత్ మహెూత్సవ్ గురించి చెప్పి.. నువ్వూ ఏదైనా చెయ్ అన్నారు. దీంతో స్వాతంత్ర్యంలో పాల్గొన్న మన సినిమా పెద్దల గురించి రాద్దామని అనుకుని ఈ పుస్తక ప్రయాణం మొదలు పెట్టాను. నేను ఏ కార్యక్రమం చేసినా నన్ను నమ్మి ముందుకు వచ్చే కిమ్స్ అధినేత బొల్లినేని కృష్ణయ్య, సదరన్ ఇంజనీరింగ్ కంపెనీ అధినేత రాజశేఖర్ సాయం చేశారు. ఈ పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించడం హ్యాపీగా ఉంది' అని పుస్తక రచయిత సంజయ్ కిశోర్ చెప్పారు. పుస్తక తొలిప్రతిని శ్రీకర ఆర్గానిక్స్ రాజు లక్షా వెయ్యి నూటవరహాలు రూపాయాలకు కొనుగోలు చేశారు.

మన ఆస్కార్ విజేతలకు దక్కాల్సిన గౌరవం ఇదేనా?





ఇప్పుడు తెలుగు సినిమా వైపు యావత్ ప్రపంచం చూస్తోంది. తెలుగు సినిమాలు సాధిస్తున్న విజయాలు, కథల ఎంపిక తీరు, నటీనటుల నటనా ప్రతిభ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న వైనాన్ని అన్ని చిత్రపరిశ్రమలు సునిశితంగా పరిశీలిస్తున్నాయి. ఇటువంటి వంటి తరుణంలో దక్కిన ఆస్కార్ అవార్డ్ యావత్ భారతదేశంతోపాటు తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా, తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని మరింత పెంచేలా చేసింది. అయితే అంతటి ప్రతిష్టాత్మక అవార్డుని సగర్వంగా తీసుకొచ్చిన విజేతలను మాత్రం అటు పరిశ్రమ, ఇటు రెండు రాష్ట్రప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక కేంద్రప్రభుత్వం సరేసరి. కనీసం వారిని సముచితంగా గౌరవిద్దాం అని ఆలోచన కూడా చేయలేదు.
అయితే ఆలస్యంగా మేల్కొన్న తెలుగు ఫిల్మ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆస్కార్ విజేతలు కీరవాణి, చంద్రబోస్‌లను ఈనెల 9న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఘనంగా సత్కరించ బోతున్నట్టు ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో నిర్మాత కె.ఎస్.రామారావు తన ఆలోచనలను మీడియాతో షేర్ చేశారు.

పరిశ్రమే కాదు.. ప్రభుత్వాలూ చేయాలి

"ఆర్‌ఆర్‌ఆర్'లోని నాటు నాటు.. పాట అంతర్జాతీయ వేదికపై ఆస్కార్ పురస్కారం అందుకోవడం దేశానికే గర్వకారణం. అందులోనూ తెలుగు సినిమాకు దక్కిన తొలి ఆస్కార్ కావడం తెలుగు చిత్ర పరిశ్రమకు ఎంతో ప్రత్యేకం. తెలుగు సినిమాను ఆస్కార్ వేదిక వరకూ తీసుకెళ్లిన కీరవాణి, చంద్రబోస్‌లతోపాటు రాజమౌళి టీమ్‌ని ఘనంగా సత్కరించాలి. ఇది చిత్ర పరిశ్రమ ఒకటే చేయాల్సిన పని కాదు.. తెలుగు సినిమాకు దక్కిన గౌరవంగా భావించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చేయాల్సిన పని' అని సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు అన్నారు. తెలుగు సినిమాకు ఆస్కార్ తీసుకొచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌ను ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి, సినిమా పరిశ్రమకు చెందిన పలు శాఖల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నారు. ఆదివారం జరగనున్న ఈ వేడుకకు శిల్పకళావేదిక వేదిక కానుంది. ఈ సందర్భంగా కె.ఎస్.రామారావు శనివారం ఫిల్మ్ ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.
'చిత్ర పరిశ్రమకు చెందిన అన్నీ అసోసియేషన్లు, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి కట్టుగా ఈ వేడుక చేస్తే బాగుంటుంది. ఈ వేడుకను గొప్పగా చేయడానికి పరిశ్రమలో కొన్ని సంస్థలకు ఆర్థిక వనరులు లేవు. ఫిల్మ్ నగర్ కల్చరర్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సీసీ)లో ఆర్థిక వనరులు బాగా ఉన్నాయి. దానితో కలిసి ఈ వేడుక నిర్వహిస్తే విజేతలను సముచితంగా గౌరవించగలం. వివిధ రంగాల్లో చిన్న అవార్డు, గుర్తింపు సాధిస్తేనే ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు వంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం చేస్తుంటాయి. అలా 'ఆర్‌ఆర్‌ఆర్' కళాకారులకు ప్రభుత్వాలు ఏమన్నా చేయాలి. ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలను పక్కనపెట్టి ఆస్కార్ విజేతలను ఘనంగా సన్మానించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



కె.ఎస్.రామారావు

హీట్ పెంచిన నవతెలంగాణ ఎఫెక్ట్..

ఆస్కార్ విజేతలకు సంబంధించి నవచిత్రంలో ఈనెల 3వ తేదీ ప్రచురితమైన 'మనోళ్లను పట్టించుకోవట్లే..' ఆర్టికల్ ఎఫెక్ట్ పరిశ్రమలో హీట్ పెంచింది. ఈ ఆర్టికల్ ప్రచురితమైన తర్వాతే తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్పందించి ప్రకటన చేయటం విశేషం. అలాగే ప్రభుత్వాలు కూడా కలిసి రావాలని పలువురు నిర్మాతలూ ఘాటుగా స్పందించడం మరో విశేషం.

మీరు మద్దతు ఇస్తే.. ఆ కిరీటం మనదే

పెగాసిస్ వారు నిర్వహిస్తున్న 'మిసెస్ ఇండియా గ్లోబల్' ఫైనల్స్‌కు సినీనటి అంకిత ఠాకూర్ సెలక్ట్ అయ్యారు. ఈ నెల 11న కేరళలోని కొచ్చిలో ఫైనల్స్ జరగనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి 'మిసెస్ ఇండియా గ్లోబల్'కు ఎంపికైన అంకిత ఠాకూర్ శనివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో 'మిస్ ఆసియా' రష్మి ఠాకూర్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అంకిత ఠాకూర్ మాట్లాడుతూ, 'తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ 'మిసెస్ ఇండియా గ్లోబల్' ఫైనల్స్‌కు చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రజలంతా ఓటింగ్ ద్వారా నాకు సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా' అని తెలిపారు.
'మిస్ ఆసియా', తెలంగాణ మా అసోసియేషన్ ప్రెసిడెంట్ రష్మి ఠాకూర్ మాట్లాడుతూ, 'అంకిత ఠాకూర్‌కు నేను ట్రైనీగా ఉన్నాను. కచ్చితంగా తను 'మిస్ ఇండియా గ్లోబల్' క్రౌన్ గెలుచుకుని వస్తుందన్న నమ్మకం ఉంది. మన తెలంగాణను రిప్రజెంట్ చేస్తోన్న అంకిత ఠాకూర్‌కి ఓటింగ్ ద్వారా తెలంగాణతో పాటు తెలుగు ప్రజలంతా సపోర్ట్ చేయండి' అని తెలిపారు.
'అంకిత ఠాకూర్‌కు తెలంగాణ ప్రజలతో పాటు, తెలుగు వారందరూ కూడా ఓట్లు వేసి మద్దతు తెలిపితే ఆమె కచ్చితంగా 'మిసెస్ ఇండియా గ్లోబల్' గెలుచుకుని వస్తుంది. ప్రస్తుతం రష్మి ఠాకూర్, అంకిత ఠాకూర్‌లు హీరోయిన్లుగా రెండు చిత్రాలు నిర్మిస్తున్నాను' అని తెలంగాణ ఫిలించాంబర్ చైర్మన్ డా.ప్రతాని రామకృష్ణగౌడ్ చెప్పారు.



అంకిత ఠాకూర్

ప్రజల వద్దకే సినిమా


సినిమా రిలీజైన రోజు ఇంట్లోనే ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే ఛాన్స్ ఏపీ ఫైబర్ నెట్ కల్పిస్తోందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు 'ప్రజల వద్దకు సినిమా' తీసుకువస్తున్నామని, మారుమూల గ్రామాల్లో ఉన్నవారు కూడా రిలీజ్ రోజే సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నాం' అని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'భారతదేశంలో ఎక్కడా లేని విధంగా నెట్ సేవలను ఏపీలో తక్కువ ధరకు అందిస్తున్నాం. పెద్ద హీరోలకు, నిర్మాతలకు మేము వ్యతిరేకం కాదు. సినిమాను బేస్ చేసుకుని ఫిఫ్టీ-ఫిఫ్టీ రేషియో ఉంటుంది. ఏపీఎస్ఎఫ్ఎల్ పల్లెటూర్లతో ఎక్కువ కనెక్ట్ అయింది. దీనివల్ల మారుమూల గ్రామాల్లో ఉన్న వారు కూడా రిలీజ్ రోజు సినిమా చూసే అవకాశం పుష్కలంగా ఉంటుంది' అని చెప్పారు.
'ఏ రోజు సినిమా రిలీజ్ అవుతుందో.. అదే రోజు పల్లెటూరులో కూడా సినిమా చూడవచ్చనే కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. చిరంజీవి లాంటి పెద్ద హీరో సినిమా కూడా ఫైబర్ నెట్‌లో రిలీజ్ అయితే ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుంది' అని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి తెలిపారు.
ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్, నటుడు అలీ మాట్లాడుతూ, 'ఒక నిర్మాత కష్టపడి సినిమా తీస్తే అది రిలీజ్ రోజునే పైరసీ అయిపోతుంది. ఇండస్ట్రీలో ఉన్న మనం పైరసీని ఎందుకు అరికట్టలేకపోతున్నాము?, పెద్దలందరూ కూడా దీనిపై పోరాడాలి. ఫైబర్ నెట్‌లో రిలీజ్ రోజున సినిమా చూడడం అనేది చిన్న సినిమాకు ఆక్సిజన్ లాంటిది. చిన్న నిర్మాతలు ఫైబర్ నెట్‌లో కచ్చితంగా రిలీజ్ చేస్తారు. పెద్ద నిర్మాతలు కూడా ముందుకు వస్తారని అనుకుంటున్నాను' అని అన్నారు.
నిర్మాత సి కళ్యాణ్ మాట్లాడుతూ,'ఏపీ ప్రభుత్వం నియమించిన పోసాని, అలీ, జోగినాయుడు వల్ల సినిమా ఇండస్ట్రీకి మంచి జరుగుతోంది. ఫైబర్ నెట్‌లో సినిమా రిలీజ్ అనేది చిన్న నిర్మాతకు జగన్ గారిచ్చిన వరం. చిన్న సినిమాకు అసలు థియేటర్స్ ఇవ్వడం లేదు. జనాలు ఓటీటీకి అలవాటు పడ్డారు. ఈరోజు చిన్న నిర్మాతలకు పేదల పాలిట పెన్నిదే ఈ ప్లాట్‌ఫామ్. ఏపీ సీఎం జగన్ విజన్ చాలా పెద్దది. సినిమా ఇండస్ట్రీ అభివృద్ధి కోసం మంచి ఆలోచన చేశారు. చిన్న నిర్మాతలకు గొప్ప అవకాశం ఇచ్చినందుకు సినీ ఇండస్ట్రీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. నిర్మాతలు సైతం దీన్ని వినియోగించుకోవాలి' అన్నారు.



పోసాని కృష్ణమురళి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మనిషితనం ఎందుకిలా



వసంతకాల పు కోకిల గానం
కాకుల రొదలా ఉంది
కోయిల గాన కోమలత్వం ఏమయిందో
పరిమళాలు వెదజల్లాల్సిన పూదోటలో
ఏదో గంజాయి వాసన ప్రమాదం పొంచి ఉంది

మల్లెతీగలన్ని ముళ్లపొదలుగా
పారిజాతాలన్ని పల్లేరులుగా మారుతున్నాయ
మానవులు తయారవ్వాల్సిన ఫ్యాక్టరీలో
ఎందుకో మారణాయుధాలు తయారవుతున్నాయి

మాలతీ లతలు పందిరినెక్కడానికి
ఎందుకో భయపడుతున్నాయి
పందిరి మాటున పొంచి ఉన్న
పైశాచికత్వం గుర్తించింది కాబోలు

గులాబీలు తుమ్మముల్లను
అరువు తెచ్చుకుంటున్నాయి
ఆత్మ పరిరక్షణ కోసం
అవలంబించాలి యుద్ధనీతి

దీపంలా వెలగాల్సిన ఇల్లు
చితిమంటల్లో చిక్కుకుంది

ఆఖరి పుల్ల వేస్తూ ఆజ్యం పోస్తూ
నిప్పును రాజేసే కుటిలత్వం నీడలో

మంచుకొండలా చల్లగా ఉండాల్సిన మనిషితనం
ఎందుకనో లావాలా జ్వలిస్తుంది

నేనెందుకనో గడ్డకట్టుక పోతున్నాను
రేపెప్పుడైనా అగ్నిపర్వతంలా జ్వలించి
లావాలా స్రవించాలి కాబోలు

- బి.అంజనీ దేవి, 9908962730



నేను కవిని కాను


నేను కవిని కాను
నా ఆలోచనలకు విడిది
నవ రంజిత కవనం కాదు
నయవంచిత జీవనం......
నేను కవిని కాను
నా కలం వెలువరించేది
నల్లని సిరాక్షరావళి కాదు
పల్లవించే రుధిర సాక్షావళి......
నేను కవిని కాను
తెల్లని కాగితంపై చెల్లని అక్షరాలను సొగసుగా పరువలేను
పీడిత జన మనోక్షేత్రంలో విప్లవాక్షరాలను గడుసుగా
పొదవగలను.....
నేను కవిని కాను
నా కలంలో ప్రవహించేది చప్పటి సిరా చుక్క కాదు
నేలకొరిగిన వీరుల పౌరుష నెత్తుటి ధార......
నేను కవిని కాను
నా చేతులు నా గమనంలో ఎదురొచ్చినా ప్రియురాలి
నడుమును తాకలేదు

గమ్యం చేరాక
ఎదురు నిలిచిన వీరుల
చేతి కొడవళ్ళను ముద్దాడాయి.........!!!

- ఎం. కురుమయ్య యాదవ్
7799553493



ధైర్యం.. సాహసం.. లక్ష్మి



ఆమె, ఇద్దరు పిల్లలు, భర్తతో కలిసి ఊరొదిలి పట్నం వచ్చింది. భర్త వాచ్‌మన్. ఆమె ఇండ్లలో పనిచేసేది. ఉన్నంతలో సర్దుకుపోయే గుణం. ఇంతలో కరోనాతో భర్త మరణం. ఒక్కసారిగా నెత్తిన పిడుగుపడ్డట్టు అయింది. బతుకంతా ఆగమైంది. పిల్లల భవిష్యత్తు కండ్ల ముందు కదలాడింది. ఉక్కు సంకల్పంతో పిడికిలి బిగించి కదిలింది. కష్టాల కడగండ్లు తోక ముడిచాయి. జీవితపు ట్రాఫిక్ సుడిగుండాలను దాటిన ఆమెకు మహానగరం ట్రాఫిక్ పద్మవ్యూహం ఒక లెక్కనా! డ్రైవింగ్ నేర్చుకుంది. మన మహానగరంలో గెలుపు దిశగా దూసుకెళ్తున్న క్యాబ్ డ్రైవర్ దండు లక్ష్మి పరిచయం ఈ వారం జోష్.

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపాడు చెందిన దండు లక్ష్మి ఊళ్లో పొలం పనులకు పోతుండేది. భర్త సత్తయ్య దుకాణంలో పని చేసేటోడు. ఇట్ల బతుకుడు కష్టమని ఊరు ఇడిసిపట్నం వచ్చిన ఆ జంట నగరంలో పడని కష్టం లేదంటే నమ్మరు. కొత్తలో భర్త అడ్డమీద కూలికి పోతుండె. పని దొరికిన నాడు తిండి తినేది. లేకపోతే పస్తుండేటోళ్లు. కొన్నాళ్లకు ఆయనకు నేరేడ్‌మెట్‌లో ఒక కట్టె మిషిన్ కాడ వాచ్‌మన్ నౌకరి దొరికింది. ఉండనీకె ఒక చిన్న గది ఇచ్చింద్రు. అక్కడే ఉంటూ చనీళ్లకు వేడ్నీళ్ల తోడన్నట్టు చుట్టుపక్కల ఇండ్లకు పనికి పొయ్యేది. మొదలు రెండిండ్లు. తర్వాత ఇంకో నాలుగిండ్లు.

అలా బట్టలుతికి, బాసన్లు తోమి నెలకు పదివేల దాక సంపాదించేది. పొద్దున ఐదింటికి పనికి పోతే ఎనిమిదింటికి వచ్చి వంటచేసి, పిల్లల్ని బడికి తోలి. ఆ పైసల్లో నెలకు కొన్ని పైసలు దాచిపెట్టి...కొన్ని రోజులకు ఒక స్కూటీ కొన్నారు. సైకిల్ నడపనీకె భయపడే భర్తను స్కూటీ నేర్చుకొమ్మని ఎంత బతిమలాడినా ఒప్పుకోలే. చేసేదేంలేక కష్టపడి తానే నేర్చుకుంది. అందరిలెక్కనే స్కూటీమీదనే పిల్లలను స్కూల్‌కు తీస్కపోవుడు.. తీస్కరావుడు. 'పొచి పనిచేసేది కూడా స్కూటీ నడపవట్టె' అనే నోళ్లను పట్టించుకునేదే లేదని పట్టుబట్టి కారు నడుపుడు నేర్చుకుంది. ఇప్పుడు అదే కుటుంబానికి ఆధారమైంది.

ఉబర్ ఇచ్చిన అవకాశం

ఈ కష్టాల సంసారాన్ని చూసి జాలి పడిన ఒక పెద్దమనిషి కారు కొని కిరాయికి తిప్పితే మస్తు పైసలొస్తయ్ అని చెప్పిండు. అందులోనూ పెద్ద కారైతే మరి మంచిదన్నడు. కారు, కిరాయి గోల తెలియకపోయినా ఆ మనిషి మాటలు నమ్మింది. గిన్నెలు తోమి కూడబెట్టుకున్న పైసలతో సెవెన్ సీటర్ కారు కొన్నది. కారు ఖరీదు రూ.10 లక్షలు. లక్షన్నర బయానా పోగా. మిగతాది కిస్తీ కట్టాలని ధైర్యం చేసి అడుగు ముందుకేసింది. నెలకు ఇరవై అయిదువేలు కిస్తీ కట్టాలి. ఎట్లా మరి. ఎవరో ఒకరిని నమ్మాలి. లేకపోతే తెల్ల ఏనుగును ఇంటి ముందర పెట్టి కూసుంటే కిస్తీ పైసలేడికెళ్లి తేవాలి? అందుకే ఒకాయనను నమ్మి కారు లీజ్‌కు ఇచ్చింది. అతడు ఒక్క నెలలో పదకొండువేల కిలోమీటర్లు తిప్పిండు. ఒక్క రూపాయి కూడా ఇయ్యకుండా మా ఇంటికాడ కారు పెట్టి పరారు అయ్యాడు. నిలువునా మోస పోయారు. లక్షలు పెట్టి తీసుకున్న కారు ఇంటికాడ ఉట్టిగ పడి ఉండటం చూసి గుండె ఆగినంత పనైంది వాళ్లకు.

ఒకరోజు వరుసకు తమ్ముడొకడు వాళ్లింటికి వచ్చిండు. 'ఇంటిముందు కారు పెట్టుకొని అట్లా పరేషాన్ అయితే ఏం లాభం అక్కా? ఉబర్‌లో పెడితే బాగనే గిట్టుబాటు అయితుంది' అన్నడు. ఆ మాటలు కొంత ధైర్యాన్నిచ్చాయి. డ్రైవింగ్ నేర్చుకున్నప్పుడే లైసెన్స్ తీసుకున్నదే కానీ, కారు నడుపుడు అంత సులువు కాదు. అది పెద్దకారు నాతోని అయితదా భయం వెంటాడింది. భయంభయంగా ఉబర్ ఆఫీసు మెట్లు ఎక్కింది. 'ఒక మహిళ డ్రైవింగ్ చేస్తానంటూ సొంత కారుతో వచ్చినందుకు సంతోషంగా ఉంది. మిమ్మల్ని అభినందిస్తున్నాం' అన్నరు అక్కడి సార్లు. అలా ఉబర్‌లో కారు నడుపుడు మొదలుపెట్టింది ఆమె. విరామం లేకుండా 8-9 గంటలు కారు నడిపేది. దాంతో ఉబర్ కమిషన్, వేహికల్ రెంట్, ఇతర డీజిల్ ఖర్చులు పోనూ రోజూ ఆమెకు 2వేల రూపాయలు గిట్టుబాటు అయ్యేది. బతుకు మారుతోందిని కలలు కన్నది.

మళ్లీ చీకట్లు ముసిరాయి

ఇంతలో లాక్‌డౌన్ పెట్టింద్రు. మళ్లీ వాళ్ల బతుకులు ఆగమైనయ్. కరోనాతో వాళ్ల ఆయన చచ్చిపోయిండు. బతుకంతా చీకట్లు ముసిరాయి. ఇవేమి పట్టని బ్యాంకోళ్లు ఫోన్లు చేసి కిస్తీ కట్టమని సతాయించుడు షురు చేసింద్రు. ఇక లాభం లేదని కారు అమ్మకాని పెట్టాలని నిర్ణయానికి వచ్చింది. అమ్మితే బాగానే ఉంటుంది. కానీ, రేపెట్లా బతికేది? ఇంతదాకా వచ్చి మళ్లీ ఇండ్లల్ల పనికి పోతే ఓడిపోయినట్టే. ఇన్ని సంద్రాలు దాటిన ఆమె ఓటమిని అంగీకరించడానికి ఏమాత్రం ఇష్టపడలేదు. క్యాబ్ డ్రైవర్ల యూనియన్ చైర్మన్ సలావుద్దీన్‌కు తన గోడు వెల్లబోసుకుంది. తలా ఇన్ని పైసలు వేసుకొని ఆ రెండు నెలల కిస్తీ వాళ్లే కట్టింద్రు. అలా భర్త పోయిన బాధనుంచి బయటపడి రెండు నెలల తర్వాత మళ్లీ డ్యూటీల చేరింది.

మరి.. చిన్ని చిన్న కష్టాలు, ఇబ్బందులకే ఆత్మహత్యాయత్నం చేస్తూ జీవితాలను ఆగం చేసుకుంటున్న వారు.. లక్ష్మికి వచ్చిన కష్టాలు, వాటి నుంచి ఆమె ఎట్లా బయటపడిందో అవగాహన చేసుకోవాలి. ఎట్లాంటి కష్టం వచ్చినా బతకాలన్న ఆశ, ఏదైనా కొత్తగా సాధించాలన్న తపన ఉంటే ఏదీ అసాధ్యం కాదని నిరూపించిన లక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలి.



వెలుగులు నింపిన రోజు

ఉబర్‌తో మళ్లీ ప్రయాణం మొదలుపెట్టిన లక్ష్మి జీవితం నాలుగు చక్రాలపై సయ్యంగా నడవడానికి చాలా సమయం పట్టింది. అలా బతుకు బండి నడుపులున్న ఆమె జీవితంలో ఆరోజు నిజంగా వెలుగులు నింపింది. ఒకరోజు ట్యాంక్‌బండ్‌కు ఆమె కార్ బుక్ అయ్యింది. ఒక మేడం, కొందరు పిల్లలు ఎక్కిను. లక్ష్మిని డ్రైవర్ సీట్ లో చూసి వాళ్లు ఆశ్చర్యపోయారు. ఆ కొద్ది ప్రయాణంలో ఆమె కథంత విన్న ఓ సామాజిక కార్యకర్త ఆ ప్యాసింజర్ (హిమబిందు) సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు లక్ష్మిని ప్రపంచానికి పరిచయం చేసింది. ఆమే పెద్ద కంపెనీలో కారు కిరాయికి పెట్టించింది. పిల్లలిద్దరిని మంచిగా చదివిస్తోంది.

ఎక్కడికీ పయనం.....

మట్టి కుండలాంటిదిరా మనసు
ఆరిపోయే దీపమురా వయసు..
నిండుకుండ కోసమేరా అన్వేషి.
నిండుకుంటే పోయేనురా ఈ మనిషి.

కూడలి కదలి మధ్య సాగేరా జీవితం
కాటికి చేరే వరకు ఆగదురా పయనం
కన్నుమిన్ను కానరాని కుటిల కఠిన లోకంలో
కన్నుమూసి తెరిసేలోపు మాయంరా ఈ క్షణం..

నన్ను నేను వెతుక్కుంటూ సాగిపోతున్నా...
సర్వసిద్ధికై సాహసిస్తున్నా..
నడిచే దారిలో నేలకొరిగితే మైలురాయి నేనౌతా.
గమ్యం చేరితే పరుల గమనాన్నౌతా...

- సామల ఫణి కుమార్
9989735040



ఒకటిగా నడిచేందుకు ...

ఒక రిలేషన్ షిప్ కంటిన్యూ కావడమనేది వాళ్ల మధ్య ఉన్న అనుబంధం, అవగాహనపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. అయితే, ఏ రిలేషన్ షిప్ లోనైనా ఛాలెంజెస్ తప్పవు. ఎక్స్ పెక్టేషన్స్ కూడా ఇద్దరినీ ఒత్తిడిలోకి నెట్టేస్తాయి. నీది.. నాది.. అనే ఫీలింగ్ సమస్యల్ని తెచ్చిపెడుతుంది. వాటిని నేర్పుగా ఎదుర్కొంటూ ఒకటిగా నడవడం చాలా ముఖ్యం.



దంపతుల మధ్య చికాకులు, కోపాలు, అలకలు వంటివి సహజమే. అయితే ప్రతిసారీ అప్పటికప్పుడు క్షమాపణలు అడిగి పరిస్థితిని చక్కదిద్దుకోవడం అలవాటైతే ఇది శాశ్వత పరిష్కారం కాదు కదా. నాలుగైదుసార్లు ఇలా సారీ చెప్పినా.. అయిదోసారి భాగస్వామికి నమ్మకం కలగకపోవచ్చు. మంచి అభిప్రాయం దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. ప్రతిసారీ ఎందుకిలా జరుగుతోంది. దీనికి కారణమేంటి అని ఆలోచించి, అలా మరోసారి జరగకుండా జాగ్రత్త పడటానికి ప్రయత్నిస్తే ఎవరి వైపు నుండి వారు ప్రయత్నం చేయాలి. అప్పుడే శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఇరువురూ కాసేపు కూర్చుని ఎందుకిలా చిన్నచిన్న విషయాలకు గొడవ పడాల్సిన అవసరమేంటి అని మృదువుగా చర్చించుకోవాలి. దానివల్ల కలిగే చికాకుతో సంతోషం దూరమవుతుందనే నిజాన్ని ఇరువురూ గుర్తించగలిగితే చాలు. ఒకరిపై మరొకరు అనవసరపు కోపాన్ని ప్రదర్శించాల్సిన సందర్భం రాదు.

మాట్లాడితే..

కారణమేదైనా అవతలివారిపై మనసులోని కోపాన్ని ప్రదర్శించడం కన్నా, వెంటనే దాని గురించి మాట్లాడితే చాలు. కొందరు చిన్న చిన్న విషయాలకే రోజుల తరబడి మాట్లాడకుండా భాగస్వామిని బాధిస్తుంటారు. సమస్య ఏంటో అవతలివారికి చెబితేనే పరిష్కారం దొరుకుతుంది. ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకుంటే అసలు జరిగిందేంటో తెలుస్తుంది. ఊహలకు తావు లేకుండా నిజాన్ని గుర్తించొచ్చు. అప్పుడు కోపం దూదిపింజలా ఎగిరిపోతుంది. లేదంటే ఎన్ని రోజులైనా ఇరువురి మధ్య నిశ్శబ్దం ఏర్పడి ఇంటి వాతావరణంపై ప్రభావం చూపుతుంది. పిల్లలుంటే వారిపై చిన్నతనంలోనే ఎంతటి ప్రభావం పడుతుందో అర్థం చేసుకోవాలి.

నమ్మకం..

ఒకరిపై ఒకరికి పూర్తి నమ్మకం ఉండాలి. నమ్మకమే లేకపోతే ఆ బంధమే బలపడదు. ఎదుటివారిపై కోపం రావడానికి అపనమ్మకం ఒక పెద్ద కారణం.

భార్యాభర్తలిద్దరూ ఒకరిపై ఒకరికి నమ్మకాన్ని కలిగించడమే కాదు, పూర్తిగా ప్రేమించడం మొదలుపెడితే చాలు. వారి బంధం ఎప్పటికీ బలంగా ఉంటుంది. ఒకరికొకరు ఎక్కువ సమయాన్ని కేటాయించడం, కలిసి సంతోషంగా ఆ రోజు విశేషాలను చెప్పుకోవడం, ఇరువురూ ఎదుటివారిపై బాధ్యతవహించడం, వారి బాధ్యతలను పంచుకోవడం వంటివన్నీ కోపతాపాలను దరికి రానివ్వవు. ఆ బంధం మరింత ధృడంగా సంతోషంగా సాగుతుంది.



బిజినెస్

ఐసీఐసీఐ బ్యాంక్ స్కాంలో చార్జిషీట్

- ముగ్గురిపై సీబీఐ దాఖలు



ముంబయి: ఐసీఐసీఐ బ్యాంక్ - వీడియోకాన్ క్విడ్ ప్రోకో కుంభ కోణంలో సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్ సహా వీడియోకాన్ వ్యవ స్థాపకులు వేణుగోపాల్ దూత్‌లపై ముంబయి సివిల్ సెషన్స్ కోర్టులో సీబీఐ శనివారం చార్జిషీట్ దాఖలు చేసింది. ఐపీసీ సెక్షన్ 120-బి, 409, అవినీతి కేసులను నమోదు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీడియోకాన్‌కు రూ.3,250 కోట్ల అప్పులిచ్చి.. తన భర్త కంపెనీకి మేలు జరిగేలా చందా కొచ్చర్ వ్యవహరించిన విషయం తెలిసిందే. 2009, 2011 మధ్య వీడియోకాన్ గ్రూపునకు చెందిన ఆరు కంపెనీలకు రూ.1,875 కోట్ల టర్మ్ రుణాన్ని మంజూరు చేయడంలో అవకతవకలు జరిగాయని సీబీఐ విచారణలో తేలింది. క్విడ్ ప్రోకో క్రింద వీడియోకాన్ గ్రూపునకు రుణాలు మంజూరైనట్టు గుర్తించింది. ఇందులో ధూత్ ప్రధాన లబ్ధిదారుడిగా ఉన్నారు. ఇందుకుగాను దీపక్ కొచ్చర్‌కు చెందిన నూపవర్ రెన్యూవబుల్స్ లిమిటెడ్‌కు రూ.64 కోట్లు, దక్షిణ ముంబయిలోని ఫ్లాట్‌కు 2016లో రూ. 5.25 కోట్లు లంచంగా ముట్టాయని సీబీఐ ప్రధాన ఆరోపణ. ఈ క్విడ్‌ప్రోకో కేసుపై 2019లో తొలిసారి ఎఫ్ఐఆర్ నమోదైంది. 2022 డిసెంబర్‌లో కొచ్చర్ దంపతులను, వేణుగోపాల్ ధూత్‌లను సీబీఐ అరెస్టు చేసింది. జనవరి రెండో వారంలో ఆ ముగ్గురికి బెయిల్ లభించింది. ఈ కేసు వల్ల చందా కొచ్చర్ ఉద్యోగం ఊడటంతో పాటుగా ఆమె అప్పటి వరకు సంపాదించుకున్న ప్రతిష్ట ఒక్కసారి గంగలో కలిసి పోయింది. ప్రయివేటు బ్యాంకులపై నమ్మకం సన్నగిల్లేలా చేశారని తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు.

రూ.23 లక్షల కోట్ల ముద్రా రుణాల జారీ

- మంత్రి సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ : ఎనిమిదేండ్లలో రూ.23.2 లక్షల కోట్ల ముద్రా రుణాలు జారీ చేసినట్టు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. చిరు వ్యాపారుల కోసం ముద్రా పథకం ప్రారంభించి ఎనిమిదేండ్లు అవుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దీని వల్ల 40.82 కోట్ల మంది లబ్ధి పొందారని తెలిపారు. వారిలో 51 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారని పేర్కొన్నారు. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారికి, వ్యాపార విస్తరణకు ఆర్థిక చేయూతను అందించేందుకు రూ.10 లక్షల వరకు తనఖా లేని రుణాలను అందిస్తున్నట్టు తెలిపారు.

బిగాస్ నుంచి ఇవి సీ-12 విడుదల

హైదరాబాద్ : బిగాస్ ఆటో కొత్తగా సీ-12 స్కూటర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే డి15, బి8, ఎ2 ఇవిల విజయ బాటలో సి12ను ఆవిష్కరించినట్టు తెలిపింది. ఈ ప్రీమియం స్కూటర్ అత్యంత శక్తివంతంగా ఉండటంతో పాటుగా ఆకర్షణీయంగా, అత్యంత అందుబాటు ధరలో లభ్యం కానుందని తెలిపింది. 20కు పైగా భద్రతా ఫీచర్లతో దీన్ని ఆవిష్కరించినట్టు వెల్లడించింది. ఒక్కసారి చార్జింగ్‌తో 143 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని తెలిపింది. దీని పరిచయ ధర రూ.97,999గా ప్రకటించింది.

టామీ హిల్ఫైయర్ ప్రచారకర్తగా సమంత



హైదరాబాద్ : మోవాడా గ్రూపునకు చెందిన టామీ హిల్ఫైయర్ తన కొత్త బ్రాండ్ అంబాసీడర్‌గా ప్రముఖ నటీ సమంతను నియమించుకుంది. ఈ సంస్థకు చెందిన మహిళల చేతి గడియారాలకు సమంత ప్రచారం కల్పించనున్నారు. స్ప్రింగ్ సమ్మర్ 23 క్యాంపెయిన్లో సమంత దర్శనమివ్వ నున్నారని ఆ సంస్థ పేర్కొంది. టామీ హిల్ఫైయర్‌కు సమంత బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరించడంపై మోవాడా గ్రూపు ప్రెసిడెంట్ రిచర్డ్ సీజర్ హర్షం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో పెరిగిన గృహ అమ్మకాలు

హైదరాబాద్ : నగరంలో గృహాల అమ్మకాలు పెరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ప్రస్తుత ఏడాది మార్చిలో హైదరాబాద్‌లో రూ.3,352 కోట్ల విలువ చేసే నివాసాల అమ్మకాలు జరిగాయని తెలిపింది. మొత్తంగా 6,414 గృహాలు రిజిస్ట్రర్ అయ్యాయనీ, క్రితం నెలతో పోల్చితే 12 శాతం పెరుగుదల అని పేర్కొంది. 2022 మార్చి మాసం అమ్మకాలతో పోల్చితే మాత్రం 5 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. విలువ పరంగా 7 శాతం పెరుగుదల నమోదైంది. అందులో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని నివాసాల అమ్మకాలను పరిగణలోకి తీసుకుని ఈ రిపోర్ట్‌ను రూపొందించింది. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.25 లక్షల దిగువన ఉన్నవి 19 శాతం కాగా.. రూ.25-50 లక్షల మధ్య నివాసాలు 55 శాతంగా ఉన్నాయి.

రస్నా సృష్టికర్తకు అరీజ్ ఫిరోజ్‌కు పద్మశ్రీ పురస్కారం



హైదరాబాద్ : రస్నా గ్రూపు వ్యవస్థాపకులు, చైర్మెన్ దివంగత అరీజ్ ఫిరోజ్ షా ఖంబాటాకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఆయన మరణాంతరం ఈ అవార్డు పొందారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. వాణిజ్యం, పరిశ్రమల రంగంలో ఆయన సేవలకుగానూ ఈ అవార్డును ఫిరోజ్ తరఫున ఆయన భార్య పెర్సిస్ అరీజ్ ఖంబాటా, కుమారుడు ఫిరుజ్ అరీజ్ ఖంబాటా రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించారు.

సింక్రోనీ బాస్ హైదరాబాద్ పర్యటన



హైదరాబాద్: దిగ్గజ కన్స్యూమర్ ఫైనాన్సియల్ కంపెనీ సింక్రోనీ ప్రెసిడెంట్ బ్రియాన్ డబుల్స్ హైదరాబాద్ లో పర్యటించారు. నగరంలోని సలార్‌పురియా సత్వ నాలెడ్జ్ సిటీలో ఐక్యతకు చిహ్నంగా మైక్రోకార్ప బొన్సాయ్‌ను నాటారు. ఆయనతో పాటు సలార్పురియా సత్య నాలెడ్జ్ సిటీ జీఎం సుధాన్షు భరద్వాజ్, సింక్రోనీ ఇండియా ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కంభంపాటి, ఎస్‌వీపీ బిజినెస్ లీడర్, ఆండీ పొన్నేరి ఉన్నారు.

రూ.85వేల కోట్ల మొబైల్ ఫోన్ల ఎగుమతి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో భారత్ నుంచి రూ. 85,000 కోట్ల విలువ చేసే మొబైల్ ఫోన్ల ఎగుమతులు జరిగాయని ఇండియా సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) వెల్లడించింది. ఉత్పత్తి ప్రోత్సాహక అనుసంధాన పథకం వల్ల ఈ రంగానికి మద్దతు లభించిందని తెలిపింది. స్థూల ఎగుమతుల వృద్ధితో పోల్చితే స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రెట్టింపు అయ్యాయి.

ముఖ్యంగా యుఏఈ, అమెరికా, నెథర్లాండ్స్, బ్రిటన్, ఇటలీ దేశాలకు ఎక్కువ ఎగుమతులు జరు గుతున్నాయని ఐసీఈఏ తెలిపింది. భారత మొబైల్ ఎగుమతుల్లో ఈ ఐదు దేశాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. దేశంలో అమ్మకాలు జరుగుతున్న మొత్తం స్మార్ట్‌ఫోన్లలో 97 శాతానికి పైగా భారత్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. లక్ష కోట్ల ఎగుమతులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐసీఈఏ తెలిపింది.

నూతన ఆవిష్కరణల కోసం

మంత్రి కేటీఆర్ విజన్ అద్భుతం

'టీ హబ్ , టీ-వర్క్స్' ను సందర్శించిన ఎన్నారైల బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రవాస తెలంగాణ సంస్థల ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, థియేటర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుర్మాచలంతో కలిసి హైదరాబాద్‌లోని 'టీ హబ్, టీ-వర్క్స్' ను సందర్శించారు. వినూత్న ఆవిష్కరణలతో వచ్చిన స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఏర్పాటైన ఈ రెండు సంస్థలు దేశానికే గర్వకారమనీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ విజన్ ఎంతో అద్భుతమని ప్రశంసించారు. వాటిని సందర్శించిన వారిలో ఎన్నారై బీఆర్ఎస్ , తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్), ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ (అటై) నాయకులు, ప్రతినిధులు ఉన్నారు. భారతదేశంలో అంత్రప్రెన్యూర్‌షిప్ (వ్యవస్థాపకత), ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా, యువత తమ వినూత్న ఆలోచనలను ఆవిష్కరించేందుకు పలు సంస్థలను ఏర్పాటు చేసిందని అనిల్ ఈ సందర్భంగా తెలిపారు. ఎంతోమంది ఔత్సాహిక యువత పారిశ్రామిక వేత్తలుగా మారేందుకు సిద్ధమవుతున్నారనీ, వారందరికీ ఇవి ఒక చక్కని వేదికల్లా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఉత్సాహం ఉన్నవారిని ప్రోత్సహించి, వారి సంస్థలు విజయవంతం అయ్యేందుకు తోడ్పాటునంది స్తున్నారని వివరించారు.

ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన ఆలోచనలకు ఊతం ఇచ్చేలా టి.హబ్, టి.వర్క్స్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. స్టార్టప్‌లు సాఫీగా తమ కార్యకలాపాలను నిర్వహించేందుకు అనుకూల వాతావరణం టీ-హబ్‌లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్ రెడ్డి, హరిగౌడ్ నవపేట్, సుప్రజ పులుసు, జాహ్నవి దూసరి, రవి ప్రదీప్ పులుసు, జెల్లా శ్రీకాంత్, అనిల్ బైరెడ్డి, మార్తినేని గూడెం సర్పంచ్ రాము బండమీది, తిరుమందాస్ నరేష్, రాజేష్ శమకురా, రాజు గౌడ్, వినయ్ గౌడ్ బత్తిని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో

ముమ్మరంగా కంటి వెలుగు శిబిరాలు..

రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి కంటి పరీక్షలు ....

- 16,33,988 మందికి కండ్లద్దాల పంపిణీ..
- సమాచార, పౌర సంబంధాలశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజల జీవితాలలో కొత్త కాంతులు వస్తున్నాయి. కంటి సమస్యలతో బాధపడే వారి ఇబ్బందులను తొలగించేందుకు సీఎం కేసీఆర్ ప్రారంభించిన ఆయా శిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు నగరాలు, పట్టణాలకు, ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో జనావాసాల వద్ద శిబిరాలు నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు క్యాంపులకు యువతీ, యువకుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. వయస్సుతో నిమిత్తం లేకుండా జనాలు క్యాంపులకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. కంటి వెలుగు క్యాంపుల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, అధికారులు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రజలు కంటి వెలుగు క్యాంపుల వద్ద సకాలంలో చేరుకునే విధంగా ముందస్తుగా అవగాహన కల్పించి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తూ క్యాంపు జయప్రదమయ్యేలా కృషి చేస్తున్నారు. కంటి పరీక్షల నిర్వహణ లో వచ్చే ఖర్చుకు భయపడో, అవగాహన లేక పరీక్షలు చేయించుకోని వారికి ఈ కార్యక్రమం ఒక వరంలా మారిందనీ, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందించడం తో ప్రజలు సంబరపడుతున్నారని అర్వింద్ కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు కోటి మంది ప్రజలకు 1,500 వైద్య బందాలతో కంటి పరీక్షలు నిర్వహించారు. రెండో విడతలో ఇప్పటి వరకు కోటి మందికిపైగా కంటి పరీక్షలు చేయగా, 64.07 శాతం లక్ష్యాన్నిచేరుకున్నారు. ఇందులో 47,70,757 మంది పురుషులు, 53,85,293 మంది స్త్రీలు, 3,360 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 16, 33,988 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేయగా, 12,31,523 మందిని ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కోసం గుర్తించారు. 72,99,858 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాల్లో ఉన్న బఫర్ బృందాలతో ఉద్యోగులకు, జర్నలిస్టులకు, పోలీసులకు, న్యాయవాదులకు, వివిధ వర్గాల వారికి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇంటర్నెట్ నిలిపివేత విధానాలను సమీక్షించండి

కేంద్రానికి 300 అంతర్జాతీయ సంస్థల వినతి



న్యూఢిల్లీ : భారత్‌లో ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించిన చట్ట, నియంత్రణా పరమైన విధానాన్ని సమీక్షించాలని 105 దేశాలకు చెందిన 300 సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బహిరంగ లేఖ రాశాయి. దేశంలో 2016 నుంచి ఇంటర్నెట్ సంస్థలు అందిస్తున్న సేవల్లో 58 శాతం సేవలు నిలిచిపోయాయని ఆ దేశాలు గుర్తు చేశాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలా జరిగిందని ఎత్తిచూపాయి. ఇండియా సివిల్‌వాచ్ ఇంటర్నేషనల్, ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ ఇన్ ఇండియా, జర్నలిజం వాచ్‌డాగ్ పాత్రికేయులు సహా పలు పౌర హక్కుల సంఘాలతో కలిసి ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు వ్యతిరేకంగా ఈ అంతర్జాతీయ సంస్థలు పనిచేస్తున్నాయి. విద్య, ఆరోగ్యం, ఇతర కీలక అంశాలపై సమాచారం తెలుసుకోవాలని ఇంటర్నెట్‌ను వెతకడం ప్రారంభం కాగానే ఆ సేవలు ఆగిపోతున్నాయని అవి గుర్తు చేశాయి. ఎంతో కొంత సంపాదన కోసమో లేదా సమాచారం ఇచ్చి పుచ్చుకునేందుకో ఇంటర్నెట్‌ను వెతకడానికి ప్రయత్నిస్తే అది మొరాయిస్తోందని తెలిపాయి. భారత్‌లో 2022లో 84 ఇంటర్నెట్ సేవలను నిలిపి వేశారని ఆ లేఖలో ప్రస్తావించారు. ఇంటర్నెట్ సేవల నిలిపివేత కారణంగా భారత్ గత సంవత్సరంలో 184.3 మిలియన్ డాలర్ల మేర నష్టపోయిందని ఒక అధ్యయనం తెలిపింది. 12 కోట్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

అదానీపై జేపీసీ ఎందుకు ?

అందులో అధికార పార్టీ సభ్యులెక్కువుండే అవకాశం

- అలాగైతే నిజం బయటకు రావడం కష్టం
- సుప్రీం కోర్టు న్యాయమూర్తుల కమిటీతో విచారించాలి : ఎన్సీపీ అధినేత శరద్‌పవార్

న్యూఢిల్లీ : అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక విషయంలో భాగస్వామ్యపక్షమైన కాంగ్రెస్ అభిప్రాయంతో ఎన్సీపీ అధినేత శరద్ పవార్ విభేదించారు. అదానీకి అత్యధిక వాటాలున్న ఎన్డీటీవీకి ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ అన్ని విషయాలు తెలుసుకోకుండా కొందరు వ్యక్తులు అదానీ విషయంలో రాద్ధాంతం చేస్తున్నారనీ, పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేశారని అన్నారు. 'అదానీపై ప్రకటన చేసిన హిండెన్‌బర్గ్ గురించి మనం గతంలో ఎప్పుడూ వినలేదు. దీనిపై జరిగిన రచ్చ కారణంగా దేశ ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో పడింది. ఇలాంటి వాటిని ఉపేక్షించకూడదు. దేశంలోని ఒక పారిశ్రామిక గ్రూపును లక్ష్యంగా చేసుకున్నారు' అని పవార్ చెప్పారు. ఈ వ్యవహారంపై జేపీసీ కాకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నియమించే కమిటీ విచారణ జరపడం ముఖ్యమని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జేపీసీ విచారణ ప్రారంభమైతే ప్రతిరోజూ మీడియాలో కథనాలు వస్తాయనీ, దీనిపై సుమారు నాలుగు నెలల పాటు అంతటా చర్చ జరగాలని కొందరు కోరుకుంటారని అన్నారు. దానివల్ల నిజం ఎప్పటికీ బయటికి రాదని చెప్పారు. పైగా పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేస్తే దానిపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. 'అధికార పార్టీకి వ్యతిరేకంగా జేపీసీ వేయాలని మనం డిమాండ్ చేస్తున్నాం. అధికార పార్టీ సభ్యులు ఎక్కువగా ఉండే కమిటీ విచారణ జరిపితే నిజం ఎలా బయటికి వస్తుంది?' అని పవార్ ప్రశ్నించారు. మోడీని లక్ష్యంగా చేసుకొని అదానీ, అంబానీలను విమర్శించడం సరికాదని చెప్పుకొచ్చారు.

అయితే ఎన్సీపీ అభిప్రాయాలు దానికి ఉంటాయనీ, అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలు వాస్తవాలు, తీవ్రమైనవని 19 పార్టీలు అభిప్రాయపడుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే విషయంలో మాత్రం ఎన్సీపీ సహా అన్ని పార్టీలూ ఏకాభిప్రాయంతో ఉన్నాయని చెప్పారు. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు) నాయకుడు సంజయ్ రౌత్ మాట్లాడుతూ పవార్ వ్యాఖ్యలు ప్రతిపక్షాల ఐక్యతకు ఎలాంటి విఘాతం కలిగించబోవని అన్నారు.

అధికారిక కార్యక్రమాల్లో మోడీ రాజకీయాలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని మోడీ రాజకీయాలు మాట్లాడారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శనివారం హైదరాబాద్ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేభారత్ రైళ్లను మోడీ ఎన్నిసార్లు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఆదానీ అవినీతి సంగతేంటని నిలదీశారు.

రాష్ట్రం అభివద్ధి కాకుంటే కేంద్రం అవార్డులెందుకిచ్చిందో చెప్పాలని సవాల్ చేశారు. రాష్ట్రానికి ప్రధాని వస్తే సీఎం స్వాగతం తెలపాలని ఏ చట్టంలో ఉందని ప్రశ్నిం చారు. బీజేపీ సీఎంల అవినీతిపై విచారణ జరప రెందుకని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి రాష్ట్రానికి కాదు.. కనీసం సికింద్రాబాద్ కు ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు.

మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ మోడీ రేషన్‌కార్డుల సంఖ్యను పెంచలేదని విమర్శించారు. రాష్ట్రంలో గురుకులాల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. వ్యవసాయం, ప్రజా పంపిణీ వ్యవస్థలపై మాట్లాడే నైతిక అర్హత మోడీకి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన వర్గాలకు మోడీ చేసిందేమి లేదని విమర్శించారు.

అబద్ధాల మోడీ:డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనలో అబద్ధాలాడారని రైతు బంధు సమితి చైర్మెన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. పీఎం ప్రసంగంలో కొత్తదనమేమీ లేదన్నారు. బీబీనగర్ ఎయిమ్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయిస్తే, అది తామే కేటాయించినట్టు ప్రచారం చేసుకున్నారని తప్పు పట్టారు. హైదరాబాద్ మెట్రోలో కేంద్రం ప్రమేయం లేకున్నా గొప్పలకు పోయాడని ఎద్దేవా చేశారు. జాతీయ రహదారులకు తొమ్మిదేండ్లలో కేంద్రం రూ.20 వేల కోట్లు కేటాయిస్తే ప్రజలు ఇప్పటికే టోల్ రూపంలో రూ.9 వేల కోట్లు కట్టారని తెలిపారు. తొమ్మిదేండ్లలో ఒక్క రేషన్ కార్డు కేటాయించలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ బీజేపీ దొడ్డిదారిన తెలంగాణను కబలించడానికి చేస్తున్న ప్రయత్నాలకు మోడీ సహకరించినట్టుగా ఉందని విమర్శించారు.

ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అంటే భారతీయ జనతా సర్కస్ పార్టీ అనీ, అభివృద్ధి ముసుగులో ఎన్నికల డ్రామాలాడారని విమర్శించారు. పేరెడ్ గ్రౌండ్‌లో మోడీ సినిమా అట్టర్ ఫ్లాప్ అయిందని తెలిపారు. అసలు ప్రధాన మంత్రి వచ్చింది దేనికి? కొత్త పథకాల శంకుస్థాపనకా? పాతగోడలకు సున్నాలు వేయడానికా? అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ ది కుటుంబ పాలన కాదు ఉద్యమ పాలన అని స్పష్టం చేశారు. కేసీఆర్ ఉద్యమ సూర్యుడయితే కేటీఆర్, హరీష్ రావు, కవిత ,సంతోష్ రావులు నాలుగు దిక్కుల్లో పోరాడిన వీరులని కొనియాడారు. అవినీతిలో అగ్రస్థానాలన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలవేనని విమర్శించారు.

లింగాయత్‌లకు కాంగ్రెస్ అగ్రతాబూలం

- ఇప్పటికే 43 టిక్కెట్లు కేటాయింపు

బెంగళూరు : కర్నాటక ఎన్నికల్లో అత్యంత ప్రభావం చూపే సామాజిక తరగతుల్లో ఒకటైన లింగాయత్‌లకు కాంగ్రెస్ అగ్రతాబూలం ఇస్తోంది. రెండు విడతల్లో 166 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ వారిలో 43 స్థానాలను లింగాయత్‌లకు కేటాయించడం విశేషం. అయితే 224 సీట్లకు గానూ కనీసం 55 టిక్కెట్లను తమ సామాజిక తరగతికి ఇవ్వాలని కాంగ్రెస్‌లోని లింగాయత్ నాయకులకు డిమాండ్ చేస్తున్నారు. అంటే మరో 12 టిక్కెట్లు తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మార్చి 29న ఎన్నికల కమిషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ముందుగానే వీరు తమ డిమాండ్లపై పట్టుబట్టడం మొదలుపెట్టారు. మే 10న జరగనున్న ఎన్నికల కోసం కాంగ్రెస్ మార్చి 25న 124 మంది అభ్యర్థులతో మొదటి జాబితా రూపొందించగా, ఏప్రిల్ 6న 42 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదలైంది. 166 టిక్కెట్లకు గానూ 43 టిక్కెట్లు లింగాయత్‌లకు ఇచ్చారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ 43 టిక్కెట్లు లింగాయత్‌లకు ఇచ్చింది.

ముఖ్యమంత్రి అభ్యర్థిగా లింగాయత్ నేత బి.ఎస్.యడ్యూరప్పను పాలక బీజేపీ తెరపైకి తీసుకురాకపోవడంతో ఎన్నికల్లో లింగాయత్ మద్దతును పొందే అవకాశాలు తమకే బాగా వున్నాయని కాంగ్రెస్ లింగాయత్ గ్రూపు భావిస్తోంది. అయితే కాంగ్రెస్ లింగాయత్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరూ లేరు. మొత్తంగా లింగాయత్ కమ్యూనిటీ కాంగ్రెస్ వైపే వుందని ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. టిక్కెట్లు ఎక్కువగా ఇవ్వడం వల్ల పార్టీ విజయావకాశాలు మెరుగయ్యాయని లింగాయత్ నేత ఈశ్వర్ ఖండ్రె తెలిపారు.

కర్నాటక ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా పాలు



బెంగళూరు : కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో ఈ దఫా పాలు, పెరుగు కూడా ప్రచారాస్త్రాలుగా మారాయి. రాష్ట్రంలో సహకార సంఘంగా నడుస్తున్న నందిని పాలు, పాల ఉత్పత్తులకు విశేష ఆదరణ ఉంది. కన్నడ ప్రజాజీవనంలో నందిని ఒక భాగంగా మారిన నేపథ్యంలో అమూల్ పాలు, పాల ఉత్పత్తులను ప్రవేశపెట్టారు. నందిని పాల ఉత్పత్తుదారుల జీవితాలతో అమూల్ ప్రవేశపెట్టడం ద్వారా బీజేపీ చెలగాటం ఆడుతున్నదని అక్కడి ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అమూల్ పాల సరఫరాపై నిషేధం విధించాలని జేడీఎస్, కాంగ్రెస్‌తో పాటు పలు కన్నడ సంస్థలు డిమాండ్ చేశారు. ఈ విమర్శలపై ముఖ్యమంత్రి బొమ్మై స్పందిస్తూ అమూల్ పాలను కొంతమంది ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటుంటే తామెలా ఆపగలమని చేతులెత్తేశారు. దీంతో ఈ దఫా ఎన్నికల్లో నందిని వర్సెస్ అమూల్ ఒక ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. నందిని సంస్థను అమూల్ విలీనం చేయాలని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచించినట్టు వార్తలు రావడంతో అది కన్నడనాట మరింత ఆగ్రహాన్ని రాజేసింది. పుండుపై కారం చల్లినట్టుగా నందినీ పెరుగు ప్యాకెట్‌పై హిందీ పదం దహి వుండాలని కర్నాటక పాల సమాఖ్యకు ఒక నిబంధన పెట్టడం కన్నడిగుల కోపం కట్టలు తెంచుకుంటున్నది. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని, నందినిని కాపాడాలని, వాటి ఉత్పత్తులను రక్షించాలని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పటికే డిమాండ్ చేశారు. అమూల్‌ను వ్యతిరేకించి, నందినిని కాపాడేందుకు పోరాటానికి సిద్ధమవాలనీ, కర్నాటక గౌరవాన్ని కాపాడాలని పలు కన్నడ సంస్థలు పిలుపునిచ్చాయి. 'నందిని అన్నది మనకు గర్వకారణం. దాన్ని ఎవరూ మన దగ్గర నుంచి దోచుకోలేరు' అని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్ అన్నారు. అమూల్ పాల సరఫరాను ఆపకపోతే తమ పోరాటం కొనసాగుతుందని అనేక కన్నడ సంస్థలు ప్రకటించాయి. వేసవి కావడంతో నందిని పాలు, పెరుగు, నెయ్యి కొంతమేరా తగ్గింది. దాంతో ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్న దశలో అమూల్‌ను బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోకి తీసుకొచ్చిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. కర్నాటకలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో కూడా నందిని అగ్రస్థాయి పాల ఉత్పత్తిదారుగా నిలిచింది. సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో నందిని ఉత్పత్తులన్నింటినీ తప్పనిసరిగా కాపాడతామని ముఖ్యమంత్రి బొమ్మై శనివారం ప్రకటించారు.

చట్టానికి మానవత్వం అవసరం

- సీజేఐ డీవై.చంద్రచూడ్

గువాహతి: ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు చట్టం మానవత్వంతో వ్యవహరించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. సమస్య మూలాన్ని తెలుసుకోవాలనీ, దానిని పరిష్కరించేందుకు చట్టం ఎల్లప్పుడూ కృషి చేయాలని నొక్కి చెప్పారు. గువాహతి హైకోర్ట్ 75వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగిస్తూ.. చట్టం సమాజంలోని వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని వాటిని ఆచరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. చట్టాన్ని కూలంకషంగా అర్థం చేసుకుని ఆచరణలో పెడితే సమాజ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందనీ, న్యాయం లభించే దిశగా అది ఒక ముందడుగు అవుతుందని తెలిపారు. 'స్వతంత్ర న్యాయవ్యవస్థపై ప్రజలు ఆధారపడతారు. వారి నమ్మకం, విశ్వాసంపైనే న్యాయవ్యవస్థ చట్టబద్ధత ఆధారపడి ఉంటుంది. ఆపన్నులైన ప్రజలకు న్యాయస్థానం మొట్టమొదటి, చిట్టచివరి ఆశాకిరణం కావాలి. జాతి నిర్మాణంలో శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు మూడూ పాలు పంచుకోవాల్సి ఉంది' అని చంద్రచూడ్ ఆకాంక్షించారు.

నేటితో ముగియనున్న మహిళా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్య , సమాచార పౌర సంబంధాల శాఖలు హైదరాబాద్ లో సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా జర్నలిస్టుల ఉచిత ఆరోగ్య శిబిరం గడువు నేటితో ముగియనున్నది. గత పది రోజులుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ శిబిరంలో 300 మందికిపైగా మహిళా జర్నలిస్టులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆరోగ్య శిబిరాలను ప్రారంభిం చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మహిళా జర్నలిస్టులకు ఈ మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌తో పాటు ఆరోగ్య శిబిరాలను అన్ని జిల్లాల్లో కూడా ప్రారంభించారు. మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అక్రిడిటేటెడ్ మహిళా జర్నలిస్టులతో పాటు, పత్రికా, న్యూస్ ఛానెళ్లలో పనిచేస్తూ ఆయా సంస్థల గుర్తింపు కార్డులు ఉన్న మహిళా జర్నలిస్టులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. రక్త పరీక్ష సీబీపీ, బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ బీ12, డీ3 తదితరాలతో పాటు,ఈసీజీ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్‌స్మియర్ వంటి రోగ నిర్ధారణ పరీక్షలును శిబిరాల్లో ఉచితంగా చేశారు.స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు చేస్తున్నారు. పరీక్షల నివేదికలను అదే రోజున అందజేస్తున్నారు. హైదరాబాద్‌లో వైద్య అధికారులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల స్వీయ పర్యవేక్షణలో ఆరోగ్య శిబిరం కొనసాగుతున్నది. పరీక్ష లు చేయించుకున్న మహిళా జర్నలిస్టులు ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారంతో ఆరోగ్య శిబిరం ముగియనున్న నేపథ్యంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోలేని మహిళా జర్నలిస్టులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సమాచార శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

24 గంటలు షాపులు తెరిచే ప్రతిపాదనలు విరమించుకోవాలి:ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 24 గంటల పాటు షాపులు తెరిచే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్ఎల్ పద్మ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యాపారస్తులకి, యాజమాన్యాలకు మాత్రమే ప్రభుత్వ నిర్ణయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల కార్మికులకేం ఉపయోగమని ప్రశ్నించారు. వివిధ షాపుల్లో పనిచేస్తున్న అనేకమంది కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు కావడం లేదని తెలిపారు. ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. వారికి ఎలాంటి చట్టబద్ధ హక్కులు అమలు కావటంలేదని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు కావటం లేదని తెలిపారు.

లైంగిక, యాసిడ్‌దాడికి గురైన యువతి మృతి

జైపూర్ : రాజస్థాన్‌లోని బర్మర్ జిల్లాలో లైంగిక, యాసిడ్ దాడికి గురైన దళిత యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం చనిపోయింది. పోలీసుల వివరాల ప్రకారం..షాకూర్ ఖాన్ అనే వ్యక్తి యువతి ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. రక్షించేందుకు పొరుగు వారు వస్తుండగా ఆమెపై యాసిడ్ పోసి నిప్పంటించాడు. అక్కడ నుంచి పరారయ్యాడు. నలభై శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరిన యువతి ఆ తర్వాత ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద అతనిపై అభియోగాలు మోపారు.

లైంగికదాడి కేసు బదిలీకి 'నో'

న్యూఢిల్లీ : లైంగికదాడి కేసు విచారణను పురుష న్యాయమూర్తి నుంచి మహిళా న్యాయమూర్తికి బదిలీ చేసేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. బదిలీకి అంగీకరిస్తే ఈ తరహా కేసులను ప్రత్యేక కోర్టులకు పంపాలంటూ పుంఖానుపుంఖాలుగా అభ్యర్థనలు వస్తాయని వ్యాఖ్యానించింది. పోర్నోగ్రఫీ వెబ్‌సైట్‌లో బాధితురాలి ఫొటోను దుర్వినియోగం చేశారంటూ దాఖలైన ఈ కేసు విచారణ కోర్టులో అపరిష్కృతంగా ఉంది. లైంగిక ఆరోపణలను విచారించే కోర్టు నుంచి ఈ కేసును బాలల పరిరక్షణ కోర్టుకు బదిలీ చేయాలంటూ బాధితురాలు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ కోర్టుకు హాజరు కావడం తనకు సౌకర్యవంతంగా లేదని ఆమె వాపోయారు. అందువల్ల కేసును మహిళా కోర్టుకు బదిలీ చేయాలని అభ్యర్థించారు. అయితే కేవలం ఆందోళన చెందిన కారణంగా కేసును బదిలీ చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది.